నవభారతి

సాహిత్యా సాంస్కృతిక మాస పత్రిక

అక్టోబరు 1959

మూల్యం : రూపాయి

నవభారతి కార్యాలయం

గాంధీనగరం * విజయవాడ-2

విషయసూచిక

మనము - మన పోకడలు	సంపాదకీయం	3
శుభాకాంక్షలు		6
యోగదర్శనము	వేలూరి శివరామశాస్త్రి	7
దర్శనములు - న్యాయము	గోపదేవ్	17
పూలపూజలు	'అనూనా'	22
ఉపాయనము	బిట్రా భావనారాయణ	23
భారతీయ చిత్రకళ	దివ్యజ్ఞాన సరోజినీదేవి	24
నివేదనము	వెల్దండ ప్రభాకరరావు	30
విజేత	'అమరేంద్ర'	32
రెండవ లూనిక్	వసంతరావు వేంకటరావు	36
శ్రీ మదాంధ్ర వేదాంతపంచదశి	జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి	41
సాహిత్యము - రాచకార్యములు	'కౌటిల్యుడు'	43
భామినీవిలాసము	శ్రీనివాస సోదరులు	45
నాట్యశాస్త్రమ్	పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి	48
పూర్వసిద్ధజ్ఞానము	బెర్ట్రండ్ రసెల్ అనువాదం జి. యస్ యన్	55
గోవింద రామాయణము	ఆత్మకూరి గోవిందాచార్యులు	61
నందమూరు శతకము	విశ్వనాథ సత్యనారాయణ	65
ఆంధ్ర తర్కసంగ్రహము	కుప్పా బైరాగిశాస్త్రి	67
ఆకు కూరలు	గూడూరి నమశ్శివాయ	73
గ్రంథపరిచయము	జాస్తి జగన్నాథం	78
మాసఫలములు	'బుధ'	82

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 2 | విజయవాడ * అక్టోబరు 1959 | సంచిక 2

మనము - మన పోకడలు

మనకు ఆంధ్రరాష్ట్రము వచ్చినది మన పరిపాలన యే భాషలో జరుగవలెనో నేటివరకు నిర్ణయము కాలేదు అయినా పరిపాలన పర భాషలోనే జరుపబడుచున్నది. పరుల పరిపాలన పోయినా, పరభాషా ప్రాబల్యము ప్రబలముగానే యున్నది. ఇందుకు కారణాలేవేవో మనపాలకులు, పెద్దలు చెప్పేస్తున్నారు

గ్రాంధికమా? శిష్టవ్యవహారికమా? వ్యవహారికమా? జానపదవాఙ్మయమా? గ్రామీణమా? ఏది పరిపాలనాభాష కావలెను? దీనిని యే లిపిలో వ్రాయవలెను? ఈమొదలైనవి తేలక తర్కవితర్కములతో కాలక్షేపముచేయడము చూచుచున్నాము.

ప్రాంతీయపరిపాలన యే భాషలో, యే లిపిలో జరుపవలెను? పాఠశాలలలో, విశ్వవిద్యాలయములలో యేది బోధనాభాషగా నిర్ణయించవలెను? ఇది తేలని సమస్యగానే ఉన్నది ఇంతేకాదు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వముల పరిపాలనా వ్యవహారములకు హిందీగాని, ఇంగ్లీషుగాని, ఇందులో ఒక్కటి యెవరికివారు నిర్ణయించుకోవచ్చునని యెట్టకేలకు పార్లమెంటులో తీర్మానించినారు. ఇప్పటికి యెంతో కాలము నుండి ఆందోళన చేయగాచేయగా యీ ఫలితము వచ్చినది. దాదాపు నలుబదికోట్ల భారతీయులలో భాషాపరిజ్ఞానము కలిగించి, పౌరబాధ్యతలు నిర్వహించుటకు కృషి చేయవలసియున్న యీనాడు మన యీ నడవడి దేశాభ్యుదయమునకు దోహదము చేయునో లేదో విచారించుకోవలసి యున్నది.

మాతృభాష ముఖ్యమా? జాతీయభాష ముఖ్యమా? లేక ఆంగ్లభాష ముఖ్యమా? విద్యావిజ్ఞాన సముపార్జనకు యేది ముఖ్యము? ఇవియేవీ యింతవరకు నిర్ణయించబడలేదు పరపాలనలో వర్ధిల్లిన పాలితవ్యవస్థ, విద్యావ్యవస్థ చెక్కుచెదరకనే యున్నవి. ఇది దేశాభిమానమో, లేక ప్రాంతీయాభిమానమో లేక మరే అభిమానమో యెవ్వరికి తెలియడంలేదు

మనకందరకు స్వజాతీయాభిమానము ఉన్నది. స్వతంత్రాభిమానము ఉన్నది. స్వధర్మాభిమానము ఉన్నది. స్వభాషాభిమానము ఉన్నది. ఇన్నియుండికూడ యిలా యెందుకు ఉన్నామో బోధపడటంలేదు.ఇందుకు యేదోకారణము ఉండి ఉండవలెను. లేనిచో మన నాయకులు సామాన్యులా? మనపెద్దలు సామాన్యులా? ఏదో ఒక పరిష్కారాన్ని భారతజాతీయ పద్ధతిలో ఆలోచిస్తూ ఉండి ఉంటారు. ఇందుకు ఎవ్వరినీ మనం నిందించవలసిన పనిలేదు.

మనదేశము పురోగమించుచున్నది మనవిద్య పురోగమించుచున్నది. మన భాష పురోగమించుచున్నది.మనము పురోగమించుచున్నాము. మన పురోగమనాన్ని చూడలేని అభివృద్ధి నిరోధకులు అనే మాటలను మనం లెక్కించనవసరములేదు

మనకు మన సంప్రదాయము, సంస్కృతి, సంస్కారమున్నవి. మనము మన జాతీయపద్ధతిలో సోపలిష్టు విధానములను రూపొందించుచున్నాము మనము విశ్రాంతిలేని జీవితయాత్ర సాగించుచున్నాము మన యీ జీవితయాత్రను అర్థం చేసుకోలేనివారు అవాకులు చవాకులు పేలేస్తున్నారు ఇవేవీ పట్టించుకోనవసరములేదు

ఈ దేశములోని కళలన్నింటినీ మనమే ప్రోత్సహించుచున్నాము అందరికీ బిరుదులిచ్చుచున్నాము.కళాప్రపూర్ణులకు కానుకలర్పించుచున్నాము. ఇంత కొద్దికాలములో ఇన్ని ఘనకార్యములు చేసినా మెచ్చుకోలేకపోవుచున్నారు.ఇందుకుబహుశ మనలోని సనాతన ధర్మకాంక్షయే కారణమై ఉండవచ్చును దీనిని మనము మనలోనుండి సాధ్యమైనంతత్వరలో తొలగించుకొనవలెను లేనిచో చిక్కుల పాలగుదుము.

సనాతనము గ్రుడ్డిదని ఒక వాదన అధునాతనము అంతకన్నా గ్రుడ్డిదని మరొక వాదన. సనాతనమును, అధునాతనమును సమన్వయము చేయవలెనని వేరొక వాదన. ఇది సాధ్యమో, అసాధ్యమో ఎవరికివారు ప్రశ్నించుకోవలెను. తమకుతామే సమాధానము పొందవలెను ఇది నేటి సమస్య ఈ సమస్యను పరిష్కరించేదెవరు ? మనలో పండితులు, తత్వజ్ఞులు, వేదాంతులు, యోగులు, జోగులు, ఋషులు, సంసారులు, సామాన్యులు, సన్యాసులు ఉన్నారు మనలో ఒకరేమిటి అన్నితరహాల వారు ఉన్నారు ఈ వీరందరికి వృత్తి నిర్వచనమాత్రం చేయకూడదు అందరినీ సమభావముచేసి చూడవలెను అందరితో సమతాధర్మము కలిగి ప్రవర్తించవలెను. అందరూ ఉత్తములేనని ప్రశంసించవలెను. ఇవే మన సమస్యలు ఈ యీ సమస్యలను ప్లానుప్రకారము పరిష్కరించుకోవలెను. కాలము అతివిచిత్రమైనది. ఈకాలాన్ని క్రమబద్ధంచేసి మనమందరము సమానముగా అనుభవించడానికి కార్యక్రమాన్ని నిర్ణయించుకోవలెను. దీనికి కర్త లెవ్వరని ప్రశ్నించగూడదు. ఇందుకు అందరము కర్తలమేఅని అనుకోవలెను. చిన్న,పెద్ద తరగతులనేవిలేవు హెచ్చు,తగ్గులనేతారతమ్యములు లేవు. అంతా సంపన్నమైన భావమే అందరూ సంపన్నులే. హెచ్చుతగ్గులనేవి, తారతమ్యము లనేవి,వ్యత్యాసములనేవి అన్నీ మానవకల్పితములే. వీటన్నింటినీ నవీనులు తిరస్కరించారు ఎవరికివారే కర్తలు, నిర్ణేతలు, సర్వాధికారులు, సర్వసంపన్నులు, సర్వజ్ఞులు. ఇది నేటి కాలజ్ఞాన నిర్ణయము. దీనిని యెవరూ కాదనకూడదు.

మనము నవీనులము భాషనుగురించి, భావమునుగురించి, సంప్రదాయమును గురించి, సంస్కారమును గురించి, సంస్కృతిని గురించి, కళనుగురించి, సాహిత్యమును గురించి, సంగీతమును గురించి,న్యాయమును గురించి, ధర్మమునుగురించి ప్రతి ఒక్కరూ నిర్ణయము చేయవచ్చును. ప్రతి ఒక్కరూ పరిపాలనలో ప్రతినిధులు కావచ్చును. మంత్రి కావచ్చును. ప్రధానమంత్రి కావచ్చును. ఒకరేమిటి ఎవరు ఏది

కావలెనన్ననూ కావచ్చును. ఇన్ని సదవకాశములు, ఇన్ని సదుపాయములు ఇన్ని సద్లక్షణములు కలిగిన పరిపాలన మనకందరికి ఉన్నది. ఇది ఒక గొప్పఅవకాశము. ఈ అవకాశమును వినియోగించుకొనువారిపై అంతయు ఆధారపడి యున్నది.

మన ప్రభువులు సామాన్యులు అందువలన మనలోని పండితులు, విజ్ఞానవంతులు, కళావేత్తలు, భాషాకోవిదులు సామాన్యముగా వ్యవహరించవలెను పాలకులపై ఆదరాభిమానములు ఉంచి, పాలితుల యెడల వ్యవహరించవలెను. ఎలా వ్యవహరించవలయునన్నది గోప్యముగా నుంచవలెను. ఇది రాచకార్యము. మన మీ రాచరికములో నున్నాము మన ప్రభువులయెడల మనము విధేయులమై ఉండవలెను.ఇది తప్పినచో మన వృత్తి తప్పిపోవును అంటే కడుపుగొడవ కడగండ్ల పాలగును. "ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటికా మాటలాడి..." అన్న ఆర్యోక్తిని అక్షరాలా అమలుచేయవలెను. ఇది యిప్పటివరకు అనుసరిస్తున్న శృతివాక్యము. ఒకొక్క కాలములో ఒకొక్క ప్రభువు అండదండలలో ఒకొక్క తీరుగా ప్రవర్తించి యిప్పటివరకు మా ఆధిక్యతను ఆరాధింప చేయించుకుంటూనే వచ్చితిమి. ఇది మా జీవిత పరమ రహస్యము దీనినెవరూ తెలుసుకొనగూడదు. ఇది యేమిటని ప్రశ్నించగూడదు ఇది వ్యవహార వేదరహస్యము ఇది కాదని వాదనచేసినవారికి కాలతత్వ జ్ఞానమున్నది. జాగ్రత సుమా! తస్మాత్ జాగ్రత సుమా! అని హెచ్చరిక చేయుచున్నాము. మా యీ హెచ్చరికలలో మాయామోహితులయి పడి యుంటున్నారు. పడియుంటారు. ఉండక ఏమి చేయగలరు?

ఇంగ్లీషే ఉత్తమమైనభాష ఇంగ్లీషులోనే విజ్ఞానమంతయున్నది ఇంగ్లీషు లేనిచో వెనుక పడిపోవుదుము. ఇది ఒక వాదన. సంస్కృతమే అత్యుత్తమమైన భాష. సంస్కృతములోనే విజ్ఞానశాస్త్రములన్నియు నిమిడియున్నవి సంస్కృతము లేనిచో మనము చెడిపోయెదము ఇది మరియొక వాదన. ఇందులో యేవాదము ఉత్తమమైనది? ఏది మనకు యోగ్యమైనది? ఏది మనమందరము అనుసరించతగినది? ఈ యీ ప్రశ్నలకు సమాధానము యెచ్చటను వివరించి చెప్పబడదు. ఇందులోనే యేదో ఆంతర్యము ఉండి ఉండవచ్చును. ఈ ఆంతర్యము తెలుపబడదు,

శ్రీయుతులు జయంతి రామయ్యపంతులు, గిడుగు రామమూర్తిపంతులు, విశ్వనాథ సత్యనారాయణ, వడ్లమూడి గోపాలకృష్ణయ్య, శ్రీరంగం శ్రీనివాసరావు, బండి బుచ్చయ్య, మాధవపెద్ది గోఖలే మొదలైనవారందరూ భాషాకోవిదులే. ఈ వీరందరూ మనఆంధ్రభాషా లలామకు నీరాజనములు ఇచ్చినవారే. ఈఅభినవాంధ్ర వాఙ్మయ కోవిదులలో ఎవరిని అనుసరించిన మన పరిపాలన, భాషావ్యవహారము చక్కబడునో మన విశ్వవిద్యాలయ విజ్ఞానము పురోగమించునో త్వరలో నిర్ణయము చేయవలసియున్నది. ఈ యీ తర్కవితర్కములను సాంగోపాంగముగా చర్చించి ప్రజామోదమునకై పరిపాలకులు, పండితులు ఒక చర్చావేదిక యేర్పరచి త్వరలో ఆంధ్రుల చిర కాలవాంఛ నీడేర్చు నిర్ణయము చేయగలరని ఆశించవచ్చునా?

శుభాకాంక్షలు

[మద్రాసు రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి, అఖిలభారత సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు, నవభారతి గౌరవ సంపాదకులు గౌ. శ్రీ పాకాల వేంకట రాజమన్నారుగారు పంపిన సందేశమును యిచట ప్రచురిస్తున్నాం. సం]

పి. వి. రాజమన్నారు
మద్రాసు ప్రధాన న్యాయమూర్తి.

మద్రాసు
22-9-59

సాహిత్య సాంస్కృతిక మాసపత్రికను నడపడంలో ఉన్న చిక్కులు నేను స్వంతంగా అనుభవించినవాడిని గనుక 'నవభారతి'ని అత్యుత్తమ పద్ధతిలో ఒక సంవత్సరం నిర్వహించిన శ్రీ చదలవాడ పిచ్చయ్యగారి కృషి, సమర్థత, ఉత్సాహం మెచ్చుకొంటున్నాను. 'నవభారతి' ఆంధ్రసారస్వత ప్రపంచంలో గౌరవం సంపాదించుకొన్నమాట వాస్తవం. ప్రజాదరణ పొందడానికి కొంతకాలం పడుతుంది

'నవభారతి' అనే పేరులో రెండు భావాలు మిళితమై ఉన్నాయి - నవ్యత్వం భారతీయ సంప్రదాయం. ఈ రెండింటిని సమన్వయించడానికి ప్రయత్నం చేస్తోంది ఈ పత్రిక పాతక్రొత్తల మేలు కలయికయే సాహితీ వికాసానికి దోహదం చేయగలదని పత్రిక సంపాదకుల విశ్వాసం. నా అభిప్రాయమూ అదే. నవభారతి ప్రయత్నం సఫలమవుతుందని నా నమ్మకం. విజయీభవ!

(సం.) రాజమన్నారు

యోగదర్శనము

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

౬

సాంఖ్య సృష్టి ప్రక్రియ

సాంఖ్యులలో కొందరు చెప్పు సృష్టిప్రక్రియయు గమనింపదగినది దాని సంగ్రహమిది ప్రకృతి తనకు దా కలగి జీవవిశేషుడగు నారాయణునితో కలియును పిదప మహత్తత్త్వమారంభమగును. ఇది చిజ్జడాత్మకము ఇందు జడాంశము పుట్టును. చేతనాంశ మభివ్యక్తమగును ఈ రీతిగనే సృష్టికి మొదట ప్రకృతికలయికచే జీవవిశేషభూతయగు శక్తి అభివ్యక్తమగును ఇదియే ఆదిశక్తి. మహాలక్ష్మి మహాసరస్వతి మహాదుర్గ యీ మొదలగు పేర్లతో పురాణాదులు కీర్తించున దీశక్తినే.

జీవగతములగు విశేషములు ఔపాధికములు విశేషములు పొటమరింపకముందు నిర్విశేష జీవసమష్టి బ్రహ్మశబ్దవాచ్యము. సవిశేషజీవసమష్టి నారాయణుడు లేక స్వయంభువు విశేషములు ఔపాధికములే ఆ యుపాధి లింగశరీరము. ఉపాధి ఆత్మచైతన్యమునకు అభివ్యక్తిస్థానము ఎమ్మొదట నారాయణున కుపాధియగు లింగశరీరము ఒకటియే పుట్టును పిదప తండ్రి లింగశరీరమునుండి పుత్రలింగశరీరమువలె నారాయణుని లింగశరీరమునుండి జీవుల లింగశరీరములు విడివడును. ఈ నారాయణుడు సూక్ష్మములును అల్పములును అగు స్వలింగశరీరావయవములను స్వాంశములగు చేతనలకు కూర్చి ప్రాణికోటిని సృజించును

జీవులసలు భిన్నులే జీవసమష్టి నారాయణుడు. జీవులలో పరస్పరము భేదము స్వయముగ నున్నదే దీపముచే ఘటాదులవలె శరీరాదులచే ఆ భేదము అభివ్యక్తమగును

స్థూలశరీరోపాధికుడు నారాయణుడు మహత్తత్త్వమునుండి పది అంశలు తక్కువగా అహంకారము దానినుండి తన్మాత్రద్వారమున ఒకదానికంటె మరియొకటి పది పది అంశములు తక్కువగా పంచభూతములును పుట్టును. ఇది స్థూలశరీరమునకు బీజము. ఇది అండరూపముగా పరిణమించును. ఆ అండము నడుమ తద్దశమాంశమగు పదునాలుగు భువనములు, నారాయణుని స్థూలశరీరము

పరిణామము

విత్తు చెట్టగుచున్నది, గ్రుడ్డు పిల్ల అగుచున్నది ఇటులగుట కెన్నియో అవస్థలు గడపవలసియున్నది. ద్రవ్యమొక అవస్థనుండి ఇంకొక అవస్థపడయుట పరిణామము. ఇందు ఒక అవస్థనుండి ఇంకొక అవస్థపడయుట అనునది క్రియ లేక వ్యాపారము. క్రియచే ఈ పరిణామము. పరిణతిలో కారణమొకటియే కార్యముగా రూపాంతరమొందును అనగా కారణస్వరూప మవస్థావిశేషము పొంది కార్యమై కానవచ్చును.

ఇట రూపాంతరమే భేదము. గ్రుడ్డే పిల్ల, విత్తే చెట్టు రూపాంతరమొందుట నిత్యము, పరిణామము నిత్యము.

గ్రుడ్డు పిల్లగ మారునపుడును విత్తు చెట్టుగ మారునపుడును పరిణామవ్యాపారము పెక్కుఅవస్థల లయోదయముల నడుమ నడచును పదపడి కార్యముగా కనబడును కావున కార్యము కారణముయొక్క పరిణతి కారణమునం దొకశక్తిఉండును. శక్తికి కదలిక కలిగినంతనే పూర్వావస్థమారి మరియొక యవస్థకలుగును గ్రుడ్డు, విత్తు, మొదలగువాని లోలోపల ఈశక్తి పేరియుండును అది నిండుగా విప్పారుటకు పలు అవస్థలుపొందును ఇటులు పొంది గ్రుడ్డు పిల్లగను విత్తు చెట్టుగను బయటపడును

ఏ వస్తువును క్రొత్తగా పుట్టుకొని రాదు మరి? అభివ్యక్తమగును క్రొత్తగా పుట్టుట యన ఇదివరకు లేనిది యిపుడు క్రొత్తగా పుట్టుటయని మన మనుకొందుము. కాని లేనిదేదియు పుట్టదు అటులు పుట్టుననుచో అభావమునుండి భావముత్పన్నమగు నని చెప్పుటయే ఇది అసంభవము నూవులలో నూనె అవ్యక్తముగా నున్నది కాన వానినుండి నూనె పుట్టును ఇసుకలో లేదు ఇసుకను గానుగాడినను నూనె రాదు కనుక అభావమునుండి భావోత్పత్తి నంగీకరించుచో కార్య కారణభావమునకు ఒక నియమమేర్పడదు దేనినుండియేని ఏదియేని పుట్టవలసివచ్చును కార్యకారణములకు సంగాతమును కాపాడుటకు కారణమందు కార్యము అడగియుండునని చెప్పక తప్పదు. కాని దానికి వెనువెంటనే అభివ్యక్తి ఉండకపోవచ్చును పెక్కుఅవస్థలు కడచిన పిదప కార్యమునకు పూర్ణాభివ్యక్తి కలుగవచ్చును ఈ అవస్థలన్నియు పరిణామసోపానములు అవ్యక్తమగు కార్యమీయవస్థల ననుభవించిన తరువాత వ్యక్తమగును. పరిణామమునకు క్రమమున్నది కార్యకారణభావము క్రమికమగు నీయవస్థలదాటిన తరువాత వెల్లడియగును పరిణామవాదమందు శక్తి నిత్యము ఈ శక్తికే రూపాంతరత్వము స్థూలదృష్టికి శక్తి సులభముగా బోధపడదు

వ్యక్తమగుఅవస్థ కార్యము అవ్యక్తమగు అవస్థ కారణము కార్యములన్నియు కారణమగు ప్రకృతిలో అడగిపోయియున్న అవస్థ, ప్రలయము. ఆ ప్రకృతియే అవ్యక్తము. అవ్యక్తముగానున్న ప్రకృతి సృష్టికి మొగియగనే రూపాంతర మారంభమగును ఈపరిణామమిటులు కొంతకాలము జరుగుచుబోవును ఇది స్థితి. పదపడి మరల బీజావస్థకు మారును ఇంతియకాని దీనికి నాశమనుమాట ఉండదు. ఇంత మఱ్ఱిచెట్టుగూడ బీజమం దడగిపోవును కార్యము నిత్యము కాకున్నను కారణము మాత్రము అవినాశి. కారణమే నశించినచో ఉత్పత్తియనుమాట ఉజాడయిపోవును కావున ప్రవాహశీలమగు పరిణామమున కొన్ని కొన్ని కార్యములు అధికకాలము, కొన్నికొన్ని కార్యములు అల్పకాలము ఉండును. కాని ఇం దేపరిణామమేని నిత్యముకాదు. ప్రతి పదార్థము ప్రతిక్షణము అవస్థాంతరము పొందుచుండుటయే దీనికి కారణము కావున పరిణామమనగా ఒకానొక సమయమం దభివ్యక్తి మరియు ఒకానొక సమయమందు స్థితి. లయముండుటజేసి కార్యముల ఉత్పత్తి స్థితులకు నిత్యతలేదు ప్రలయమునం దీ సృష్టి యెల్ల అవ్యక్తములోనికి జనును.

మరియొక సర్గమున మరల ఆవిర్భావమొందును ఇది పరిణామస్వభావము. ఇది శాశ్వతము దీనికి అలపును సొలపును లేదు ఇటులెన్ని సర్గములాయెనో ఎన్ని కాగలవో ఎవరును చెప్పజాలరు ప్రకృతిశక్తి నిత్యము ప్రకృతికో పరిణమించుటయే స్వభావము కావున సృష్టి నిత్యము. కావుననే ఇది అనాది.

కార్యమునందు క్రొత్తయేమియు నుండదు ఏలనగా కారణమే కార్యము. కారణములో లేనిది నలుసంతేని కార్యమునం దుండదు కార్యము కారణముయొక్క అభివ్యక్తి కావున కారణముకంటె కార్యము వేరుకాదు ఈ సృష్టియందెటచూచినను విడనాడరానిదియు మారనిదియు నగు నొక నియమము కలదు ఇది అఖండము గుణముల హెచ్చుతగ్గుల సంబంధమువలన ద్రవ్యముయొక్క రూపము వేరయినను పరిణామ స్వరూపము మారదు, అనగా కారణముకంటె కార్యము వేరుకాదు ఈ నియమము నియమమే (1) ఇట్టి ఊహాలో సృష్టికి అలంఘనీయమగు నొక క్రమము అదృష్టసారముగా నున్నదని సుజ్ఞేయము

సృష్టికి కారణములు

సృష్టికి ఉపాదానకారణము అచేతనమగు అవ్యక్తము. నిమిత్తకారణము చైతన్యరూపుడగు పురుషుడు. ఈ యిరువురకు సంబంధము కలిగినపుడు అవ్యక్తము వ్యక్తమగును చేతనాచేతనములు రెండును జగత్కారణ మగుటవలన వ్యక్తావస్థ మూడు విధములుగా అగుచున్నది ఒకటి- చేతనమునకు అభిముఖమైన చేతనవంటి అవస్థ రెండు- అవ్యక్తమున కభిముఖమగు ఆవరణావస్థ. ఈ రెంటి కలయికకు ఫలమైన చంచలావస్థ. ఇవియసత్త్వ రజస్తనుస్సులు ఇపుడు వెనుదిరిగిచూచి ప్రకృతిస్సృష్టికి ఉపాదానకారణమయినను ఏకమాత్రమగు నుపాదానమువలన సృష్టి పొసగదనియు విశ్వవికాసమునకు నిమిత్తకారణమగు పురుషుడు నియతముగా ఉండవలయుననియు గ్రహింపగలము. మరియు నిమిత్తమగు చిదవభాసమే అచేతనమగు ప్రకృతిని చేతనమువలె చేయుననియు అపుడె గుణవైషమ్యముచే సృష్టికారంభమనియు తెలియగలము చిజ్జడ సంయోగములో కర్తృత్వోత్పత్తి యనియు కేవల ప్రకృతికిగాని (2) కేవల చిత్తునకు గాని కర్తృత్వము లేదనియు తెలియగలము

మహత్తత్త్వము

ప్రకృతికి విశ్వవికాసము వికృతి. ప్రకృతికి మొదటి వికృతి మహత్తత్త్వము. మహత్తత్త్వమున 'నేను' అను స్ఫురణ. జ్ఞానచేష్టలు రెండును ఈ నేను లో. వ్యావ

"కారణగుణాః కార్యేషు సంక్రామంతి" "కారణగుణములు కార్యమందు సంక్రమించును" అనియే కాక "పుట్టుకకు పూర్వము లేని విశేషము పుట్టిన పిదప ఉండును" అను వైశేషిక మతములో ఒక లేశము – "కారణమునుండి క్రొత్తలు పుట్టును" అని చెప్పు నేటి నవాభ్యుదయవాదుల Theory of Emergent Evolutions, మతమునం జేరును దీనిని సాంఖ్యు లొప్పరు. అద్వైతులును చూ బ్ర స్పూ. శాంకరభాష్య ౨-౩-౭

బ్రహ్మసూత్ర- శాంకరభాష్యమున "రచనానుపపత్త్యధికరణమున" దీని ఖండనము చూడనది.

హారముల కన్నిటికి జ్ఞానములకన్నిటికి ఇది కుదురు. ఈ కుదురే వ్యావహారిక గ్రహీత అస్మితామాత్రస్ఫురణమే దీని స్వరూపము. ఇది శాంతము, మరియు ప్రకాశశీలము. కాని యీ శాంతిగాని యీ ప్రకాశముగాని కేవలము అవికారి కాదు. ఈ జ్ఞాతృత్వ బోధ సకలజ్ఞాత అయిననే మహత్తత్త్వము. ఈ సకలజ్ఞాతయే అటు యోగులు చెప్పు పూర్వసిద్ధుడు, ఇటు శ్రుతిచెప్పు హిరణ్యగర్భుడు లేక అక్షరుడు ఇదియే అసకలజ్ఞాతగాని అల్పజ్ఞాతగాని యగుచో బుద్ధి బుద్ధియు మహత్తత్త్వమును వేరువేరు తత్త్వములు కావు. వ్యాపకతా వ్యాపారసంకరతలను బట్టి యీ భేదము. బుద్ధిలో సర్వజ్ఞత్వమను బీజమున్నది. బుద్ధియు మహత్తత్త్వమును పరప్రకాశకములు. ప్రకాశశీలత యీ రెంటి కిని స్వరూపము. ఈ ప్రకాశము క్రియాశీలము కావున సవికారము

జ్ఞానము ఎపుడు 'నేను నేను' అను ఎఱుకయందే నిలిచియుండునో అపుడు అది మహత్తత్త్వముగా సాక్షాత్కరించును. జ్ఞానమెపుడు 'నేను జ్ఞాతను' అను జ్ఞాతృత్వ ముగా అవభాసించునో అపుడది బుద్ధి మహత్తత్త్వము అస్మీతి మాత్రను బుద్ధి - జ్ఞాన జ్ఞానక్రియా ద్వయస్వరూపము. మహత్తత్త్వమున జ్ఞాతృమాత్రస్ఫురణము బుద్ధిలో జ్ఞాతృత్వస్ఫురణము. 'నేను, నేను' అను ఎరుకమాత్రమే మహత్తత్త్వము. 'నే నెఱుగు వాడను' అను ఎరుకబుద్ధి (3)

అహంకారము

మహత్తత్త్వమునకు అహంకారము వికారము. మహత్తత్త్వము క్రియాశీలము అయినంతనే అనాత్మభావముతో ఆత్మభావమునకు సంబంధమేర్పడును అదియ అభి మానము. 'ఇది నాది, నే నిట్టివాడను, అట్టివాడను' ఈ మొదలగు జ్ఞానములన్నియు అభిమానజాతములు. ఇది క్రియాత్మకము మరియు రాజసికము. బుద్ధికిని అహంకారము నకును ఇదియే భేదము బుద్ధిలో మమత్వమును సక్రియమగు కర్తృత్వమును ఉండవు. అహంకారతత్త్వములో కర్తృత్వబుద్ధికి వికాసము 'నేను' అను ఎఱుకలో 'నేనెఱుగు వాడనుమాత్రమే' అను భావమే కాక సక్రియమగు జ్ఞాతృత్వ మిమిడియున్నది. సక్రి యమగు నీ జ్ఞాతృత్వమే అహంకారతత్త్వములో ప్రధానపాత్ర. ఈ తత్త్వమందు జ్ఞాతృత్వము సక్రియమై 'నేను అనుభవితను, నేను జ్ఞాతను' అని మొరపెట్టును అహం కారతత్త్వమునందు క్రియాజ్ఞానముల రెంటియు స్ఫుటప్రకాశము ఇచట బుద్ధిచే కారముద్భాసితమగును రజస్సుచే క్రియాశీల మగును

మనస్సు

అనాత్మపదార్థము లాత్మవిషయములై యెచట నిలువ యుండునో అది మనస్సు. సంస్కారముల కిది ఆధారము. ఇచట తమోభాగ మధికము కాన ఇది స్థితిశీలము.

---

3. "ఉపాత్త విషయాణా మింద్రియాణాం వృత్తౌ సత్యాం బుద్ధేస్తమోఽభిభవే సతి య సత్త్వసము ద్రేక నోఽధ్యవసాయ ఇతి వృత్తి రితి జ్ఞాన మితి చాఖ్యాయతే" వాచస్పతి.

నేను

మహత్తత్త్వ మిటులు అంతఃకరణత్రయము. ఎన్ని విధములగు జ్ఞానము లుండునో వాని అన్నిటికిని ఇది గని. అందరకును 'నేను నేను' అను స్ఫురణ మున్నది. ఇది ఎన్నియో రకములుగా భాసించును పురుషుడును బుద్ధియు విడదీయుటకు వీలులేని చందముగా అతుకుకొనిపోయినపు డీ నేను స్ఫురించును. ఇదియ అస్మిత. ఇది జ్ఞానమునకును వ్యవహారమునకుగూడ కుదురు. శుద్ధ సత్త్వసంపన్నమైనపు డీ 'నేను' విద్యాపరిణామము అనాత్మభావముతో ఆవరింపబడిన యెడల అవిద్యాపరిణామము వృత్తులు నిరుద్ధమయినపుడు 'నేను' అని మాత్రమే తోచు అవస్థ విద్యాపరిణామము. ఇటులు నిదురలో మనస్సు తమస్సుచే ఆవరింపబడియున్నను 'నేను' అను తెలివి అస్పష్టముగా నుండును ఇది అస్మితకు అవిద్యాపరిణామము. ఈఅస్మితకు పరిణామము స్వాభావికము ఈఅస్మిత లేక 'నేను' ఈ రెండవస్థలయందును ఎటులో ఒకటులు ఉండుట తప్పనిసరి.

ఈ 'నేను' అను నేలమీద అహంకారము మనస్సు అను నీ రెండు బొంగరము లెటులుదయించి ఆడునో చూతము సాత్త్వికాహంకారము జ్ఞానేంద్రియములకు జనకము అహంకారములో వ్యాపారము కలుగును. అపుడిది వేదనాత్మకమగు జ్ఞానమునకు నేను కర్తనని అభిమానించును వేదనను తాను గ్రహించుట కిది జ్ఞానేంద్రియముల సృజించును. అట్టియెడ ఇంద్రియగతమగు అస్మిత మేలుకొనె నన్నమాట. గ్రహీత ప్రకాశ శీలుడు. అతడు విషయప్రకాశు డెటు లగును? ఇంద్రియజన్యమగు నీ బోధవలన. కాగా విషయప్రకాశ మనగా ఇంద్రియముల వలన కలుగు జ్ఞానము.

సంస్కారగతమగు అస్మితనుండి కలలపుట్టుక. ఈ అస్మిత సత్త్వ పూర్ణమగు నేని కలలో ఆనందమును రజఃపూర్ణమగునపుడు కలలో భోక్తృత్వబోధయు కలుగును.

అహంకారగతమగు అస్మిత, విషయములమీద కర్తృత్వము వహించు వ్యాపారములో, కర్మేంద్రియముల పుట్టుక. స్వేచ్ఛాపూర్వక చాలనము కర్మేంద్రియముల స్వభావము. వాక్పాణి పాద పాయూపస్థములు కర్మేంద్రియములు.

తామసాహంకారమునుండి విషయముల లేక భోగ్యపదార్థముల పుట్టుక. ఇచట అహంకారము ఇంద్రియములచే గ్రహింపదగిన విషయములుగా లేక భోగ్య పదార్థములుగా పరిణామము పొందును. తమః ప్రధానమగు ప్రకృతినుండి పుట్టినవి కావున నివి గ్రాహ్యములు జ్ఞానమునకు విషయములు కావున బోధ్యములు లేక జ్ఞేయములు. తమః ప్రధానములు కావున జాడ్యధర్మము కలవి. లేక జడములు. జడములుకదా యని ఇవి బొత్తుగా క్రియాశూన్యములు కావు. దేశాంతరగతియు పరిణతియు ఉండుటచే వీనికిని క్రియ కలదని ఊహింతుము

విషయములకు ముఖ్యధర్మము గ్రాహ్యత్వము. స్థూలములనియు సూక్ష్మము లనియు విషయము లిరుదెరగులు. ఇవి క్రమముగా పంచతన్మాత్రలు, పంచభూతములు. పంచభూతముల కారణావస్థ పంచతన్మాత్రములు. ఇవి శబ్ద స్పర్శ రూప రస గంధములు. ఇవి సాంఖ్యమున అణువులు. అణువు లనగా ఏకావయవమాత్రరూపములు (4) ఆకాశాది స్థూలభూతములు తన్మాత్రల అభివ్యక్తావస్థ. ఇపుడు మహాభూతములుగా మనము వ్యవహరించున వివి కావు. ఇవి పంచీకృతములు. అవి అపంచీకృతములు ఇటులు సూక్ష్మవిషయములగు తన్మాత్రలనుండి స్థూలములును శబ్దాదిమాత్రగుణకములు నగు పంచభూతముల వికాసము. ఈ తన్మాత్రలను ఈ భూతములను యోగులు విచారానుగత సమాధిలో సాక్షాత్కరించుకొందురు

అస్మిత విశ్వాత్మ

విషయములకును వానిని గ్రహించు నింద్రియములకును మూల మొకటియే. అది అహంకారము విషయములు బాహ్యప్రపంచము. ఇంద్రియములు అంతఃప్రపంచము. ఈ రెంటికిని అహంకారము కారణమని అర్థము. ఇంకను సూక్ష్మకారణము అస్మిత. కావున ఈ అస్మితయే విశ్వాత్మ, మహాన్ ఆత్మ వికాసతారతమ్యముచే ఈ అస్మిత ఒకటియే గ్రహీత, గ్రహణము, గ్రాహ్యము, ఆయెను. ఈ మూడు పదార్థములకును పరస్పరసంబంధమునందు వ్యాపారగతమగు భేద మున్నను ఉపాదానగతమగు భేదము లేదు. ఇటు లంతర్బాహ్య ప్రపంచములకు మూలము అస్మిత. కావున ఈ రెండు ప్రపంచములకును అన్యోన్యసంబంధము సుసంగతము.

మూలకారణమునుండి కార్యోత్పత్తి. ఆ కార్యమునుండి కార్యాంతరోత్పత్తి. శబ్దస్పర్శరూప రసగంధములు జ్ఞాతకు గ్రాహ్యములు. ఎవరి అంతఃకరణము వారిదే యయినను అన్ని అంతఃకరణములకును గ్రాహ్యములతో సంబంధము. గ్రాహ్యములును గ్రహణమును అనగా విషయములును అంతఃకరణమును ద్రష్టకు విషయములు

ఈ తత్త్వములలో దేశకాలములు చేరలేదే? వేనినుండి వీని ఉత్పత్తి?

దేశము - కాలము

మనము దిక్కాలములను 'దేశకాలములు' అని వాడుచుందుము (5) ఇచట దేశమనగా ఆంధ్రదేశము ద్రవిడదేశము ఈ మొదలైన దేశము అని అర్థము కాదు.

"శబ్దాది విశేషాణాం హి క్షోభాత్మనాం య దేక మక్షోభాత్మకం ప్రాగ్భావి సామాన్య మవిశేషాత్మకం త చ్ఛబ్దతన్మాత్ర మేవం గంధాంతేఽపి వాచ్యమ్" అభినవగుప్త

ఇట్టి సూక్ష్మగుణముల కాశ్రయమగు క్షణముల ననుక్రమించి తెలిసికొనబడు ద్రవ్యముల ఏకావయవము, పరమాణువు ఇవియు భూతములవలె జ్ఞానేంద్రియ గ్రాహ్యములు శబ్ద తన్మాత్రను ప్రత్యక్షము చేసికోదలచినయెడల చెవితక్క మిగిలిన జ్ఞానేంద్రియములను నిరోధించి చెవిని విచారానుగత సమాధిలో స్థిరపరచి చూడవలయును. ఇటులే మిగిలిన తన్మాత్రల ప్రత్యక్షత

"దిక్కాలా వాకాశాదిభ్యః" సాం కా ౨౧౨

ఇట్టి వాడుకలో, దేశమనగా భూమి అని అర్థము చెట్లు మొదలగు ద్రవ్యముల అవయవాదులగూడ దేశ మని అందుము. చెట్టు కొమ్మను దేశమని చెప్పుదుము. ఇచట భాగమని అర్థము ద్రవ్యమునుబట్టియే మనకు దేశజ్ఞానము కలుగుచున్నది కావున ఈ దేశమొక భావపదార్థము. మనకు సూర్యుడు చంద్రుడు మొదలగు గ్రహములును నక్షత్రములును ఎడమెడముగను దాపు దాపుగను తిరుగుచు కనబడుచున్నవి. ఎందు ఇటులు ఇవి తిరుగుచున్నటులు కనబడుచున్నవో అది భౌతికాకాశము. ఇది ఎన్నెన్నియో గోళములు తిరుగుట కవకాశ మిచ్చుచున్నది ఈఅవకాశము (6)మన మనస్సులో దేశము లేక శూన్యము అను నొక కల్పన పుట్టించి ఈ శూన్యము, ఈ పదార్థములన్నిటికిని ముందుండవలెనను నిశ్చయముతో నిలుచుచున్నది. పదార్థములకు సమాశ్రయము శూన్యము లేక దేశము అని చెప్పినటు లయినది అసలు శూన్యమనునది పదార్థము కాదు. ఏదియు లేని ఉత్త లొత్త పదార్థములకుగాని పదార్థమనకుగాని ఆశ్రయముకాదు. పదార్థము లన్నియు ఒక దేశములో నుండవు ఏదియు నుండనిదియు దేనిచే నిండనిదియు నగు పెద్దబయలు నిత్యమై ఉన్నదనుట అర్థము లేనిమాట. ప్రకృతి పురుషులు దేశవ్యాప్యులు కారు అగుచో వారికి నిత్యత్వమెటులు? ప్రకృతినుండి అభివ్యక్తమైన పదార్థములు దేశసంబంధముతో నుండవు. ఉన్నచో అవి కారణాంతర్గతములు కాకపోవలసివచ్చును. అవి కారణాశ్రితములు కాని దేశాశ్రితములు కావు కావున నిత్యమైన దేశము లేక శూన్యము కల దని చెప్పుటకు వీలులేదు. మరియు ప్రధానము బీజధర్మి శూన్యమున కే ధర్మము కలదు? ప్రధానము గుణయుక్తము. శూన్యమో? ప్రధానము భావరూపము. శూన్యమో? ఇక దేశమునకు ప్రదేశ మనియు అవయవ మనియు అర్థము. ఇది భావపదార్థము. పదార్థముల సహావస్థితి వలన దీని ఉత్పత్తి. దేశమునకు ఆశ్రయముగా శూన్యము అను నిత్యపదార్థమొకటి ఉండదు. (7)

కాలము

ప్రపంచము, అందలి క్రియాసమూహము ప్రలయము దెస నడచుచున్నది. లోకక్షయను నొనరించుకాలము నేను, అని భగవాను డనినటులు గీత చెప్పును.

---

6 "You cannot have space without things or things without space·
-A. N. Whitehead.

'Space is the order of co existences -Liebnitz.

ఈతడు చెప్పిన Space, కేవల విస్తారమాత్రము, టంగుమైదానముకాదు. 'But this space between which I have called a desert of emptiness, is not entirely empty There are vestiges of matter every where [Eddington. New pathways in science] 'I take it that near the outset of reflection one's incipient notion of space is that of room to move about in.'

'The Emergence of Novelty' by. C. Lloyd Morgan, D Sc, L L.D, F R S (Page 142) మరియు ఇందే కల Space–Time Problem అను అధ్యాయమును చూచునది

శంకరుల మతమున దేశకాలము లున్నవి ౨-౩-౧ అధికరణము. తైత్తిరీయ బృహదారణ్యక భాష్యములు, చూ

ఇటులే ఉద్భవశక్తియు నున్నది 'కాలము సమకూడనిచో ఏదియుకాదు' అని అందుము. సూర్యగమనమునుగూడ కాలమని వ్యవహరింతుము (8) వీడు చిన్నవాడు వీడు పెద్దవాడు, వాడు నిన్న వెళ్లెను వీడు రేపు పోగలడు అనియు వాడుదుము. ఇట్టి కాలము క్రియయు శక్తిరూపమగు భావపదార్థములు

ఏండ్లతరబడి గుహాలో నిదిరించిన ముచికుందుని ముకుందుడు లేపెను. అతని కపుడీ ప్రపంచమునం దెంతయో మార్పు కనబడెను ఇటులే చిమ్మచీకటి గుహాలో వెలుపలి పను లేమియు తెలియక మేలుకనియున్నవానికి చింతారూపమగు మానసిక క్రియవలననే కాలజ్ఞానము కలుగును (9) కలలలో ఒక క్షణముననే పెక్కేండ్ల జ్ఞానము కలుగును. చిత్తవృత్తుల సంఖ్యవలన కాలబోధ (10) ఇది లేనిచో కాలబోధ లేదు.

ప్రపంచమున ప్రతి పదార్థము ఒక అవస్థనుండి ఇంకొక అవస్థ పొందుచున్నది. దీనికి కాల మని పేరు పెట్టితిమి. కాలసూక్ష్మతమాంశము క్షణము ఇట్టి క్షణములు కొన్ని కలిసి కాల మని అనిపించుకొనుచున్నవా? ఇటులేని కాలము క్షణప్రవాహము కావలయును. గత క్షణమునకును వర్తమానక్షణమునకును సంబంధములేదు ఈ క్షణముతో భవిష్యత్ క్షణమునకు సంబంధములేదు ఇట్టులు సంయోగము కూర్పగల తంతువులేదు ఇవి పరస్పరము కలియగల వీలు లేదు కావున కాలము అనునది క్షణద్వయవ్యాపిగాని బహుక్షణవ్యాపిగాని కాదు. వేరువేరు క్షణముల కూటమి వాస్తవము కాదు బుద్ధి యిట్టి సముదాయమును సంపన్నమొనర్చి 'కాలము' అను కల్పన చేయును. ఇది వస్తుశూన్య మగు జ్ఞానము. పురుషునకు కాలవేధ లేదు. అతడు నిర్వికారుడు. కాలముతో పురుషునకు క్రియాపరంపరాసంబంధము గూడ లేదు.

ప్రకృతిలో పరిణామమున్నను ప్రకృతి మాత్రము దేనికిని పరిణామముకాదు కాన ప్రకృతియు కాలాంతర్గతము కాదు.

పరిణామము కారణమునకు. పరిణామమున కొక క్రమధార కలదు ఆ పరిణామక్రమము కాలముకాదు వ్యవహారము కొరకు కాలమును పరిణామమును వేరుపరచి చూతుము. ఇది బుద్ధికార్యము. అసలీ పరిణామావస్థా క్రమముగాని కాలముగాని సృష్టిలో, మెలకువతో చూచినయెడల నిరవచ్ఛిన్నమును అఖండమును అగు పరిణామస్వరూపము కంటె కాలము వేరుకాదని గ్రహింపగలము. వ్యాపు లీ కాలమును బుద్ధి నిర్మితమనియు వస్తుశూన్యమగు జ్ఞానమనియు లౌకిక వ్యవహారసంపన్న

8. భౌతికపదార్థవాదులు భూమిగతియే కాలమని యందురు. Time and Space and many other quantities such as Number, Velocity, Position, Temperature etc are not things= దేశకాలములు, సంఖ్య, వేగము, స్థితి, శీతోష్ణస్థితి మొదలగునవి ద్రవ్యములు కావు. Physics P 1.

9. 'Our consciousness moves along time' —Silberstien

10. 'Time is the order of successions' —Liebnitz.

లకు వస్తువువలె తోచుననియు చెప్పిరి (11) 'మహర్షులు ప్రలయమున నిద్రించుచున్న కాలమును కనుగొనిరి' అని పురాణములు చెప్పును. (12) ప్రకృతికి పరిణామము స్వభావము పరిణామమనగా అవస్థాంతరప్రాప్తి దీనివలన కాల బుద్ధి. కాలము కలిసి వచ్చునెడల అవస్థాంతరము సంభవించు ననుట చెల్లనిమాట అవస్థాంతరముచేతనే కాల బోధ ఇది మనఃకల్పన పరిణామమో వాస్తవము పరిణామము తానే కలుగును. మనసులో కాలము దానికి పరిమాపకము అసలు పరిణామము కాలసాపేక్షముకాదు మరి మూలమయిన కారణసాపేక్షము

సకాలమున పరిణామము కలుగు ననుచో కాలమునకు నిత్యత్వము అంటగట్ట వలెను కాలము నిత్యమగుచో ప్రకృతి పురుషులు కాలాంతర్గతు లని చెప్పవలసి వచ్చును (13)

ద్వైతము

ప్రకృతి నిత్యము పురుషుడు నిత్యుడు ప్రధానము ప్రసవధర్మి పురుషుడు దృశి. ఈ రెంటిలో ఏ యొకటియు మరియొకటికి సాధకముగాని బాధకముగాని కాదు వాని స్వరూపము వేరు అవిద్యాజాతమగు అవివేక మీ రెంటి నొకటిగా జేయుచున్నది ఈ రెండును తమతమ స్వరూపమును గురుతెరుగుచో అవివేకముద యింపదు తమలో తమ వేరిమి నెరుగకపోవుటయే అవివేకమునకు కారణము. ఆ యవివేకము పరస్పర సంబంధమునకు కారణము అవివేకమువలన గలిగిన యీ ఐక్య జ్ఞానము మిథ్యాజ్ఞానము ఈ మిథ్యాజ్ఞానము అఖ్యాతియే. తా మెవరో తాము తిన్నగా నెరుగుచో ఈ ఐక్యభావము ఉండజాలదు వేరు వేరయిన రెండుపదార్థము లొండొండ ఒకటియే యని యనుకొనుటయే అఖ్యాతి లేక మిథ్యాజ్ఞానము. తాము వే రని తెలిసికొనుటయే ఖ్యాతి. వివేకము ఈఖ్యాతిని కలిగించును. ఈ ఖ్యాతియే ముక్తికి హేతువు సాధక బాధక సంబంధము లేని రెండు వస్తువుల ఐక్యజ్ఞాన మీసంబం ధమును సృజించును వివేక మీసంబంధమును తెగగొట్టును. ప్రకృతి ఒకటియే జగ త్కారణము కాదు, మరి పురుషుడుకూడ నొక కారణము. ప్రకృతి ఉపాదానము. పురుషుడు నిమిత్తము ప్రకృతి ఒకటియే జగత్కారణ మగునేని సృష్టికి నియామకత

---

11 క్షణ తత్ క్రమయో ర్నాస్తి వస్తు సమాహార ఇతి బుద్ధి సమాహారో ముహూర్తాహో రాత్రాదయః సఖల్వయం కాలో వస్తుశూన్యోఽపి బుద్ధినిర్మాణః శబ్దజ్ఞానానుపాతీ లౌకికానాం వ్యుత్థితదర్శనానాం వస్తుస్వరూప ఇ వావభాసతే (యోగభాష్య -౩-౫౨)

12 ఏవం బ్రాహ్మీషు రాత్రీషు వ్యతీతాసు సహస్రశః దృష్టవన్త స్తథా వ్యన్యే సుప్తం కాలం మహర్షయః (వాయు - ౭-౭౬)

13. వేదాంతమతమున దేశకాలములు జన్యములు-ప్రమాణము- "స సంవత్సరోఽభవత్" (బృహ-౧-౨), "ఏతస్మా దాత్మన ఆకాశ స్సంభూతః" (తై - ౨-౧) అను ఉపనిషత్తులు "పదార్థ తత్వనిర్ణయః" అను గ్రంథమున "ఆనందానుభవులు" - దిగ్విభాగేఽ విభాగేఽపి వ్యోమ్ని యద్వ ద్వికల్పితః" అని వ్రాసిరి

గాని ఏకరూపమగు పరిణామముగాని పొసగదు మరియు ప్రకృతి పురుషునకు భోగమును అపవర్గమును కలిగించు నని అనుటలో అర్థము ఉండదు ఈ ప్రకృతి, పురుష సంబంధము లేనిదయ్యు పురుషునిదెస పరువిడి పురుషచ్ఛాయలో పుష్పించి అతనికి భోగ మొసగును. మరియు అవసితాధికారము కలదై ముక్తి నొసగును. పురుషుడు నిష్క్రియుడు కావున ప్రకృతికి ఇటులు చరితార్థత పురుషున కసలు భోగములేదు, ముక్తియు లేదు

ఇటీవలి కొందరు పురుషుడు ప్రకృతిలో ప్రతిబింబించు ననిరి మరి కొందరు ప్రకృతియు పురుషునిలో ప్రతిబింబించు ననిరి. ప్రకృతి పురుషులకు అవివేకముచే సంబంధము కలుగునని చెప్పుట కివి ఉపమానమాత్రములు. ఇంతమాత్రమున వీ రెవరును 'పురుషుడు ప్రకృతిసొమ్ము' అని చెప్పలేదు. అటులు చెప్పినటులే ఐన దనినచో 'సంబంధకల్పన ఎందులకు చేయుదురు?' అని ఎదు రడుగవలయును

సవరణ

10 వ పేజీలో ఇరువది ఆరవ పంక్తిలో - కారముద్భాసితమగును-

అను దానికి బదులుగా అహంకార ముద్భాసితమగును

అని చదువుకొన వలెను.

దర్శనములు - న్యాయము

పండిత, శ్రీ గోపదేవ్

విభిన్న దార్శనిక సంప్రదాయములకు, నానావిధ దార్శనిక సిద్ధాంతములకు భారత దేశము పుట్టినిల్లు. ఋగ్వేద కాలమునుండి దార్శనిక సంప్రదాయము లీదేశమున ప్రవర్తిల్లినవనుట కనేక తార్కాణములున్నవి అందువలన దర్శన సంప్రదాయము లతిప్రాచీనములు

దార్శనిక సిద్ధాంతములను క్రమబద్ధముగా ప్రదర్శించు భారతీయ దర్శనములు పెక్కులున్నవి. అవి ఆస్తిక నాస్తికభేదములతో రెండుగా వ్యవహరింపబడుచున్నవి. భారతీయ ఆస్తికదర్శనములయిన ఆరింటిలో న్యాయదర్శన మొకటి. న్యాయసిద్ధాంతములు చాలవరకు వైశేషిక దర్శనసిద్ధాంతములనుండియే గ్రహింపబడినవి న్యాయదర్శనమునకు ముఖ్య విషయము ప్రమాణ నిరూపణము భారతీయ దర్శనములలో ప్రతిదానియందును ప్రమాణవిద్య (**Episte-mology**) వివరింపబడి యున్నను న్యాయ దర్శనమునం దీ విషయము విశేషముగా వివరింపబడినదని చెప్పవచ్చును. ప్రమాణములందును అనుమానప్రమాణ నిరూపణము న్యాయమున మిక్కిలి ముఖ్యమనదగును. అందువలననే న్యాయసూత్రములకు భాష్యము వ్రాసిన వాత్స్యాయనుడు, "ప్రమాణై రర్థపరీక్షణం న్యాయః, ప్రత్యక్షాగమాశ్రిత మనుమానం సాన్వీక్షా, ప్రత్యక్షాగమాభ్యామీక్షితస్య అన్వీక్షణ మన్వీక్షా, తయాప్రవర్తత ఇత్యాన్వీక్షికీ న్యాయవిద్యా, న్యాయశాస్త్రమ్,(వాత్స్యాయనభాష్యమ్ ౧ ౧ ౧)" "ప్రమాణములద్వారా అర్థములను పరీక్షించుట న్యాయము ప్రత్యక్షమును, శబ్దమును ఆశ్రయించి అనుమాన మేర్పడును ఆ యనుమానమే 'అన్వీక్ష' అనబడును, అన్వీక్షతో ప్రవృత్తమగునది ఆన్వీక్షికి - న్యాయశాస్త్రము.' అని వ్రాసియున్నాడు

'ఆన్వీక్షికి' పదము న్యాయము - అనుమానవిద్య యను నర్థమున నెప్పటినుండి ప్రయోగింపబడుచున్నదో సులభముగా చెప్పజాలము కౌటిల్యుడు తన యర్థశాస్త్రమునందు విద్యలను నాలుగింటిని పేర్కొనుచునందు ఆన్వీక్షికి పదమును మొదటి విద్యకుగాను ఉపయోగించియున్నాడు. అతడిక్కడ ఈపదమును దర్శన శాస్త్రమను నర్థమున సామాన్యముగ ప్రయోగించి యున్నాడు. ఈక్షణమనగా చూచుట అన్వీక్షణమనగా చూచినదానిని మరల చూచుట. అనగా మననముచేయుట యని యభిప్రాయము. అందువలన ఆన్వీక్షికి పదము దర్శనశాస్త్రమను నర్థమున ప్రయోగించుట అయుక్తము కాదు దర్శనశాస్త్రమున ముఖ్య విషయము మనన మేకదా!

చూచినదానిని మరల చూచుట అనగా అనుమానమని మరియొక విధముగ చెప్పవచ్చును. అందువలన ఆన్వీక్షికి అనుమానవిద్యకు బదులుగా ప్రయోగింపబడినది.

న్యాయపదము ప్రాచీనకాలమున పూర్వమీమాంస అనునర్థమున ప్రయోగింపబడుటయు నక్కడక్కడ చూడనగును. 'న్యాయకణిక' 'న్యాయరత్నమాల' అను గ్రంథములు పూర్వ మీమాంసా సంప్రదాయమునకు చెందినవియే. పూర్వ మీమాంస బ్రాహ్మణవాక్య తాత్పర్యమును నిర్ణయించు శాస్త్రము ఆ నిర్ణయమునకు అనుమానమావశ్యకమై యుండవచ్చు. అందువలన పూర్వ మీమాంసయందుకూడ న్యాయశబ్దము అనుమానార్థమున ప్రయోగింపబడి యుండవచ్చునని తోచుచున్నది

న్యాయశబ్దము పారిభాషికము ప్రతిజ్ఞ, హేతువు మున్నగు పంచావయవ వాక్యము న్యాయమనబడును

న్యాయదర్శనము ఇతర దర్శనములవలె సంస్కృత భాషయందు సూత్రములలో వ్రాయబడినది. ఇందు ఐదు అధ్యాయము లున్నవి. ప్రతి యధ్యాయము రెండు ఆహ్నికములుగా విభజింపబడి యున్నది ప్రత్యేక ఆహ్నికమునందును అరువది డెబ్బదికి మించి సూత్రములులేవు చివరి అధ్యాయము మిక్కిలి చిన్నది

న్యాయదర్శనమును రచించిన మహర్షి గోతముడు అతనికి అక్షపాదుడు, అక్షచరణుడు అనియు 'నామములు గలవు' పాదములందు కన్నులుగల వాడని యీ పదముల కర్థము. ఈయర్థమును సాధించుటకు పౌరాణికకథ లనేకములు కల్పింపబడినవి కాని వానిలో యథార్థము సున్న."

"హిస్ట్రీ ఆఫ్ ఇండియన్ లాజిక్" గ్రంథకర్త డా॥ విద్యాభూషణ్, తన గ్రంథమున "గోతముడు వేరు, అక్షపాదుడు వేరు" అని వ్రాసి యున్నాడు, కాని, తగిన ప్రమాణమేమియు చూపలేదు.

గోతముని స్థానము కానీ, జన్మసమయము కానీ ఇదమిత్థమని నిర్ణయింపవలనుపడదు. న్యాయసూత్రములందు నాగార్జునుని శూన్యవాదఖండన మున్నందున దాని బట్టి గోతముని జన్మకాల మూహింపవగును నాగార్జునుడు క్రీస్తుశకము రెండవ శతాబ్దమున నున్నట్లు ఐతిహాసికులు చెప్పుచున్నారు అందువలన గోతముడు రెండవశతాబ్దమునకు తరువాతివాడని యూహింపనగును ఐదవ శతాబ్దమువాడైన దిఙ్నాగాచార్యుడు వాత్స్యాయన న్యాయభాష్యమును ఖండించి యున్నందునను, వాత్స్యాయనుడు చతుర్థ శతాబ్దమువాడైన వసుబంధుని గూర్చి యేమియు వ్రాయనందునను, వాత్స్యాయనునికంటె ముందువాడైన గోతముడు మూడవ శతాబ్దమువాడని యూహింపనగుచున్నది. వాస్తవమున సూత్రగత పదములను వివరించుచు భాష్యకారులు, టీకాకారులు, ఉద్ఘాటించిన శూన్యవాదాది వాదములను బట్టి గోతముడు బౌద్ధదర్శనాచార్యులయిన నాగార్జునాదులకు తరువాతివాడని యూహించుచున్నారేకాని లేకున్న గోతమాది మహర్షుల కాలనిర్ణయము దురూహ్యమనక తప్పదు.

న్యాయదర్శనమున ప్రతిపాద్య విషయము ప్రమాణాది షోడశపదార్థములు. ముఖ్యముగా ప్రపంచములోని తత్వముల నన్నిటిని ప్రమాణములు, ప్రమేయములు అని రెండు విధములుగా విభజించి వాని యథార్థరూపమును బోధించుటకై సూత్రకారుడు ముఖ్యముగా యత్నించియున్నాడు అందునను, ప్రమేయ పదార్థములను బాగుగ తెలుపవీలగునట్లు సంశయాదులను వేరుగ శాస్త్రమునందు పేర్కొనియున్నాడు

న్యాయశాస్త్రమున ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము అని నాలుగు ప్రమాణము లంగీకరింపబడినవి జ్ఞానసాధనము ప్రమాణమనబడును బాహ్యార్థముల జ్ఞానమును కలిగించుటలో ముఖ్యసాధనములగుటవలన చక్షురాది - ఇంద్రియములు ప్రత్యక్షప్రమాణములు.

ఇంద్రియ గోచరమగు వస్తువుమూలముగా ప్రత్యక్షముకాని పదార్థమును ఊహించి తెలిసికొనుట అనుమానమనబడును

ధూమమును ప్రత్యక్షముగా కంటితో చూచి, ధూమమున్నచోటున అగ్ని ఉండునని స్మరించి అటుపైన అక్కడ ధూమమున్నది కావున అగ్ని ఉండును అని యూహించుట అనుమానము. ఇక్కడ కంటికి కనబడని అగ్నిని ఊహించుటలో ధూమము హేతువు — సాధనము కాబట్టి యది అనుమాన ప్రమాణమనబడును న్యాయశాస్త్రమున పంచావయవవాక్యము న్యాయమనబడునని యింతకుపూర్వమే యుల్లేఖింపబడినది అనుమాన ప్రమాణము పంచావయవములు కలిగియుండునట్లు శాస్త్రమున చూడనగును (1) ప్రతిజ్ఞ (2) హేతువు.

(3) ఉదాహరణము. (4) ఉపనయము. (5) నిగమనము

ప్ర పర్వతము వహ్నిమంతము.
హే. ధూమము కలిగియున్నందువలన.
ఉదా. మహానసము (వంటయిల్లు) వలె.

ఉప ఈ పర్వతముకూడ ధూమముకలిగి యున్నది

నిగమ కాబట్టి పర్వతము వహ్నిమంతము.

న్యాయదర్శనమునందు అనుమాన ప్రమాణ నిరూపణము మిక్కిలి కఠినముగా ఉండును ఇందు సాధ్యము, సాధనము, వ్యాప్తి, వ్యాప్తిపరామర్శ, అనుమితి, మున్నగు ననేక పారిభాషిక పదములు, వానిలక్షణములు, వాని ప్రయోజనములు లెక్కకుమించి యీ శాస్త్రమున వివరింప బడును అందువలన అనుమాన ప్రమాణమే న్యాయశాస్త్రమనియు, తర్కమనియు చెప్ప బడును. ఉపర్యుక్త పంచావయవములకు సంబంధించిన గ్రంథములు న్యాయ సంప్రదాయమున ననేకములు గోతమునకు తరువాత వ్రాయబడినవి అవియన్నియు నిట లెక్కించుట దుర్ఘటము.

ప్రసిద్ధి సాధర్మ్యమువలన కొండొక వస్తువునకు, దాని నామమునకు ఉన్న సంబంధమును తెలుపునది ఉపమాన ప్రమాణమన బడును. గోవుకు, గవయము (అడవిఆవు) నకు ఉన్న సామ్యమును చూచి అడవిలో తన యెదుట బడిన గవయమును తెలిసికొనుట ఉపమాన ప్రయోజనము

ఆప్తవాక్యము శబ్దప్రమాణ మనబడును ఆప్తుడు అనగా యథార్థవక్త. ఆస్తికదర్శనములన్నియు వేదవాక్యములను ఆప్తవాక్యములుగా గ్రహించును న్యాయశాస్త్రము కూడ వేదవాక్యములను పరమప్రమాణముగా నంగీకరించును అందువలననే ప్రత్యక్షమునకు, ఆగమమునకు అవిరుద్ధముగా ఊహించుట — తర్కించుటయే న్యాయమని పూర్వము శ్లేషింపబడినది.

న్యాయదర్శనమునందీ నాలుగు విధము లయిన ప్రమాణములు బాగుగ వివరింప బడినవి.

తదుపరి యీ దర్శనమునందు ప్రమేయ పదార్థములు వర్ణింపబడినవి ప్రమేయ మనగా జ్ఞానవిషయమని అర్థము. ప్రపంచమున గల పదార్థములన్నియు ప్రమేయము లనదగును, వాని నీ శాస్త్రమునందు పండ్రెండు భాగములుగా విభజించి శాస్త్రకారుడు నిరూపించియున్నాడు.

"ఆత్మశరీరేంద్రియార్థ బుద్ధిమనః ప్రవృత్తి దోషప్రేత్య భావ ఫలదుఃఖాపవర్గాః ప్రమేయమ్" న్యా ౧ ౧ ౯.

(1) ఆత్మలు (2) శరీరములు (3) ఇంద్రియములు (4) అర్థములు (5) బుద్ధులు (6) మనస్సులు (7) ప్రవృత్తులు. (8) దోషములు (9) ప్రేత్యభావము. (10) ఫలము (11) దుఃఖము. (12) అపవర్గము.

ఈ ద్వాదశ విధములగు ప్రమేయపదార్థములు న్యాయదర్శనమునందు లక్షణ పరీక్షాదులతోపాటు విశదీకరింపబడినవి

ఇట్లు ప్రమాణప్రమేయములను బోధించుటకు ననువుగా సంశయము, ప్రయోజనము, దృష్టాంతము, అవయవములు, తర్కము, నిర్ణయము, వాదము, జల్పము, వితండ, హేత్వాభాసములు, ఛలము, జాతి, నిగ్రహస్థానములు నను పదార్థములుకూడ నీ శాస్త్రమున చర్చింపబడినవి.

ప్రమాణ, ప్రమేయ, సంశయాదిషోడశ పదార్థముల తత్త్వజ్ఞానముద్వారా మానవులకు మోక్షప్రాప్తి కలిగించుటయే ఈశాస్త్రమునకు ముఖ్యప్రయోజనము,

జీవుడు జన్మమరణ రూపబంధనమునుండి విముక్తుడై శాశ్వతసుఖము ననుభవించుటయో, లేక దుఃఖములనుండి పూర్ణముగ విడివడుటయో ఉద్దేశించి ఆస్తికదర్శనము

లు ప్రవర్తిల్లినట్లు బోధపడును. అందువలననే గోతముడును న్యాయదర్శనమునందు ప్రథమసూత్రములోనే ప్రమాణాది తత్వజ్ఞానమువలన నిఃశ్రేయసము కలుగునని వర్ణించియున్నాడు

న్యాయశాస్త్రమునందు పదార్థ తత్వ జ్ఞానము మోక్షసాధనమని వర్ణింపబడినది తత్వజ్ఞానమనగా యథార్థజ్ఞానము ప్రత్యక్షాది ప్రమాణచతుష్టయమువలన యథార్థజ్ఞానము కలుగును

వస్తువు ఉన్నదున్నట్లు తెలిసికొనుట యథార్థజ్ఞానము - అనుభవము అనబడును. నీటిని నీరనియు, నిప్పును నిప్పనియు తెలిసికొనుట అనుభవమని భావము అందుకు విపరీతముగ నీటిని నిప్పనియు, నిప్పును నీరనియు తెలిసికొనుట భ్రమయందురు అయథార్థజ్ఞానమనియు భ్రాంతిజ్ఞానమనియు దీనినందురు

ముత్యపుచిప్పను చూచినపుడు రజితమని జ్ఞానము కలుగును. ఇది భ్రాంతిజ్ఞానము. ఇది ముందు జ్ఞానముగా తోచినను ఆముత్యపుచిప్పను చేతితో తీసికొని పరిశీలింపగానే ఇది రజితముకాదు, ముత్యపుచిప్పయని జ్ఞానము కలుగును పూర్వము కలిగిన జ్ఞానము బాధితమగును అందువలన నిది భ్రాంతిజ్ఞాన మనబడును న్యాయదర్శనమున భ్రాంతిజ్ఞానమునుగూర్చి బాగుగ సమాలోచన చేయబడినది భ్రాంతిజ్ఞానము ప్రథమమున యథార్థముగ తోచినను తరువాత వస్తువును సమీపించి తెలిసికొనినపుడు మొదట కలిగిన జ్ఞానము సరికాదని తెలయును కావున నైయాయికుల మతమున జ్ఞానము స్వతఃప్రమాణముకాక, పరతః ప్రమాణమని చెప్పబడును. ప్రమాణమువలన కలుగు జ్ఞానము ద్వారా మనుష్యుని ప్రవృత్తి సఫలమైనపుడు ఆజ్ఞానము యథార్థమగుచున్నది ప్రవృత్తి సఫలము కానపుడు అయథార్థము భ్రాంతి యగుచున్నది కావున జ్ఞానమునందు స్వయముగ ప్రామాణ్యము లేదనియు, ప్రవృత్తి సాఫల్యముద్వారా ప్రామాణ్యమేర్పడుచున్నదనియు తెలియుచున్నది. అందువలన నైయాయికులు మీమాంసకులవలె జ్ఞానము స్వతఃప్రమాణమని అంగీకరింపక పరతః ప్రమాణమని చెప్పుదురు, ఇదియే అన్యథాఖ్యాతి యనియు శాస్త్రమున వ్యవహరింపబడును.

న్యాయసిద్ధాంతములలో అవయవ అవయవి వాద మొకటి మిక్కిలి ముఖ్యము నైయాయికులు ప్రపంచములోని వస్తువులకన్నిటికి మూలకారణములు పరమాణువులుగా నంగీకరింతురు. ఆ పరమాణువులు ఒండొంటితో కలిసి ద్వ్యణుకము, త్ర్యణుకము, త్రసరేణువు చతురణుకముగా నేర్పడి క్రమముగా ఇంద్రియములద్వారా ప్రత్యక్షము చేసికొనదగు పదార్థములుగా నేర్పడుచున్నవి మనకు ప్రత్యక్షముగా కనబడు వస్తువులు పరమాణువుల సముదాయము కాదు అవి కలిసి వానికంటె భిన్నమైన వస్తువులు కలుగుచున్నవని న్యాయమతము ఘటము కేవలము మట్టి అణువులు కాదు వానికంటె వేరైన ఒక వస్తువు అందువలననే ఘటమును చూచినపుడు మనకు ఇది ఒక ఘటము అని ప్రత్యక్షజ్ఞానము కలుగుచున్నది నైయాయికుల భాషలో ఘటము ఒక అవయవి అవయవములద్వారా అది క్రొత్తగా ఏర్పడును. ఘటము దానికి అవయవములైన పరమాణువులకంటె భిన్నమైన వస్తువు కాక పరమాణువులు మాత్రమే అని యంగీకరించినచో అది మన ఇంద్రియములకు ప్రత్యక్షముకాదు కారణమేమన పరమాణువులు ఇంద్రియములకు గోచరింపవు, అతిసూక్ష్మములు అందువలన ఘటము పటము మున్నగు వస్తువులన్నియు వాని వాని అవయవములు, భాగములు - మాత్రమే కావు. అంతకంటె భిన్నములయిన అవయవి పదార్థములని నైయాయికుల మతము-బౌద్ధ

దర్శనకారులు ఈ అవయవి వాదము నంగీకరింపరు అవయవి వాదము నంగీకరింపకున్నచో వస్తువు ప్రత్యక్షమగుటకే వీలులేదని న్యాయసిద్ధాంతము.

నైయాయికులు అసత్కార్యవాదులు న్యాయసిద్ధాంతము ననుసరించి కారణ వ్యాపారమువలన కార్యపదార్థము జనించునని అంగీకరింపబడును సాంఖ్యులు సత్కార్యవాదు లనబడుదురు వారి మతమున సువర్ణమువలన నేర్పడు కుండలాదులు ఆ సువర్ణములో అవి యేర్పడుటకు ముందే ఉండును. అవి కారణవ్యాపారమువలన ప్రకటమగును క్రొత్తగా ఏర్పడవు న్యాయమతమున నట్లుకాక, సువర్ణమున కుండలాదులు అవి యేర్పడుటకు ముందుండవు, కారణవ్యాపారమువలన నవి క్రొత్తగా జనించును. అందువలన సాంఖ్యులు సత్కార్యవాదులనియు, నైయాయికులు అసత్కార్యవాదులనియు పిలువబడుదురు

న్యాయశాస్త్రమున ఈశ్వరుడు కర్మఫల దాతగా వర్ణింపబడియున్నాడు.

"ఈశ్వరః కారణం పురుషకర్మాఫల్య దర్శనాత్" న్యా ద, ౪.౧ ౧౯

జీవులుచేయు కర్మలు స్వయముగా ఫలము నియ్యజాలవు ఆ కర్మలకు తగిన ఫలముల నొసంగుటలో కారణమే ఈశ్వరుడని సూత్రాభిప్రాయము ఈశ్వరుని గురించి న్యాయదర్శనమున మిక్కిలి వర్ణన కనిపింపదు కాని ఈశ్వరుడు జగత్కర్తగా నంగీకరింపబడుట చూడనగును ఈశ్వర సిద్ధిని గూర్చి న్యాయసంప్రదాయమునకు సంబంధించిన న్యాయకుసుమాంజలి మున్నగు గ్రంథములలో విస్తారముగ చర్చింపబడినది.

న్యాయసిద్ధాంతములకు సంబంధించిన సాహిత్యమెంతో యున్నది. న్యాయము ప్రాచీనము, నవీనమునని రెండు విధములుగా నేడు వ్యవహారములో నున్నది. గోతమునిచే రచియింపబడిన సూత్రములతో న్యాయసాహిత్యము ప్రారంభమైనది వాత్స్యాయనాదులు సూత్రములకు భాష్యము, ఆభాష్యమునకు వార్తికాదులు వ్రాసియున్నారు న్యాయసూత్రములు, వాత్స్యాయనభాష్యము,న్యాయవార్తికము, న్యాయవార్తిక తాత్పర్యటీక, దాని పరిశుద్ధి, పరిశుద్ధికి టీక— న్యాయకుసుమాంజలి మున్నగు గ్రంథములన్నియు ప్రాచీన న్యాయమునకు చెందిన సాహిత్యము ఈ సాహిత్యరచయితలలో వాత్స్యాయనుడు, ఉద్యోతకరుడు, వాచస్పతిమిశ్రుడు, ఉదయనుడు, వర్ధమానుడు మున్నగువారు ముఖ్యులు, వీరుకాక సూత్రములకు వృత్తులు, టీకలు వ్రాసిన వారు విశ్వనాథపంచాననుడు, నాగేశభట్టు, జయంతుడు, మున్నగువా రనేకులున్నారు.

క్రీస్తుశకము ద్వాదశ శతాబ్దాంతమున మిథిలాప్రాంతమున జన్మించిన గంగేశోపాధ్యాయుడు తత్వచింతామణి నామకగ్రంథమును రచించినాడు. ఈగ్రంథము నవ్యన్యాయమునకుప్రాతిపదిక యనదగును తరువాత రఘునాథతర్కశిరోమణి, జగదీశుడు మున్నగు ప్రముఖులు తత్వచింతామణికి వ్యాఖ్యానగ్రంథము లెన్నో రచియించిరి.

ఇట్లు నవ్యన్యాయసాహిత్య మెంతగానో పెరిగిపోయినది ఇట్లీ న్యాయసిద్ధాంతములకు చెందిన సాహిత్యము వర్ధిల్లుటకు బౌద్ధజైన దర్శనాచార్యుల ఊహాపోహలెంతగానో తోడ్పడినవని చెప్పకతప్పదు ఆ చరిత్రవివరణ మిట మిక్కిలి దుర్ఘటము.

నేడు ప్రాచీన న్యాయసాహిత్యమును జదువువారు మిక్కిలి తక్కువగా ఉన్నారు నవ్యన్యాయవిదుల సంఖ్య కూడ ఎక్కువ లేదనియే చెప్పవచ్చును.

పూల పూజలు

శ్రీ "లసూనా"

కమ్మనితావు లెల్లెడల గ్రమ్మిన మేనులు పుల్కరింప చి
త్తమ్ముల లోతులన్ గెలకి తన్మయతన్ గయిసేయు దీప్తి కెం
దమ్ముల జేర రాకమునె దారులుగాచెడి బంభరాళి "ఝుం
ఝుమ్మ"ని రేగుచున్ గవయజూచు నుషోదయవేళనే ప్రభూ!

పుత్తడి సెజ్జలోనునిచి, పున్నెపుయాగములందు నార్చి, కొం
గ్రొత్త పదమ్ములన్ గొనగ గోము వెలార్చుచు వచ్చువారు మా
చిత్తములందు తత్తరము చిప్పిలు టెయ్యెడ గాంచబోరు! యీ
మెత్తనిజీవితాల ననిమేషము మొత్తెదరేలనో ప్రభూ!

"ననవిలుగాని నేస్తులివి, నమ్ముట పాడియుగాదు లెమ్మ" టం
చనుకొని యేమొ! మానినులు చయ్యనగుండెల సూది గ్రుచ్చి కా
మనలోగిదీరగా మలచి మమ్ముల కీల్మడి ఖైదుసేయ నే
మనగలవార మక్కట! యమాయకులందరి కెట్టి యిక్కటుల్!

కుత్తుకలుత్తరించి గుమికూర్తురు తంత్రములెన్నొ బన్ని మా
నెత్తురులోలికించి కడునేర్పుగ యంత్రములందు జేర్చి కొం
గ్రొత్తకు రూపమిచ్చి కొనగోటనలందుక "భేషు! భేషు! యీ
యత్తరు" లంచు మేని కిల మారగ బూతురిదేటి ఖర్మమో!

కనుగవ గాంచలేక, తమకమ్మున తల్లియెడంద నిల్చినన్,
పనిగొని ద్రుంచి, రూపడచి, పబ్బముదీరినయంత ద్రోసిరా
జనెడి యమానుషప్రకృతి సందట జీవితయాత్ర లిట్టులన్
దినమొక గండమై వెలయ దీవనలీయగ జెల్లునే ప్రభూ!

*

ఉపాయనము

శ్రీ బిట్రా భావనారాయణ

మాటికి మాటికిన్ మధుర మంజులభావము లూరగా మనో
వాటిక కేతమెత్తి చిఱువాఁగులఁ బాఱఁగఁ జేయుచుంటి, నీ
బోటికి నీకునున్ విఱుగఁబూచిన మానసిక ప్రసూనముల్
నీటుగ గ్రుచ్చి మీ మెడలనెక్కొనఁజేయు తలంపుతో ప్రభూ!

ఎన్నాళ్ళీ మెడచుట్టుఁ దాల్చెదవు నీ వీ నాగమున్నీశ్వరా,
కొన్నాళ్ళైననుఁ దాల్పరాదొ హృదయక్షోణీస్థలిన్ బూచె, నీ
విన్నాణంపు సుమంబు లింపొదవగా విశ్వేశనాలోన, నా
కన్నుల్ చల్లగఁ జూడగల్గుదు ప్రభూ, కంఠమ్మునందాల్పవే!

సరముల్ గ్రుచ్చగఁ జాలినన్ని సుమముల్ స్వాంతమ్మునన్ బూచి,
చరణమ్ముల్ మదినిల్పి పూజయిడగా సౌరభ్యముల్ గ్రక్కుచున్
శరవేగమ్మున దూకుచున్న యవి స్వేచ్ఛావాయు సంచారమున్
తరలన్ జేయుచు నీదు పాదములచెంతన్ రాలి భాసిల్లగాన్.

వాడని సూనముల్ మెడనుబాయగఁ జాలవు, సర్వకాలమున్
వాడినఁ దగ్గదయ్యొ సుమభారము, పావనమైన భావముల్
తోడుగఁ బెర్గినట్టి నవతోయజముల్ వికసించెనో ప్రభూ,
వేడుకతోడ నీదు మెడవేసెద గైకొనుమయ్య మాల్యమున్.

నీ మహిమంబుచేఁ గలిగె నీరజముల్ ప్రభవించునాదు హృ
త్సీమ యిదే మహాత్మ! సరసీరుహజాతపు నిండు పంటతో
దామములన్ రచించి తొలుతన్నిడఁ గోరుదు నీకునై ప్రభూ,
కామితమున్ ఫలించెనని గర్వినిగా మది విఱ్ఱవీఁగగన్.

హృదయక్షేత్రము నీకు నంకితముగా నిత్తున్ మహాదేవ! నీ
సదయాత్మన్ గొని దానినెప్పుడును ప్రక్షాళించు సర్వేశ, స
మ్మదమే పారగ గాంగనిర్ఝరముతోఁ బూజింతునిన్ సర్వదా
కొదవావంతయు లేక పూసెడిని నీ క్షోణిన్ సుమవ్రాతముల్!

భారతీయ చిత్రకళ

శ్రీమతి దివ్యజ్ఞాన సరోజినీదేవి

"అన్నీ గతించును. కళ ఒక్కటే చిరస్థాయిగా నుండును మానవప్రతిమ, రాజ్యములకన్నను ఎక్కువకాలము రూపుమాయకుండ నిలిచియుండును" అని వాక్రుచ్చాడొక మహాకవి. క్షణములో రాజులు, రాజ్యాలు తారుమారయే ఈ రోజులలో, ఆ మహాకవి మాటలలోని సత్యము 'ఎవరికి గోచరింపదు? కళ, మానవ సృజనాత్మకశక్తికి చిహ్నమేకదా? ఒక సాంఘిక అవసరమును సంతృప్తిపరచుటకు జనించినదీ కళ. మరేది, ఆ అవసరమును సంతృప్తిపరచలేదుగావున, ఇది మానవచరిత్రలో అత్యవసరమైనది. అందుచే కళకు, అందులో చిత్రకళకు ప్రపంచములో అనాదినుండి విశిష్టస్థానమున్నది మానవుడు తన అభిప్రాయములను యితరులకు వ్యక్తపరచుటకు గాని, ప్రదర్శించుటకు గాని, మానవచరిత్ర చిరస్థాయిగా నుంచుటకుగాని, ప్రప్రథమముగా భాష నుపయోగించినట్లులేదు. చిత్రములద్వారానే తన మనోగత అభిప్రాయములను వెల్లడి చేసినట్లు తెలియుచున్నది ఈనాడు మన కనులకు, ఆ చిత్రములు మోటుగాను, అసంపూర్ణముగాను గోచరింపవచ్చు. కాని భాషకన్న చిత్రకళే ముందు పుట్టినదన్న సత్యాన్ని మాత్రము మనము నిరాకరించలేము

భారతదేశములోనూ, భారతీయుల జీవితములలోనూ చిత్రకళకు నిర్దిష్టస్థానమున్నది. ఈ యంత్రయుగములో సైతము ప్రతి భారతీయ సామాన్యగృహమందునూ కళోపేతమైన వస్తుసముదాయములు కనబడుచుండుటయే దీనికి నిదర్శనము ఈ చిత్రకళ మనకు నిన్న మొన్న వచ్చినదికాదు. కష్టించి అనుకరించి నేర్చుకొన్నదీ, తరతరాలనుండి మన రక్తములో జీర్ణించిపోయినది అనేక వేలసంవత్సరములకు పూర్వమే భారతీయుల జీవితములో విశిష్టస్థానమేర్పరచుకొన్నది టిబెట్టు చిత్రకారుడైన తారానాథ్ మన దేశములో చిత్రకళ క్రీ పూ. 48 వ సంవత్సరము నాటికే వర్థిల్లుచుండెనని నుడువుటలో మన మాశ్చర్యపడవలసినదేమీ లేదు అయినను ఇటీవలవరకు ప్రాచీనచిత్రకళలో హిందూదేశము పేరు పేర్కొనబడకపోవటము శోచనీయము. ఇందుకు బాధ్యులు మనమా, ఐరోపియనులా అని వాదించటము వ్యర్థము. ఎవరు బాధ్యులైనప్పటికీ ఇటీవలివరకు ప్రాచీన చిత్రకళ అనిన, 'గ్రీక్' 'రోమన్' చిత్రకళనెడి భావము అందరికి వుండెడిది కాని యిప్పుడిప్పుడే గ్రీక్, రోమన్ చిత్రకళలకంటెకూడ ప్రాచీన చిత్రకళలున్నవని గ్రహింపగలుగుచున్నారు. ఈనాడు వివిధదేశీయులు భారతీయ చిత్రకళను బహుప్రాచీన చిత్రకళగా గుర్తించుచున్నారు.

మనదేశమునందు ఉపనిషత్తుల కాలమునాటికే చిత్రకళ అభివృద్ధిలోనున్నదని విశదమగుచున్నది. ఆ కాలమున చిత్రములు చిత్రించుటకు వాడబడిన కుంచెలను గురించి ప్రాచీన గ్రంథములందు ఈ విధముగా పేర్కొనబడియున్నది: "చిత్రకారుని కుంచెనుండి నారను విడదీసినట్లు, మానవుడు తనలోని ఆత్మను, తన శరీరమునుండి విడదీయవలయును" ఆ కాలమున కుడ్యచిత్రములు బహుళప్రచారములో నుండెను. రామాయణమునందు యివి పేర్కొనబడి యున్నవి. ఆ కాలమున చిత్రకళ భగవదాంశముగా గైకొనబడినది బ్రహ్మ విశ్వకర్మగా కొలువబడుచుండెను గదా! ఈ చిత్రకళ బ్రహ్మనుండి మానవమాత్రులైన మనకు ఎటులవచ్చినదో ప్రచారములోగల ఒక పురాణగాథ తెలుపుచున్నదీ. ఒక బ్రాహ్మణయువకుడు మరణించగా, అతనిని మరల సజీవునిగా చేయదలచిన ఒకానొక రాజునకు, బ్రహ్మ ఈ విద్యను నేర్పెనట. యమధర్మరాజు ఆ యువకుని జీవమ్మునివ్వ నిరాకరించగా, ఆ రాజు లిఖించిన ఆ యువకుని చిత్రపటమునకు బ్రహ్మ మరల ప్రాణములు బోసెనట. ఇక, వినాయక జననగాథ ఆబాలగోపాలమునకు తెలిసినదియేగదా పార్వతీదేవి అభ్యంగనము చేయబోవుచూ, ద్వార రక్షణ కొరకై నలుగుపిండితో ఒకబాలుని ప్రతిమచేసి, ఆ ప్రతిమకు ప్రాణములు పోసెనని చెప్పబడినదికదా! ఇవ్విధమున భగవదాంశముగా గైకొనబడిన చిత్రకళ మానవులందుండుట వారియందలి శుభలక్షణముగా భావింపబడెడిది. ఈ కళ అనేక పురాణగాథలందు పేర్కొనబడియున్నది భాగవతములోని ఉషా పరిణయ గాథలో 'చిత్రలేఖ' చిత్రలేఖనము మూలముననే గదా ఉషా అనిరుద్ధుల సమాగమము సంభవించినది

ఇట్లనేక విధములుగా మన పురాణ, ఇతిహాసములు ఆ కాలమున బహుళ ప్రచారములో నున్న చిత్రకళను పేర్కొనినను, ఆ కళను గుఱించి అంతకన్నను విపులముగా యేమియు చెప్పుటలేదు కాని, కొన్ని సంవత్సరముల తదుపరి వెలువడిన గ్రంథములందు దీనిని గుఱించి విపులముగా చెప్పబడియున్నది క్రీ శ. 3వ శతాబ్దములో వాత్స్యాయనుడు తన 'కామసూత్ర' గ్రంథమందు చిత్రకళనుద్దేశించి, షడాంగమును ఆరు ముఖ్యసూత్రములను పేర్కొనెను. ఆ సూత్రములు వాత్స్యాయనుడు కూర్చినవి కావట అంతకుపూర్వమే రచింపబడిన గ్రంథములనుండి గ్రహించి వ్రాయబడినవట ఈ షడాంగము లేవన ౧. రూపభేదము, ౨ ప్రమాణము, ౩. భావము, ౪. లావణ్యయోజనము, ౫ సాదృశ్యము, ౬ వార్ణికభంగము (చిత్రపటము చిత్రించునప్పుడు ఏయే వస్తుసముదాయములు, సాధనములు ఉపయోగించవలయునో, అవి యే విధమున ప్రయోగింపవలయునో తెలుపునది)

ఈ 'షడాంగములు' బోలిన సూత్రములు చైనీయుల చిత్రకళయందును అవలంబింపబడియుండుటవలననూ, ఈ సూత్రములు క్రీ శ 6వ శతాబ్దము తదుపరియే పేర్కొనబడియుండుట మూలముననూ, చైనీయులు ఈ సూత్రములను భారతీయ చిత్రకళనుండి గ్రహించినారేమోనని, యనుకొనుటకు అవకాశము కలుగుచున్నది.

చిత్రలేఖనమును గూర్చిన సూత్రములు ఈ ఒక్క ప్రాచీనగ్రంథమునందేగాక, 'చిత్రలక్షణ' మను మరియొక్క ప్రాచీన గ్రంథమునందును పేర్కొనబడియున్నవి. ఇందు దేవతాప్రతిమలు చిత్రించునప్పుడు అవలంబింపవలసిన విధానమును గూర్చి విపులముగా చెప్పబడియున్నది. దేవతాప్రతిమలు, మానవప్రతిమలకన్న పెద్దవిగనూ, రాజప్రతిమలు సామాన్యమానవ ప్రతిమలకన్న పెద్దవిగనూ చిత్రింపవలయునట దేవతా స్వరూపము చిత్రించునప్పుడు ముఖము చతుర్భుజాకారముగా చిత్రింపవలయునట ముక్కోణముగాగానీ,వంకరగాగానీ, గుండ్రముగాగానీ అండాకృతిగాగానీ యుండరాదట.మరియు ముఖమండలము సుందరముగానూ, కాంతివంతముగానూ, నిర్మలముగానూ వుండి స్పష్టముగా గీయబడియుండవలయునట. ఇవ్విధమున సదా చిత్రించువాడు ధన్యుడట. సామాన్యప్రజల ప్రతిమలు చిత్రించునప్పుడు, వారుగనుక శాంతియుతులైన, వారి ముఖమండలములు పొడుగుగా గానీ, గుండ్రముగాగానీ, త్రికోణముగాగానీ చిత్రించవచ్చునట జుత్తు విషయమందు దేవతలకును, మానవులందలి పూజ్యులకును నొక్కునొక్కులుగానున్న నీలిజుత్తు చిత్రించవలయునట. స్త్రీ స్వరూపములను చిత్రించునప్పుడు వారిని నవయౌవ్వనవతులుగనే చిత్రింపవలయునట. ఈ చిత్రకళను గుఱించి ఈ విధమైన అనేక సూత్రములు ఈ గ్రంథమునందు విపులముగా నున్నవి దీనిని ఆధారముగా చేసుకొనే కాబోలు యిప్పటికిని నిలచియున్న 'శిల్పశాస్త్రము' రచింపబడినది!

ఈ సూత్రములన్నియు కొన్ని సంవత్సరముల పిదప బౌద్ధ చిత్రములందు అవలంబింపబడినవి. ముఖ్యముగా అజంతా చిత్రములందు ఈసూత్రముల ప్రయోగము స్పష్టముగా గానవచ్చుచున్నది బౌద్ధ చిత్రములందు ఈ సూత్రములు పాటింపబడినవని చెప్పుటచే మరియొక సందేహము కలుగుటకు అవకాశమున్నది. అవి యేవి అనిన, 'కామసూత్రము'లోని చిత్రకళాసూత్రములు అంతకుపూర్వపు గ్రంథములందే పేర్కొనబడియున్నవని చెప్పబడియున్నదిగదా, మరి అటులైన బౌద్ధ చిత్రములనాటివరకు' అవి చిత్రకారులచేత పాటింపబడలేదా యన్న సందేహము కల్గును. ఆ కాలమునాటి కుడ్యచిత్రములన్ని రూపుమాయుటచే ఈ సందేహము తీర్చుకొనుట మనకు సులభసాధ్యముగాదు. ఆనాటి చిత్రములో శీతోష్ణపరిస్థితుల ధాటికి తట్టుకోలేక ధ్వంసమైన చిత్రములు పోగా, మిగ్గిలియున్న చిత్రముల పరిస్థితికూడ యేమంత బాగుగలేదు. జోగిమారగుహలోని పాత చిత్రములు (ఇవి బహుశః క్రీ. పూ. ౧ శతాబ్దమునకు చెందినవై యుండునని అభిప్రాయపడుచున్నారు) మాసిపోవుచుండుట చూచి వాటిని ఎవరో దిద్దిరి. ఆ విధముగా వాటిని సదుద్దేశముతోనే దిద్దినప్పటికి ఆ దిద్దటము కొంచెము మోటుగానూ చాతుర్యరహితముగానూ జరుగుటవలన వాటి పూర్వపు రూపు పూర్తిగా మారిపోయినది. అందుచే శేష చిత్రములనుబట్టికూడ ఆనాటి చిత్రశైలిని నిర్ణయించుటకు సాధ్యపడుటలేదు. అయినను కొందరు ఈ 'కామసూత్రము'లోని చిత్రకళా సూత్రములు కేవలము గ్రంథరూపముననే వుండెననియు, వాటిని చిత్రకారులు తమ చిత్రములందు పాటింపలేదనియు అభిప్రాయ పడుచున్నారు.

సరికొందరు ఈ సూత్రములు ఆనాటి చిత్రకారులచే పాటింపబడి యుండవచ్చుననియు, తీవ్రతమమైన శీతోష్ణపరిస్థితులకుప్రభావమువలన నవి మాపుమాసినవి గావున శేషచిత్రముల బట్టి వారు పాటింపలేదని నిర్ణయించుట సమంజసము కాదనియు అభిప్రాయపడుచున్నారు ఏదిఏమైనను ఈనాడు మనకు, ఆసూత్రములు పాటించి చిత్రింపబడిన చిత్రముల నిదర్శనములు బౌద్ధ చిత్రములందే కానవచ్చుచున్నవి ఈ బౌద్ధచిత్రములందును, ఈనాడు స్పష్టముగా నున్నవి- అజంతా చిత్రములే. ఈ చిత్రములన్నియేక కాలమున కాక, అనేక వందల సంవత్సరముల వ్యవధిలో, అనేక చిత్రకారులచే కొద్ది మార్పులు గల వివిధశైలులలో చిత్రింపబడినప్పటికినీ, ఈ చిత్రశిల్పులందరూ ఆ సూత్రములను మాత్రము తమ చిత్రములందు అవలంబించుట మరువలేదు

ఈ అజంతా చిత్రముల విశిష్టత వ్రాయుటకు నొక గ్రంథమైన చాలదేమో ఈ చిత్రములు ఆనాటి కళాసౌందర్యమునేగాక, సాంఘిక, చరిత్రాత్మక, మత, వేదాంత విషయములనుకూడ ప్రతిబింబించుచున్నవి అందువలననే కాబోలు "పశ్చిమ దేశ చిత్రకారులవలెగాక తూర్పుదేశ చిత్రకారులు ప్రప్రథమముగా వేదాంతులు అటుపిమ్మటే చిత్రశిల్పులు" అన్నాడొక మహానుభావుడు ! ఈ అజంతా చిత్రములందలి ముఖ్యాంశమేమన పశ్చిమదేశ చిత్రములవలెగాక యివి కేవలము రేఖల సమూహములతోనే గీయ పడినవి భారతీయ చిత్రములన్నీ సాధారణముగా రేఖలచేతనే గీయబడినప్పటికినీ, ఆ రేఖలను ఈ అజంతా చిత్రములందు వాడినంత నైపుణ్యముగా మరి ఎచ్చటనూ వాడి యుండ లేదు. కేవలము ఈ రేఖలమూలముననే చదునుగానున్న ఉపరితలమున చిత్రించిన వస్తువు గుండ్రముగానూ, ఘనపరిమాణము కలదిగానూ మనకు కనబడునట్లు చేయగలిగిరి, రేఖల మందమును హెచ్చించుట, తగ్గించుటవలననూ; దృఢముగానో, తేలికగానో గీయుటవలననూ, చిత్రశిల్పి ఆచిత్రమునందలి వస్తువుకు కేవలము రూపము, ప్రమాణము, ఘనపరిమాణమేగాక, ఆ చిత్రమునందు దానికిగల విలువ, ఆ వస్తువు వ్యక్తపరచవలసిన భావము మొదలగునవికూడ చిత్రించగలిగెను. సంక్షేపముగా చెప్పవలయునన్న,వాత్స్యాయనునిషడాంగములలోని మొదటి అయిదు సూత్రములు ఈ రేఖల ద్వారానే చిత్రమునందు చిత్రశిల్పి వ్యక్తపరచగలిగెను.

ఇందులకు చక్కటి ఉదాహరణ ప్రథమగుహలో గల బోధిసత్వ అవలోకితేశ్వర విగ్రహము ఈ చిత్రమునందు బుద్ధభగవానుని పరిత్యాగము చిత్రింపబడియున్నది యువరాజు సిద్ధార్థుడు జ్ఞానార్జనకొరకు తన అంతఃపురము వీడివెడలు ఘట్టమిది ఇందు బుద్ధభగవానుని ప్రతిమ మానవ పరిమాణము కన్నను పెద్దదిగానుండి కొంచెము వంగియున్నట్లుండును.

మొదటి సూత్రమైన రూపభేదమును తీసుకొనిన యెడల, మనకు వెంటనే ఆ చిత్రమును లిఖించుటయందు చిత్రకారు డుపయోగించిన రూపజ్ఞానము స్పష్టమగుచున్నది ప్రతిమయొక్క భుజము, బాహువుల వెలుపలి భాగము చిత్రించుటయందు దృఢమైన రేఖలనూ, లోపలిభాగమును చిత్రించుటయందు అక్కడక్కడ ఛాయలనూ ఉపయోగించి, ఆప్రతిమయొక్క భుజము బాహువులు చదునైన ఉపరితలముమీద గుండ్రముగాను సజీవముగాను మనకు కానవచ్చునట్లు చేయగల్గినాడా చిత్రశిల్పి కేవలము రేఖలద్వారానే చిత్రకారుడు ప్రతిమమోమున నిండుతనము మృదుత్వము చిత్రింపగలిగెను ఆనాటి చిత్రకారులు ఒక మానవప్రతిమ చిత్రించుటయందేగాక, నగలు, పూవులు, దుస్తులు జుత్తు మొదలగునవి చిత్రించుటయందుకూడ ఎంతో రూపజ్ఞానము చూపియున్నారు మెడ చుట్టుయున్న నగమూలమున గొంతుయొక్క గుండ్రనితనమును, అడ్డముగా వ్రేలాడుచున్న హారమువలన ఆ ప్రతిమ పరిగెత్తెడివిధానమునుచక్కగా చిత్రింపగలిగిరి రెండవ సూత్రమైన పరిమాణముకూడ ఈ బోధిసత్వ అవలోకితేశ్వరుని చిత్తరువునందు స్పష్టముగా గానవచ్చుచున్నది ఉదాహరణకు అందు అవలోకితేశ్వరుని విగ్రహము కుడిబాహువువంచికలువపుష్పముపట్టుకొని యున్నట్లున్నది. మన కెదురుగా కొంచెముదూరములో నుంచున్న మనిషి ఆ విధముగా తన బాహువును వంచినప్పుడు మనము పరీక్షగా చూసినయెడల, ఆ బాహువు మోచేతినుండి హస్తమువరకు నున్న చేతిభాగము, వంచబడని చేతిభాగముకన్నను పొట్టిగా నున్నట్లు కానవచ్చును సామాన్యముగా చూచువారికి ఒక బాహువు పొట్టిగా, నింకొకటి దానికన్నను పొడుగుగా నెట్లుండగల దనిపించును కాని ఆ చిత్రశిల్పి వాస్తవికతను గ్రహించి, ఆ విధముగా చిత్రించి తనకుగల పరిమాణ జ్ఞానమును చాటుకొన్నాడు

మూడవ సూత్రమైన భావము ఈ చిత్తరువు నందు కొట్టవచ్చినట్లు కానవచ్చుచున్నది. సిద్ధార్థుని ముఖమునందు గొప్పదనము, శాంతము, కరుణ, దుఃఖము మిళితమై యున్నవి. ఇందు చిత్రమేపున ఈ భావములన్నియు రేఖలమూలమునసే వ్యక్తపరుపబడియుండుట ముఖమునందు భావమును వ్యక్తపరుచుటకు ముఖ్యముగా నుపయోగించు కనుబొమలునూ ఒంటరిరేఖలే. సిద్ధార్థుడు నిలుచున్న విధానము, అతని హస్తము, ఆ హస్తమునందున్న పుష్పముగూడ భావప్రకటనకు బాగుగ నుపయోగపరచబడినవి. నాలుగవ సూత్రమైన లావణ్యయోజనము ఈ చిత్తరువునందు ఎక్కడలేదని చెప్పగలము? ఈచిత్రమునందలి ప్రధాన ప్రతిమమైన సిద్ధార్థునందేగాక వెనుకనున్న మిగిలిన ప్రతిమలందును లావణ్యము తొణికిసలాడుచున్నది అయిదవ సూత్రమైన సాదృశ్యమూ యిచ్చట విశదముగా నున్నది. ఈ చిత్రపటమునందు ప్రాముఖ్యత రాణీప్రతిమకు లేదు.గావున, సిద్ధార్థుని ప్రతిమకన్నను అది చిన్నదిగా చిత్రించి, మేరలో నుంచి, సిద్ధార్థుని ప్రతిమ సజీవముగానూ సచేతనముగానూ చిత్రించి ఈ చిత్రపటమునందు రాణీ, సిద్ధార్థుల ప్రతిమలకు ప్రాముఖ్యతలోగల భేదమును స్పష్టపరిచియున్నారు

ఈ అయిదుసూత్రములు కాక, షండాంగములలోని శేషించిన సూత్రము వార్ణికభంగము అన్ని వందల సంవత్సరములకుపూర్వము లిఖింపబడిన ఈ చిత్రములు, అనేక సంవత్సరముల పర్యంతము ధూళితో కప్పబడి, శీతోష్ణపరిస్థితుల వాతబడికూడ ఎటుల రూపుమాయలేదని, చిత్రకళ తెలిసినవారుగాని, తెలియనివారుగాని ఈ అజంతా చిత్రములు తిలకించినప్పుడు ఆశ్చర్యచకితులగుదురు. ఆ చిత్రశిల్పులు చిత్రించిన విధానమునందే అట్టి శాశ్వతలక్షణముకలదు. ఇదియే వారు తమ చిత్తరువులందు వార్ణికభంగ సూత్రమును ప్రయోగించిరనుటకు ప్రబల నిదర్శనము.

ఈ అజంతా చిత్రములకు పూర్వమే, అనగా జోగిమార గుహలనాటికే మన దేశమునందు రంగులు, కుంచెలు అభివృద్ధి చెందియుండెను. అంతకన్నను పూర్వము, ఇనుము తుప్పునుండి సంగ్రహింపబడిన ఎఱ్ఱరంగును మాత్రమే వాడుచుండిరి. కాని, జోగిమార గుహలకాలమునాటికి కేవలము ఎఱ్ఱరంగేగాక, తెలుపు, నలుపు వర్ణములను సైతము వాడుచుండిరి. ఈ వర్ణములను చిత్రకారులు స్వయముగా తయారుచేసికొనెడివారు. తెలుపువర్ణము ఒక రకమైన మట్టినుండియు, నలుపువర్ణము అద్దకములకువాడు ఒక రకమైన పండ్లలో కొన్ని పదార్థములు కలిపి తయారు చేసెడివారు. కుంచెలు ఈనాటివలె వెంట్రుకలతోకాక, నారతో చేసెడివారు కాని, వారు గుహలమీద చిత్రించునప్పుడు మిట్టపల్లములుగా నున్న ఆ బండరాళ్ళ మీదనే చిత్రించెడివారు. అచ్చటచ్చట సున్నపునీరు, ఇసుక కలిపి చేసిన పదార్థముయొక్క సన్ననిపొరలో ముందు బండరాళ్ళ ఎగుడుదిగుడులను కప్పి చిత్రించిన నిదర్శనములున్నప్పటికి, వారు వాడిన వర్ణములు గాని, చిత్రించిన విధానముగాని అజంతా చిత్రములకాలమునాడున్నంత బాగుగా లేదు

ఈ అజంతా చిత్రములందు అవలంబించిన విధానమే బౌద్ధచిత్రములన్నిటియందును అవలంబించబడినది. మిట్టపల్లములుగా నున్న ఈ జాతి బండలపై మట్టి, గోమయములో కొన్ని చూర్ణములు కలిపి ముప్పాతిక అంగుళం మందమునస్తో, అంతకన్నను తక్కువ మందముగనో పూసెడివారు. కొన్ని సమయములందు దీనిలో బాగుగ తరిగిన గడ్డి, ఊకకూడ కలుపుచుండెడివారు ఈ విధముగా ఆబండరాళ్ళపై ఒక పూత పూసిన పిదప,మరల దానిపై అతిసన్నని పొరతో (తెల్లగా) గిలాబ చేయుచుండెడివారు. దీనితో ఆ బండరాళ్ళు ఆలిచిప్పలవలె మెరయసాగును దీనిమీదనే నీటివర్ణములతో చిత్రించెడివారు కాని ఈ వర్ణములను గిలాబచేయబడిన ప్రదేశముమీద ప్రయోగించు విధానమునుగూర్చి భేదాభిప్రాయములున్నవి ఈ అజంతా చిత్రకళ, ఆనాడు ఐరోపాదేశమునందు వాడుకలోనున్న 'ఫ్రెస్కో' చిత్రకళను పోలియున్నదా; లేక ఈజిప్టు, మెసపటేమియాలలో వాడుకలోనున్న 'టెంపోరా' చిత్రకళను పోలియున్నదా; యనునది చర్చనీయాంశమైనది కాని ఈ అజంతా చిత్రములు 'ఫ్రెస్కో' చిత్రములా, 'టెంపోరా' చిత్రములా అని వాదించుటకు పూర్వము, ఫ్రెస్కో చిత్రములనగా నేమో, టెంపోరా చిత్రములనగానేమో తెలిసికొనవలసియున్నది ఫ్రెస్కో చిత్ర కళ ప్రకారము చిత్రింపదలచుకొన్న స్థలము గిలాబ చేసి, అది యింకను తడి యారకమునుపే దాని మీద రంగులు పూయవలయును గావున, చిత్రములు అతిత్వరగా చిత్రింపవలసివచ్చెడిది. ఒక వేళ చిత్రకారుడు తను గీయదలుచుకొన్న చిత్రమును, ఆ నిర్ణీతకాలములో కొంతవరకే పూర్తి

చేయగలిగిన యెడల, ఆ శేషభాగమున చేయ బడిన గచ్చును పగలగొట్టి, ఆతడు ఆచిత్రము పూర్తిచేయుటకు సంసిద్ధుడుగా నున్నప్పు డే మరల గిలాబ చేయవలసివచ్చెడిది. ఇందుచే ఒక చిత్రమునందే అనేక అతుకులు పెట్టవలసివచ్చె డిది ఐరోపా చిత్రకారులు ఈ అతుకులను అతి నైపుణ్యముగా, అనేక వందల సంవత్సరముల పిదపకూడ కనబడకుండునట్లు పెట్టినప్పటికి, తరుచు ఎక్కడ అతుకులు పెట్టబడినవో తెలు సుకోగలుగుచున్నారు ఈ నాటి నిపుణులు ఇక టెంపరా విధానమెట్టిదన్న, గిలాబ చేయబడిన ప్రదేశము బాగుగ ఎండిన పిమ్మట చిత్రింపదలు చుకొన్న నాటి ఉదయమునగాని, ఆ క్రిందటి రోజు రాత్రిగాని సున్నపునీటినిగానీ, లోహపదా ర్థములుగల మంటియొక్క నీటినిగానీ కొంచెము తీసుకొని, దానిని మరికొంచెము నీటిలో కలిపి ఆ ఎండిన గిలాబచేయబడిన ప్రదేశముపై చల్లి తడిచేయుదురు ఆ తడిమీదే వర్ణములు పూయు దురు. ఈ వర్ణములూ, ఫ్రెస్కో చిత్రములందు వాడు వర్ణములూ వేఱుకానప్పటికి, ఈటెంపరా వర్ణములందు సున్నపునీరుగానీ, నిమ్మనీరుగానీ, లోహపదార్థములుగల మట్టినీరుగానీకలుపుదురు ఈ టెంపరా చిత్రకళకునూ, ఫ్రెస్కో చిత్రకళ కునూ బాహ్యముగా కానవచ్చు భేదమేమన టెంపరా చిత్రములందు వర్ణములు భారముగనూ మందముగనూ ఉండి కాంతిరహితముగా నుం డును. ఫ్రెస్కో చిత్రములందు గిలాబచేయబడిన ప్రదేశము తడిగా నున్నప్పుడే దానిమీద వర్ణ ములు పూయవలయున గావున, అవి లోపలికి బాగుగ యింకుటకు అవకాశముగలదు కాని, టెంపరా చిత్రములందు ఆవిధము కాదుగావున, వర్ణములు పైపైనే ఉండి త్వరగా రూపుమాయు టకు అవకాశముగలదు

ఈ విధముగా ఫ్రెస్కో, టెంపరా చిత్రము లను గూర్చి తెలుసుకొని అజంతా చిత్రములు గాంచిన ప్రతివారికి, ఈ అజంతా చిత్రకళ ఫ్రెస్కో చిత్రకళను పోలియున్నదా, టెంపరా చిత్రకళను పోలియున్నదా యన్న సందేహము కలుగుట సహజము కాని విచిత్రమేమన ఈ అజంతాచిత్రములు ఫ్రెస్కో చిత్రకళనుగానీ టెంపరా చిత్రకళనుగానీ పూర్తిగా పోలియుండ లేదు. ఇటు ఫ్రెస్కో చిత్రకళను కొంతవరకు పోలియున్నను, పూర్తిగా ఆ పద్ధతినే యుండ లేదు, మరియు అటు ఈ చిత్రములు ఫ్రెస్కో చిత్రములకన్న టెంపరాచిత్రముల నెక్కువ పోలి యున్నప్పటికినీ, ఈ అజంతా చిత్రములు టెంపరా చిత్రములని చెప్పవీలుపడదు కొందరు ఈ అజంతా చిత్రములు ఫ్రెస్కో చిత్రములు కావని వాదించుచు, తమ వాదమును బలపరుచు టకు ఈ అజంతా చిత్రములందు, ఫ్రెస్కో చిత్రములలో గానవచ్చు అతుకులు ఎక్కడను లేవని నిరూపించియున్నారు మరియు ఫ్రెస్కో చిత్రములందు గిలాబ చేయబడిన ప్రదేశము తడి యారక మునుపే రంగులు వేయవలయును గావున, అది ఎక్కువ కాలము చెమ్మగా నుం డునట్లు చూడవలయును ఇది సాధ్యపడవలయు నన్న గిలాబ చేయుటకు వాడు పదార్థముల యొక్క పొర మందముగా, అనగా కనీసము అంగుళములో నాలుగవ వంతైన నుండవల యును. మన దేశములోని పొడిగాలులకు ఇగి రింపు గుణము గలదు గావున యిచ్చటి ఫ్రెస్కో చిత్రములందలి పొర మందముగా నుండుట మరీ అవసరము. సిగిరియా గుహలందు ఈ విధానమే అవలంబింపబడినది కాని, అజంతా గుహలందు ఈ పొర చాల సన్నముగానే యున్నది తొమ్మిదవ గుహలో ఈపొర అంగు ళములో ముప్పదిరెండవ వంతే యున్నది,కావున అజంతా చిత్రములు ఫ్రెస్కో చిత్రములుకావని వారి వాదము ఈ చిత్రములందు కొన్నిచోట్ల వాడిన వర్ణములు, టెంపరా చిత్రములందువలె కాంతిరహితముగా నుండుటవలనను, మరికొన్ని స్థలములందు టెంపరా చిత్రములందువలె వర్ణ ములు మాయుటవలనను, గిలాబ చేయబడిన విధానమును బట్టియు, నివి టెంపరా చిత్రములే అని వారి వాదన మఱియొక వర్గమువారు, ఈ అజంతా చిత్రములను లిఖించిన చిత్రశిల్పులు ఫ్రెస్కో చిత్రకళను పూర్తిగా అవలంబించక పోయినప్పటికి, ఆ విధానమునే కొన్ని మార్పు లతో తమ చిత్రములందు వాడిరని వాదింతురు. వారి వాదము లెట్లుండినను, మనకొక్క విష యముమాత్రము స్పష్టమగుచున్నది. భారతీయ చిత్రకారులు పరదేశములలో, ఆ కాలమునందు వాడుకలోనున్న ఏ చిత్రకళను యథాతథముగా అనుకరించక, ఒక ప్రత్యేక విధానమునే అవ లంబించి తమ నైపుణ్యమును, ప్రత్యేకతను సర్వప్రపంచమునకు చాటుకొన్నారు

ఈ విధముగా వర్ణములు వేయవలసిన ప్రదే శము సిద్ధపరుచుకొన్న పిదప దానిపై ఎఱ్ఱరంగు రేఖలతో తాము వేయదలచుకొన్న చిత్రమును గీసెడివారు ఈ లేఖనమును అనుభవశాలి

అయిన చిత్రకారుడే చేసినప్పటికీ, చిత్రకళా నిపుణుడు దానిని మరల అచ్చుటచ్చుల గోధుమ, నీరుకావి వర్ణములతోగాని, నల్లని వర్ణముతోగాని దిద్దిన నిదర్శనములుఉన్నవి ఆపిదప చిత్రమును మట్టినుండి తయారుచేయబడిన ఒక రకమైన పచ్చని పొరలో కప్పుదురు ఈ పొర అతిసన్నముగను, స్వచ్ఛముగను వుండుటచే పొరక్రింద నున్న చిత్రము బాగుగ కానవచ్చును ఈ విధానమును ఇటలీదేశస్థులు తమ ఫ్రెస్కో చిత్రములందు అవలంబించెడివారట ఈ పద్ధతి ననుసరించియే కాబోలు మనమీనాడు నూనె రంగులలో చిత్రించునప్పుడు 'మధ్యస్తరంగు' (Neutral colour) అనబడు బూడిదరంగుతో చిత్తుగా (Rough) గీయబడిన చిత్రమును కప్పివేసి, అది బాగుగ ఆరినపిమ్మట మిగిలిన చిత్రమును పూర్తి చేయుచున్నాము అజంతా చిత్రమునందు ఈ విధముగా చిత్రమంతయు కప్పిన పిదప, ఎరుపు, పసుపు, నీరుకావి, గోధుమ, నలుపు వర్ణములతో చిత్రించెడివారు అటుపిమ్మట ఆ చిత్రములోని ప్రతిమల ఆకారములనుచూపు రేఖలను దిద్దుదురు. ఆనాటి చిత్రశిల్పులు వెలుగునీడలను ఎక్కువగా చిత్రించనప్పటికి, మరీ అవసరమైనచోట చిత్రమంతయు పూర్తిఅయిన పిమ్మట కట్టకడకు కొలది ఛాయలను చిత్రించెడివారు

వారు వాడిన కుంచెలనుగూర్చి మనకేమియు తెలియకున్నది. కాని వారు వాడిన వర్ణములను గూర్చి మాత్రము తెలియుచున్నది. ఫ్రెస్కో చిత్రములందు గిలాబచేయుటకు సున్నపునీరు వాడుదురు గావున అందు సున్నపునీరు ప్రతిక్రియచేసి శిథిలపరచని వర్ణములనే వాడవలసి వచ్చెడిది ఇందుమూలముననే వర్ణములు మంటి నుండియే తయారుచేయవలసి వచ్చెడిది, అందుచే ఫ్రెస్కో చిత్రములందు ఎక్కువ వర్ణములుపయోగించుటకు అవకాశములేదు. కాని ఈ అజంతా చిత్రములు ఫ్రెస్కో చిత్రములవలె కచ్చితముగా నుండలేదు గావున,ఇందు ధూమ్ర, చెంగావి, పాటల హరితాది వర్ణములుకూడ వాడబడెను. మట్టి, వృక్షజాతులు, ఇనుము తుప్పు మొదలగు వాటినుండి ఈ వర్ణములు తయారు చేయుచుండెడివారు. కాని దురదృష్టవశాత్తు వారు వర్ణములు చేసిన విధానము మాత్రము తెలియకున్నది. అందుచే మనమీనాడు వర్ణములకై విదేశ దిగుమతులపై ఆధారపడవలసి వచ్చినది కాని చిత్రమేమన యిరోపియనులు ఈ వర్ణములు బహుకాలము మన్నుటజూచి, అవిచేయు విధానముగూర్చి ప్రయోగములు చేయుచున్నారు. ఈ వర్ణములుచేయు విధానము నశించుటకు ముఖ్యకారణము, ఆనాటి చిత్రకారులు దానిని రహస్యముగా నుంచుటయే ఈ నాటికిని మన దేశములో ఈ విధానము తెలిసిన ఒకటి రెండు కుటుంబములున్నప్పటికీ, వారు ఇతరులకు చెప్పకున్నారు విధానము తెలియకపోయినప్పటికీ, ఈ వర్ణములు ఏ వస్తువులనుండి తయారుచేసెడివారో చూఛాయగా తెలియుచున్నది. ఈ చిత్రములందు వాడబడిన వివిధఛాయల ఎఱుపురంగు, ఇనుము చేరిన పదార్థములయొక్క తుప్పునుండి తయారు చేయబడినది ఇందు సింధూరవర్ణము, ఇంగిలీకమునుండి చేయబడినది పచ్చలన్నియు సాధారణముగ బాగుగ పొడి చేయబడిన ఇనుప పదార్థముగల యిసుకనుండి ఉత్పత్తి చేయబడినవే కొన్ని పచ్చలు వృక్షజాతుల పదార్థముల నుండి సైతము తయారుచేయబడి యుండవచ్చును తెలుపెక్కువుగా సున్నమునందు గంధకద్రావకము చేరికవల్లనైన ఉప్పునుండియు, పాలతుత్తము నుండియు, సీసభస్మమునుండియు, లోహపదార్థముగల మట్టినుండి తయారుచేయబడు చుండెడిది నలుపు దీపపు ప్రమిదల మసినుండి గైకొనబడినది వెలుగుచున్న దీపపు ప్రమిదమీద, వెదురో, రెల్లుగడ్డియో యుంచి ఈ మసిని తయారుచేసెడివారు. నీలము 'లపిజ్ లజూల్లీ' అను నీలిరంగు గల ఒక విధమైన లోహమునుండి (మైలతుత్తము) తయారుచేయుచుండిరి. పసుపువర్ణము తాళకమని అభిప్రాయపడుచున్నారు, ఇది 'హారశెల్' అను 'ఆర్యనిక్ సల్ఫైడ్' నుండి తయారుచేయబడినది. ఇక ధూమ్రపాటలాది వర్ణములను పై వర్ణములు కొన్ని కలిపి తయారుచేసెడివారు.

ఇవ్విధమున కొన్ని ప్రత్యేకసూత్రములను ఆధారభూతముగా చేసుకొని చిత్రింపబడిన ఈ భారతీయ ప్రాచీన చిత్రములు జగత్ ప్రఖ్యాతి గాంచుటలోను తన్మూలమున భారతీయ చిత్రకళ వాసికెక్కుటలోను మనమాశ్చర్య పడవలసిన దేమియులేదు.

నివేదనము

శ్రీ వెల్దండ ప్రభాకరరావు

లలితంబై తనరారు తావక తనూ లావణ్య తారుణ్యముల్
జలజాతంబులఁబోలు లోచనములున్ సౌందర్యపుం జెక్కిళుల్
కవితాహ్లాదము త్వన్ముఖామల రుచిన్గండ్లార వీక్షింపగన్
గలుగుంగాదొకొ తృప్తి? యేలనిక శంకల్ శారదాంబామణీ!

పశ్చాత్తాప మనంబుతో ననయమున్ బాపౌఘముల్ క్రుంగగా
నిశ్చింతన్భవదీయ మంత్రజపమే నిష్కర్షగా జేయుచోఁ
బశ్చాజ్జీవితమందునం గలుగుఁ గైవల్యంబు భోగంబుల
న్నిశ్చేష్టన్విడనాడగా నెవరికేనిన్ శారదాంబామణీ!

తెలియంజాలరు నిన్ను నీ మహిమ నీ దివ్యస్వరూపంబు లో
కులు పల్గాకులు నిన్ను గొల్వకయె సంకోచంబు లేకుండగాఁ
బలుమార్గంబులలోఁ జరింతురనగా బ్రహ్మంబు దర్శింపకే
కలయో నైజమొ నేర్వరాదు మదికింకన్ శారదాంబామణీ!

దివ్యజ్ఞానసురూప మర్కనిభ దీప్తింబోల్చు త్వత్తేజమున్
భవ్యజ్ఞాన వికాసమున్ సుకవితాపారంగతుల్ విజ్ఞులై
దివ్యత్వమ్ము బయల్పడంగఁ గవితాధీప్రౌఢిమన్ వ్రాయరే
కావ్యంబుల్ సరియేరి వీరి కెఱుగంగన్ శారదాంబామణీ!

పద్వత్తజము భాసిలం గవులు సన్నుతించి వర్ణించి తా
రద్వంద్వంబగు కీర్తి ముక్తి పదమం దావాసులై సిద్ధులై
విద్వల్లోక చిదాత్ములై మెలఁగు ప్రావీణ్యంబు నీ వౌటచే
విద్వద్వేద్యము కానిదేది యది దేవీ! శారదాంబామణీ!

గంగా నిర్ఝరతుల్యమైన రసవాగ్ధారా సుసంపత్తి నీ
యంగీకారమునన్ లభించినపు డీ వ్యాసంగ సంపత్ప్రభన్
గంగన్గల్పిన సత్ఫలాప్తి యెటులో కాల్దన్నుచో మూర్ఖతన్
భంగంబౌను గవిత్వమంతటఁ దలంపన్ శారదాంబామణీ!

కమలంబుల్ వికసించు భాస్కరుని రాకంజూచి విశ్వంబులో
దమమున్బాయును లోకబాంధవుని సందర్శించి ముల్లోకముల్
తిమిరస్తోమము వీడకే మెలఁగు ధాత్రీజీవకృత్యాలు సూ
పె మహైశ్చర్యము గొల్పుచుండెడిని దేవీ! శారదాంబామణీ!

గురుఁడేదైవము, జ్ఞానదాతను మహాశ్రద్ధాత్ములై మానవుల్
పరమజ్ఞానకళాత్మునిం దెలియకే భావాంధకార ప్రభా
కరుగానెంచరు సంస్తుతింప రిది లోకంబంత నీర్ష్యాళువై
యరయన్నబ్బురమయ్యెడిన్ నలువచానా! శారదాంబామణీ!

కావేరీలహరీ జలాంతరము నేకాగ్రంబుగా నాడు భ
క్త్యావేశంబున స్నానమాడి కనఁగానారాటముం బొందితిన్
భావాంతర్గతుఁగాంచు భాగ్యమిపుడీ వర్షంబునందైన నో
దేవీ! కల్గునొ లేదొ తెల్పు జనయిత్రీ! శారదాంబామణీ!

పరవాసంబె రుచించె మేలగుచు నావాసంబు సంసార సా
గర తాపత్రయ ఘోషలంబడుచు విఘ్నంబయ్యె నీ సేవకున్
తరుణంబన్న గతించిపోవునది వాత్సల్య ప్రభాదృక్కులే
కలవయ్యేన్ జననీ! ప్రభాకరునికింకన్ శారదాంబామణీ!

విజేత

(కథానిక)

శ్రీ 'అమరేంద్ర'

(చారిత్రక కల్పనాత్మకం)

ఆ అద్భుతదృశ్యం చూసి గ్రీకు సేనాపతి ఆశ్చర్యంతో అక్కడే నిలబడిపోయాడు అది స్వప్నమో సత్యమో తేల్చుకోలేక కళ్లు మూసి మళ్లీ తెరుస్తూ ఎంతోసేపు పరికించి చూశాడు. ఎన్నిసార్లు చూసినా ఆ దృశ్యమే కళ్లని మిరుమిట్లు గొలుపుతూ కనబడ సాగింది. ఆ సేనాపతి తల విస్మయంతో చక్రంలాగా గిర్రున తిరిగిపోయింది

అప్పుడే ఉదయిస్తున్న తరుణభానుని కరాల గిలిగింతలకు పులకించి నిద్రకనులు విప్పిన పద్మిని సరోవరతరంగాలలో సొగసుగా తూగుతున్నది. తరుశాఖలకు వ్రేలాడే పిచ్చుకగూళ్లు మలయసమీరంలో ఊగుతున్నట్లుగా ఆ పరిసరమంతా ఏదో పవిత్రమైన ఆనందపారవశ్యంలో డోలితమై లాలితమై కనబడుతోంది. చిలకలూ, కోకిలలూ, ఆ పరిసరాన్నంతా తమ కలకలధ్వనులతో నింపుతూ పుష్పించిన లతలమీద ఊయెల లూగుతూ జలజలపారే సెలయేళ్లతో పంతం వేసుకున్నాయ్. బెదురుచూపులతో లేడిపిల్లలు అందంగా గంతులువేస్తున్నయ్ తమ క్రూరస్వభావాన్ని మరిచిపోయినట్లుగా వన్యమృగాలు నాగస్వరంవిని కదలలేకుండా పడిపోయిన సర్పాలమాదిరిగా చెట్లనీడలలో కళ్లు సగం మూసుకుని కునికిపాట్లు పడుతున్నాయి. వాటిముందరే పిరికికుందేళ్లు వీరాగ్రేసరుల్లాగా గెంతుతూ ఆడుకుంటున్నాయి. లేతచిగుళ్లూ, విరబూసిన మోదుగు పూలూ వనలక్ష్మి వసంతునికి హారతులెత్తినట్లుగా కనిపిస్తున్నాయి ఆ పరిసరమంతా ఏదో అతిలోకమైన సౌందర్యంతో, అనిర్వచనీయమైన ఆనందంతో, శాంతితో కాంతితో పవిత్రంగా వెలిగిపోతున్నది

ఆరామం మధ్యలో ఒక చిన్నపర్ణకుటీరం చిగురాకుల సందుల్లోంచి తొంగిచూస్తున్నది. ఆ కుటీరం మౌనదేవతకిఅమర్చిన సింహాసనం లాగుంది. ఈ ప్రపంచంలోని సుఖదుఃఖాల కెరటాల పరవళ్ళు ఆ కుటీరాన్ని తాకలేక తలవంచి వెనక్కి తిరిగివస్తున్నట్లని పిస్తుంది. ఏదో కనబడని దుర్భేద్యమైన గోడ ఆ ఋషి వాటికని బాహ్యప్రపంచపు సంఘర్షణల నుంచి పరిరక్షిస్తున్నట్లు తోస్తుంది

కళ్లు నలుపుకుని గ్రీకు సేనాపతి ఇంకోసారి చూశాడు ఆశ్చర్యంతో కళ్లు మరింత పెద్దవిచేసి ముఖంమీదికి వాలే ముంగురులని పక్కకి తప్పించుకుంటూ రెప్పవాల్చకుండా చూశాడు

సందేహంలేదు. ఆ ఋషి వాటికచుట్టూ కళ్లు చెదిరిపోయే కాంతి అలాత చక్రంలాగా తళతళా తిరుగుతోంది ఏదో దివ్యకాంతి ఆ కుటీరంచుట్టూ పరివేషంలాగా పరివేష్ఠించి "ఇది ఇతరులు అడుగిడజాలని పావనలోకం" అని చాటుతున్నది సంసారుల ఆశ నిరాశలూ, సాహసికుల ధైర్యశౌర్యాలూ, చక్రవర్తుల వైభవప్రాభవాలూ, గౌరవగర్వాలూ ఏవీ భేదించలేని మహితశక్తి ఆ పర్ణకుటీరంలో కోట కట్టుకుని రాజ్యం చేస్తున్నట్లు తోస్తున్నది.

సేనాపతి శిబిరానికి ఒక్కపరుగు తీశాడు. "ప్రభూ! మన్నించాలి ఆ పని నావల్లకాదు. నిప్పులో నిలువునా దూకమన్నా నేను వెనుదీయను కాని ఆ పర్ణశాలలో పాదం పెట్టడం నాకు సాధ్యంకాదు." అని వగర్చుతూ విన్నవించాడు సేనాపతి.

"ఏం? ఎందుకని?" అని ఆశ్చర్యంతో కనుబొమలు ఎగరేసి, కోపంతో ఎరుపెక్కిన

కళ్లతో సింహంలా గర్జించాడు వీరకేసరి అలెగ్జాండరు. భారతదేశాన్ని జయించి తను విశ్వవిజేతగా కలకాలం వెలుగొందాలనే ఆశతో వచ్చాడు తుఫానుగాలికి తట్టుకోలేక తలలువంచే మహావృక్షాలలాగా భారతదేశపు ప్రజలూ రాజులూ పాదాక్రాంతులై పోతున్నారు ఒక్క పురుషోత్తముడు మాత్రం మడమ తిప్పకుండా పోరాడి తల వంచనిశూరాగ్రేసరుడై ఆకాశంఎత్తునలేచిన భారత పరాక్రమానికి జయస్తంభంగా నిలబడ్డాడు

ప్రభంజనంలాగా, ప్రళయసాగరంలాగా తనధాటి అప్రతిహతం, అపరిమితం!

కాని ఏమిటీ విపరీతం? తన శాసనానికి ధిక్కారమా? తన ఆజ్ఞకి తిరస్కారమా? ముల్లోకాలనీ గజగజలాడించిన జగద్విజేత ప్రచండశక్తికి ఇంతటి పరాభవమా?

తన శిబిరానికి అల్లంతదూరంలో వున్న కుటీరాన్నిచూసి అలెగ్జాండరు ముచ్చట పడ్డాడు అంతకుముందు భారతీయఋషుల ప్రభావాన్ని గురించి గురుదేవుడు అరిస్టాటిల్ ఎన్నోసార్లు కొనియాడగా విన్నాడు అటువంటి ఋషిసత్తములని కలుసుకుని, వాళ్లతో తను ప్రసంగించాలనే బలమైన కోరిక మనస్సులో నాటుకుంది కాని రణకోలాహలం హృదయాన్ని పూర్తిగా ఆక్రమించివేసింది మరేవిషయానికి హృదయంలో తావు లేకపోయింది

ఇప్పటికి రణదుందుభుల సందడి సమసిపోయింది భారతీయుల అజేయశక్తిని పురుషోత్తముని స్వరూపంలోరు సందర్శించిన తరువాత అలెగ్జాండర్ సంకల్పం సడలింది ఎన్నో యేళ్లకిందట ఇల్లాళ్ళనీ పిల్లలనీ విడిచివచ్చిన సైనికుల హృదయాలు ఎంతటి బెంగతో అంగలారుస్తున్నవో ఊహించ కలిగాడు తన శక్తికి భయపడి లోపలనే అణచుకుంటున్న అశాంతితో ప్రతి సైనికుని శూరహృదయమూ నివురుకప్పిన అగ్నికుండంగా కనబడుతున్నది ఇంక ఈ అంతులేని యుద్ధాలూ, విజయాలూ, కోలాహలాలు ఎన్నాళ్లు? పారే నెత్తురువాగులు, కురిసే కన్నీటివానలు, తీరని దురాశల అరుపులు ఇంకెన్నాళ్లు? అలసిపోయి, విసిగిపోయి అలెగ్జాండరు హృదయం ఏకాంతంలో మౌనంగా "ఇంతేనా? ఇంతేనా" అని నిట్టూర్పులు విడుస్తోంది

అందుకే ఆ కుటీరంలోవున్న వ్యక్తిని పట్టితెమ్మని సేనాపతిని ఆజ్ఞాపించాడు ఆవ్యక్తి తనదగ్గరికి వచ్చినప్పుడు సగౌరవంగా సత్కరించాలని అలెగ్జాండరు సంకల్పం తానే ఆ ఋషి వాటికి వెళ్ళాలనే ఊహ కలగలేదు విజయగర్వంతో మత్తెక్కిన అతని హృదయంలో అంతటి వినయానికి తావెక్కడిది? తనపేరు వింటేనే ముల్లోకాలూ గజగజ వణుకుతుంటే ఈపేదగుడిసెలో కాలంగడిపే ఋషి తన మాట జవదాటగలడా అనుకున్నాడు తన ప్రతాపం, దర్పం, శక్తి చూరలేని ప్రదేశాలు లోకంలో ఎక్కడా లేవని ఆ వీరాగ్రేసరుడి విశ్వాసం

"ఎందుకని?" అని మళ్లీ గర్జించాడు అలెగ్జాండరు "కారణం నేను చెప్పలేను ప్రభూ! తమ కళ్లతో చూస్తేకాని నా మాటలు నమ్మలేరు" అని సేనాపతి వణుకుతున్న కంఠంతో విన్నవించాడు.

"అల్లాగా!" అని మౌనంలో మునిగిపోయాడు అలెగ్జాండరు అంతరంగంలోంచి ఒక అశాంతి తరంగం చెలరేగి కాలసాగర సైకతాలలో అతను కట్టుతున్న పిచ్చుకగూళ్లన్నిటినీ కూల్చుతానని బెదరించినట్లు తోచింది విజయశిఖరాలమీద నాటిన గర్వకేతనాలన్నిటినీ గడగడ వణికిస్తూ ఎదోభీకర ప్రభంజనం విజృంభించినట్లు అనిపించింది

"నువ్వు వెళ్లు!" అని అలెగ్జాండరు శిబిరంలోకి తిరిగివచ్చాడు వెంటనే మళ్లీ బైటికి వచ్చి "సేనాపతీ! జరిగిందేమిటో చెప్పు" అన్నాడు

"నేనేమని చెప్పను ప్రభూ! ఎన్నో శత్రువ్యూహాలని అవలీలగా ఛేదించిన నేను ఆకుటీ

రం దరిదాపులకైనా పోలేక తిరిగివచ్చాను "

"సరే ఈసారి నేనే వెళ్తాను ఒంటరిగా వెళ్తాను" అంటుంటే అలెగ్జాండర్ కంఠంలో విజయగర్వానికి బదులు ఏదో కొత్తజీర విన బడింది ఆజానుబాహువైన అతని ఉగ్రసుందరరూపంలో ఏదో కొత్తకాంతి కనబడింది

• • •

ఆ నిశీధంలో నీడలాగా నడిచివెళ్లాడు అలెగ్జాండరు. సకల వైభవాలనీ దూరంగా వదిలి కాలినడకన బయలుదేరాడు

మబ్బులు కమ్మిన ఆకాశంలో మిణుకుమనే ఒంటరి నక్షత్రంలాగా ఆ కుటీరంలో దీపకళిక తళుక్కుమంటున్నది. వన్యమృగాల భీకర రావాలూ, కీచురాళ్ల కంపితస్వరాలూ, నిశ్శబ్దాన్ని భేదిస్తున్నయ్ గూళ్లలో నిద్రపోయే పిల్లలమీద వెచ్చని రెక్కలుకప్పి పక్షులు కళ్లుమూస్తున్నయ్. అల్లిబిల్లిగా అల్లుకుపోయిన గుబురుల నీడల్లో చిక్కనిచీకటి జడలు విరబోసుకుంటున్నది

కుటీరంలో దీపకళిక తళుక్కుమంటున్నది! ముట్టడించే చీకటిపైకి దూసివిసిరిన పదునుకత్తిలాగా మెరుస్తోంది. కోరికల సుడిగాలులకి లొంగని నిశ్చలచిత్తంలాగా నిలబడి వెలుగుతోంది

"స్వామీ! ప్రణామం" అన్నాడు ప్రాంగణంలో అడుగుపెడుతూ అప్రయత్నంగా నమ్రభావం ఉద్ధతహృదయాన్ని లొంగదీసి కంఠంలో జొరబడింది.

"నువ్వా? వచ్చావా?" అంటూ కరుణాకోమల స్వరం పలకరించింది. కృష్ణాజినం మీద పద్మాసనం వేసుకున్నమూర్తి జ్వలించే హోమాగ్ని వెలుగులోఒక్కసారి మెరిసింది. పాదలలాగా ముఖమంతా అల్లుకున్న మీసాలూ,గడ్డాలూ...మిణుగురుల్లా మెరిసే పదునైన చూపులు...పెదవులమీద తొణికే మందహాసం. .సువిశాలఫాలభాగంలోరాజ్యం చేసే ప్రశాంతి...ప్రొద్దుటి మంచులో తడిసిన పున్నాగపూలు రాసిపోసినట్లున్న సౌమ్య సుందరవిగ్రహం.

"వచ్చాను స్వామీ! మీ సందర్శనం నాకు అమందానందం ప్రసాదించింది" అంటూ అలెగ్జాండరు ఆ మూర్తినుంచి ప్రసరిస్తున్న తేజస్సుకి ముగ్ధుడైపోయాడు. లొంగినట్లు తల వంగింది

"రా నాయనా' మీవంటి ఘనులు మా కుటీరాలకి అతిథులై వస్తే ఎల్లా సత్కరించగలం? మా దగ్గర ఏమున్నది? రత్నాసనాల పైన ఆసీనులయే పెద్దలకి మా కుటీరాలలో ఎల్లా మర్యాదలు చేయగలం? రండి దయచేయండి. ఈకృష్ణాజినంమీద ఆసీనులుకండి" అని సగౌరవంగా ఎదుట పరచివున్న ఆసనాన్ని చూపించాడు

"మీ సందర్శనమే మాకు ఉత్తమసత్కారం" అంటూ అలెగ్జాండరు నేలమీద పరిచిన చర్మాసనంమీద చతికిలపడ్డాడు

కాని కణకణమండే నిప్పులమీద, వాడియైన సూదులమీద కూలబడినట్లుగా క్షణక్షణమూ చెప్పలేని యాతనతో ఒక యుగంగా గడుస్తోంది ఆ చర్మాసనం గిర్రున తిరిగిపోతున్నట్లనిపించింది కుడివైపుకి జరిగితే ఎడమవైపునించి పైకి లేచిపోతున్నట్లుగా తోచింది ఎంత ప్రయత్నించినా ఆ ఋషి చూపిన ఆసనంపైన స్థిమితంగా కూచోలేకపోతున్నాడు ముందుకివస్తే వెనకనించి, వెనక్కి జరిగితే ముందునించి ఆ చర్మాసనం పైకి లేచిపోతూ తికమక పెడుతోంది. సర్వం సహాచక్రాన్ని శాసించినఅలెగ్జాండరు కృష్ణాజినాన్ని అదుపులో వుంచలేక సతమతమైపోయాడు ముచ్చెమటలు పోసినాయి. తన అవస్థకి చిన్నబుచ్చుకున్న ముఖాన్ని ఎత్తలేకపోతున్నాడు గొంతుతడి ఆరిపోతుంది

"భయంలేదు కూచో నాయనా!" అని ఆదరపూర్వకంగా సంబోధించాడు ఋషిపుంగవుడు అలెగ్జాండరు కృష్ణాజినంమీద కూచోలేక లేచినిలబడ్డాడు. సిగ్గుతో ముఖం జేవురించింది. నోట మాటరావటంలేదు.

"ఇంత విశాల ప్రపంచాన్ని జయించావు కాని నీలోపలేవున్న చిన్న ప్రపంచాన్ని జయించలేకపోయావు అందుకే ఈకృష్ణా జినం మీద నువ్వు కూచోలేకపోయావు రత్నాసనాలని అలంకరించే అర్హత సంపాదించావు కాని నిన్ను నువ్వు తెలుసుకుని ఆత్మపీఠాన్ని అధిష్ఠించటానికి ప్రయత్నించు అప్పుడు మహోన్నత విజయం నీకు సిద్ధిస్తుంది. సింహాసనాలు ప్రసాదించలేని ప్రశాంతమాధుర్యం ఈ కృష్ణాజినం నీకు అందిస్తుంది తృష్ణతో అల్లాడిపోయే నీహృదయాన్ని,తృప్తితో జోలపాడు సంయమంలో సంతృప్తిలో కోటిస్వర్గాలని కొల్లగొను. కళ్లు తెరు నిజమైన విజయయాత్రకి పురోగమించు" అని ఋషిపుంగవుని గంభీరస్వరం పర్జన్యశంఖం పూరించింది. పరమగురువు సోక్రటీస్' గురువర్యుడు అరిస్టోటిల్ చేసిన బోధలకి కొత్తరూపం, కొత్తబలం వచ్చి హృదయాన్ని ఉగ్రూతలూగించినట్లు తోచింది అక్కడ ఎంతసేపు నిలబడ్డాడో తనకే తెలియదు మౌనసమాధిలో మునిగిపోయిన ఋషిపుంగవుడికి మనస్సులో ప్రణామాలు సమర్పించి శిబిరానికి తిరిగివచ్చాడు అంధకారంలో వినూతనకాంతిపథం కళ్లముందు మెరిసింది

"సేనాపతీ! రేపే మన తిరుగుప్రయాణం. సకల సన్నాహాలూ సత్వరంగా కొనసాగించు" అని అలెగ్జాండరు మేఘమంద్ర స్వరంతో ఆజ్ఞాపించాడు.

"నిజంగానా ప్రభూ?" అన్నాడు సేనాపతి తనవీనులని తనే నమ్మలేక. ఎంతనమ్మరానిమాట! ఎన్నాళ్లకెన్నాళ్లకి చల్లని మాట!

"నిజం. స్వదేశానికి! పగలూ రాత్రీ నిర్విరామంగా యాత్ర సాగాలి ఈపక్షి తన గూటికి చేరుకోవాలి. మరుపుల మసకలో మాసిపోతున్న స్వదేశాన్ని గుర్తు చేసుకుంటూ తరలివెళ్ళాలి..." అంటూ అలెగ్జాండరు ఏదో తన్మయత్వంలో లీనమైపోయాడు. మానససరోవరంకోసం రెక్కలు సాచి ఎగిరిపోతున్న రాజహంసలాగా అలెగ్జాండరు హృదయం మారిపోయింది.

స్వదేశ సందర్శనంకోసం మహోత్సాహంతో, కుతూహలంతో సైనికులుచేసిన హర్షధ్వనులు మిన్నుముట్టినాయి అది తిరుగు ప్రయాణమే అయినప్పటికీ అన్ని జైత్రయాత్రలనీ మించిన ఆనంద పారవశ్యంతో సైనిక హృదయాలు చిందులు తొక్కినాయి

తను భారతదేశాన్ని జయించాడా? భారతీయ ఆత్మగరిమ తనని జయించిందా?ఎవరు విజేత? పరాజితుడెవరు? ఈ ఎడతెగని ప్రశ్న ఆ జగద్విజేత హృదయాన్ని కలవర పరుస్తునేవుంది. ఇన్నాళ్ళనుంచీ సాధించిన విజయాలన్నిటినీ మించే మహావిజయంకోసం అడుగుసాగించాడు.

*

రెండవ లూనిక్

శ్రీ వసంతరావు వేంకటరావు

రష్యన్ రాకెట్ "రెండవ లూనిక్" చంద్ర మండలాన్ని చేరుకొంది: 13-9-59 ఆదివారం రాత్రి మన కాలమానం ప్రకారంగా 2 గం 32 ని. 24 సెం లకు రాకెట్ చంద్రతలాన్ని తాకింది ఆ సమయానికి భూమినుండి 2,33,600 మైళ్ల దూరంలో చంద్రుడున్నాడు చంద్రుని చేరిన రాకెట్ తుదిభాగపు బరువు 3324 పౌన్లు- రమారమి ఒకటిన్నర టన్నులు ఇది గొప్పవార్త భూమిని విడిచి మరొక నభోమూర్తిని జేరేటట్లు వస్తువులను పంపించడానికిదే మొదటిసారి రష్యన్లు పంపిన మొదటి లూనిక్, అమెరికన్లు పంపిన నాల్గవ పయనీరున్ను భూమియొక్క ఆకర్షణబలాన్ని త్రెంపుకొని, చంద్రుని ఆకర్షణక్షేత్రాన్ని దాటిపోయి, సూర్యునిచుట్టూ తిరుగుతూ గ్రహాలవలె నున్నట్లు భావన సిద్ధాంతరీత్యా చంద్రలోక ప్రవేశం కష్టమైన పనికాదు. కాని, దానిని వాస్తవికంగా సాధించడం గొప్ప విశేషమే:

గురుత్వాకర్షణం సార్వజనీనమైన బలం ఆ బలంచేతనే సూర్యునిచుట్టూ గ్రహాలు ప్రదక్షిణాలు చేస్తున్నాయి, కొన్ని గ్రహాలచుట్టూ ఉపగ్రహాలు అవిచ్ఛిన్నంగా తిరుగుతున్నాయి. మనభూమి ఒక గ్రహం, భూమిచుట్టూ తిరుగుతూన్న ఒకే ఒక ఉపగ్రహం చంద్రుడు ప్రతి వస్తువూ ప్రతి ఇతరవస్తువునీ ఆకర్షిస్తుందని 17 వ శతాబ్దంలో విజ్ఞాని న్యూటన్ గురుత్వాకర్షణ నియమాన్ని ప్రతిపాదించేడు ఒక నాటి సాయంకాలం తనతోటలో కూర్చున్న న్యూటన్ ఆరముగ్గిన ఆపిల్‌పండు పట్టుతప్పి క్రిందపడటం చూచేడనీ, దానితో ఒక విశేష భావ పరంపర ఆయన హృదయంలో జనించిందనీ, అది గురుత్వాకర్షణ నియమప్రతిపాదనకు దారి తీసిందనీ ఒక ఇతిహాసముంది

ఏ రెండు వస్తువుల మధ్యనైనా గురుత్వాకర్షణ మున్నప్పటికీ, నక్షత్రాలూ గ్రహాలూవంటి పెద్దపెద్ద ద్రవ్యరాసులు సామాన్యవస్తువులను ఆకర్షించి వాటిని తమ ఒడిలో నుంచుకోడానికే నిత్యం ప్రయత్నిస్తూంటాయి అట్టి సందర్భంలో, ఆకర్షించే పెద్దమూర్తియొక్క ద్రవ్యరాశి (mass) మీదనే ఆకర్షణబలం ఆధారపడుతుందని చెప్పవచ్చును మనభూమి విషయం యోచిస్తే, దానిబరువు 5 87 కోట్ల కోట్ల కోట్ల టన్నులు, దాని వ్యాసం 7910 మైళ్లు భూమి నావరించుకొని గురుత్వాకర్షణ క్షేత్రముంది. అది ప్రతివస్తువుని భూకేంద్రముఖంగా లాగుతుంది ఏ వస్తువును మనం పైకి విసిరినా, కొంతదూరం పైకిపోయి, ఆగి, క్రిందపడుతుంది ఏదో కొంత వేగంతో ఒక వస్తువును పైకి విసిరినప్పుడు ఆకర్షణబలం మూలంగా దానివేగం సెకెనుకి 32 అడుగుల చొప్పున ప్రతి సెకెను తగ్గిపోతూండగా, కొంత సేపటికి ఊర్ధ్వగమనంపోయి, క్రిందపడటానికి మొదలుపెట్టుతుంది

అయితే, ఎంతవేగంతో విసిరితే ఏవస్తువైనా భూమియొక్క ఆకర్షణక్షేత్రాన్ని దాటిపోతుందో సులభంగా లెక్క కట్టవచ్చును భూతలంనుండి జారవిడిచిన రాయి భూకేంద్రాన్ని చేరేవరకు ఆకర్షితమై వేగవృద్ధితో ప్రయాణంచేస్తుంది. ఆ వేగవృద్ధి విలువ తెలుసును. భూమియొక్క వ్యాసార్ధం 3957 మైళ్లనుకొని లెక్క కట్టగా రమారమి 7 మైళ్లు సెకెనుకి అని ఫలితం లభిస్తుంది. అందుచేత సెకెనుకి 7 మైళ్ల వేగంతో బయలుదేరిన వస్తువేదైనా భూమియొక్క గురుత్వాకర్షణక్షేత్రాన్ని దాటిపోగలదని నిర్ణయం అంతకు తక్కువ వేగంతో బయలుదేరిన వస్తువేదైనప్పటికీ తిరిగి భూతలాన్ని చేరుకోవలసిందే

భూమియొక్క గురుత్వాకర్షణ క్షేత్రంలో చంద్రుడున్నాడని స్పష్టమే. లేకపోతే, భూమిచుట్టూ తిరగవలసిన అవసరం లేకుండా, ఏనాడో, శూన్యాకాశంలోనికి పోయి, సూర్యునికి ప్రదక్షిణాలు చేసేవాడు కాని, చంద్రుడు కూడా, భూమిలాగ, వస్తువులను తనఒడిలోనికి

లాగుకొనే ప్రయత్నంలో నున్నాడు. కాబట్టి, భూమినుండి పైకిపోతున్న కొలదీ, భూమి యొక్క ఆకర్షణ బలం తగ్గుతూండగా, చంద్రుని సమీపిస్తూంటే చంద్రుని ఆకర్షణ బలం ఎక్కువౌతూంటుంది. అంటే, భూమ్యాకర్షణం చంద్రాకర్షణం సమానమయేక్షేత్రం భూమికీ చంద్రునికీ మధ్య నుండక తప్పదు. ఆ క్షేత్రాన్నిదాటి పైకిపోతేగాని చంద్రునిచే ఆకర్షింపబడే అవకాశం ఏ వస్తువుకూలేదు భూమినుండి ఆ దూరాన్ని లెక్కకట్టగా అది 2,16,000 మైళ్లని తెలియవచ్చింది.అందుచేత, ఏ వస్తువైనా భూమినుండి 2,16 000 మైళ్ల దూరం పోతేకాని చంద్రాకర్షణకు లొంగదు. అంటే భూమినుండి బయలుదేరిన రాకెట్ అధమం 2,16,000 మైళ్లు సూటిగా పోవాలి; అప్పుడు చంద్రుని దగ్గరగా చేరినట్లయితే చంద్రతలాన్ని తాకగలదు

చంద్రాకర్షణ క్షేత్రంలో ప్రవేశించినప్పటికీ చంద్రలోకంలో దిగాలంటే, ఆ వస్తువుయొక్క వేగం బాగా తగ్గిపోవాలి. ఏమంటే, చంద్రలోకంలో ఆకర్షణబలం వల్ల కలిగే వేగవృద్ధి మనలోకంలో వేగవృద్ధికంటె తక్కువ. అందుచేత, చంద్రునిలో సెకెనుకి 1 1/2 వేగం సంపాదించిన వస్తువు చంద్రాకర్షణాన్ని ప్రతిఘటించి పైకి పోగలదు. కాబట్టి తక్కువ వేగంతో గమిస్తూ చంద్రతలంవైపు తిరిగిన వస్తువుమాత్రమే చంద్రునిలో పడుతుంది సోవియట్ శాస్త్రవేత్త ఎడ్‌గెనీ ఫెడెరోవ్ ప్రసంగిస్తూ చంద్రుని చేరుకొనే రాకెట్టుకంటె చంద్రునిచుట్టూ తిరుగగల రాకెట్టుని ప్రయోగించడం సులభమన్నాడు. ఏమంటే, అనేకమార్గాలలో పంపిన రాకెట్లు ఉపగ్రహాలవలె ప్రవర్తించగలవు కాని, చంద్రుని ఢీకొనాలంటే ఒకే మార్గాన్న పంపించాలి. ఆ విధంగా రెండవలూనిక్‌ని పంపించేరు

భూమ్యాకర్షణ బలాన్ని దాటిపోడానికి రాకెట్‌కంటె వేరు ఉపాయంలేదు. విమానాలు ప్రయాణం చెయ్యడానికి గాలి కావాలి. 10, 15 మైళ్ళ ఎత్తుకి పోయేసరికి గాలి చాలా పలుచనై విమానయానానికి సహాయపడలేదు. ఒకవైపు నుండి మండిన పదార్థపుపొగ మహావేగంతో దూసికొని వస్తూంటే, దానికెదురుగా నున్న దిశలో రాకెట్టు ప్రయాణంచేస్తుంది. దీపావళి నాటి రాత్రి తారాజువ్వలను కాలుస్తారు అవి ఒక విధమైన రాకెట్లే. పేకగొట్టాలు తయారు చేసి, ఒకవైపు చిన్న రంధ్రముండేటట్లు దారంతోబిగించి,గొట్టంనిండా మందు దట్టించి, గొట్టానికొక కొబ్బరి ఈనెకట్టి, మందు ముట్టిస్తే తారాజువ్వ పెద్దవేగంతో పైకెగిసి పోతుంది. మందు కాలుచున్నంతవరకు పైకి పోయి, మందు పూర్తిగా మండిపోగానే అధోముఖమౌతుంది. ఇదే రాకెట్టుకి సంబంధించిన సూత్రం

ఒకదానిలో నొకటి అమర్చిన పెద్దరాకెట్టును, అంచలవారీగా, మూడు నాలుగు అంచలలో పైకి పంపినప్పుడు భూమియొక్క ఆకర్షణ శక్తిని అధిగమించగల వేగంతో తుది భాగం పైకి పోగలదు. అప్పుడది అంతర్గ్రహాకాశంలో జొరబడుతుంది.

ఈ విషయాలనన్నిటిని గమనించి భూమ్యాకర్షణ క్షేత్రాన్ని దాటిపోగల శక్తిమంతములైన రాకెట్లను నిర్మిస్తున్నారు. అది మొదటి ఘట్టం. అంత వేగంతో ప్రయాణంచేయడానికి తగిన ఇంధనాలు క్రొత్తవి తయారు చేస్తున్నారు. రాకెట్‌యొక్క ముఖ్యప్రయోజనం ఎంతైనాఉంది అంతర్గ్రహాకాశంలో వాయువే మాత్రముందో, ఇతర కిరణాలెటువంటివి ఉన్నాయో, ఉల్కలెంత దట్టంగానున్నాయో మొదలైన విషయాలు రాకెట్‌ద్వారా తెలిసికోగలం. రెండవ లూనిక్ చేయవలసిన అన్వేషణలకి ఒక పథకం తయారుచేసికొన్నారు. అది. భూమిని చంద్రుని ఆవరించిన అయస్కాంత క్షేత్రబలాల కొలతలు, భూమినావరించిన వికిరణమండలా (Radiation belt) ల పరిశోధన, ఆకాశవ్యాప్తమైయున్న కాస్మిక్ కిరణాల తీక్షతలో కలుగు మార్పుల పరిశీలన; కాస్మిక్ కిరణాలలోనున్న భారతరమైన కణాల

(కేంద్రకాలు) పరిశీలన, అంతర్గ్రహాంతరాళంలోనున్న వాయువుల ఉల్కల పరిశీలన

12-9-59 శనివారం మధ్యాహ్నం రెండవ లూనిక్ గంటకు 7000 మైళ్లను మించిన వేగంతో చంద్రునివైపు బయలుదేరింది అది బయలుదేరిన దగ్గరనుండి దానినుండి సాంకేతిక ధ్వనులు ప్రసారమౌతునే ఉన్నాయి ఇరవై నిమిషాలకు చంద్రుని చేరుతుందనే వరకు ధ్వనులు స్పష్టంగా వినిపించేయనీ తరువాత, జోరుగా పరుగెత్తు రైలు హోరువంటి శబ్దం వినిపించిందనీ, అదికూడా, మాస్కో టైమ్ ప్రకారం ఆదివారం రాత్రి 12 గం 2 ని 24 సె లకు ఆగిపోయిందనీ మాస్కో శాస్త్రజ్ఞుడు ఆనెటోలి ముగ్నుషెవ్‌స్కీ గమనించేడు.

చెషైర్‌లోనున్న జోడ్రెల్ బాంక్ రేడియో టెలిస్కోప్ స్టేషన్‌నుండి లూనిక్‌ని పరిశీలించేరు. డైరెక్టర్ ఎ సి బి లొవెల్ అధ్వర్యాన్న సాగిన పరిశీలనలలో, తొలిసారి రాకెట్ సిగ్నల్సుని వారు అందుకొన్నప్పుడు భూమి నుండి 1,00,000 మైళ్ల దూరంలో రాకెట్టున్నట్లు అంచనా తుదివరకు వారు సంకేతధ్వనులను విన్నారట సంకేతాలు ఆగిపోగానే "సంకేతాలు పోయినాయా? పోయినాయా?" అని లొవెల్ అడిగి "ఔ" నని సమాధానం వచ్చినంతనే, అచ్చటనున్న విజ్ఞానులూ విలేఖరులూ వాచీలు చూచికొని, నిర్దేశించిన కాలానికి 90 సెకెండ్లు వెనుక రాకెట్ చంద్రుని చేరిందని నిర్ణయించినట్లు వార్తలు వచ్చేయి రమారమి 2 1/2 లక్షల మైళ్లను 34 గంటలో చేరడానికి నిర్ణయించిన ప్రయాణంలో, వాస్తవానికి 84 సెకెండ్లు మాత్రము వార వచ్చిందంటే, రాకెట్ ప్రయాణానికి సంబంధించిన గణితం ఎంత కచ్చితమైనదో ఊహించవచ్చు.

భూమినుండి ఎటువంటి సూక్ష్మక్రిములు లూనిక్‌తో పోకుండా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసినట్లు రష్యన్ శాస్త్రజ్ఞులు ప్రకటించేరు అదొక ముఖ్యవిశేషం. ఏమంటే, ఇతర గ్రహాలలో జీవముందా, లేదా, ఉంటే, ఎటువంటి జీవ ముండగలదు అను ప్రశ్నలను సాధించడానికి విజ్ఞానులు ప్రయత్నిస్తున్నారు. ఇంతవరకు చంద్రునిలో జీవం కనుపించకపోయినా, చంద్రునిలో జీవంలేదని నిష్కర్షగా చెప్పడాని కవకాశం లేదంటారు విజ్ఞానులు. మనమెరిగి నంతవరకు, భూమిలోనున్న జీవం వంటి జీవం చంద్రునిలో వర్ధిల్లడానికి, అచ్చట వాతావరణ లక్షణాలు అనుకూలంగాలేవని భావిస్తున్నారు అంతమాత్రాన్న చంద్రునిలో జీవం ఉండలేదని కాదు ఒకవేళ చంద్రునిలో జీవముంటే అది అక్కడి వాతావరణానికీ భౌతికావస్థలకూ అనుకూలమైన జీవమైయుండాలి అట్టి సందర్భంలో, ప్రమాదవశాత్తు కొన్నిరకాల సూక్ష్మక్రిములు భూమి నుండి చంద్రుని చేరుకొంటే, అవి నూతన పరిస్థితుల కనుగుణంగా పరిణామమొంది, వృద్ధిచెంది, అచ్చటి జీవాన్ని నాశనం చేయవచ్చును అట్లు సంభవించినాడు, జీవరహస్యం కనుగొనడానికి విజ్ఞానులుచేస్తూన్న ప్రయత్నాలు విఫలమౌతాయి, అంతేకాదు, విజ్ఞానిని పెడదారి త్రొక్కిస్తాయి కేవలం అనుకూలమైన భౌతికావస్థలే జీవోద్భవానికి కారణమా, కాదా, అన్న విషయనిర్ణయం కష్టతరమౌతుంది అందుచేత, ఎట్టి సూక్ష్మజీవులను భూమినుండి లూనిక్‌తో పోనీయకుండా రష్యన్ శాస్త్రజ్ఞులు తీసికొన్న ప్రత్యేకశ్రద్ధ ప్రశంసార్హమే

రెండవ లూనిక్‌ని పంపినప్పుడు దానిని పెడదారి త్రొక్కనీయకుండా నిర్ణీతమార్గాన్న నడిపించడానికై కంట్రోల్ సిస్టమొకటి భూమిమీద నెలకొల్పేరు దాని గమనంలో చంద్రుని నుండి దూరాన్ని కొలిచే యంత్రమొకటి రాకెట్లో అమర్చేరు. మొదటి లూనిక్‌లో నుండిన యంత్రాలకంటె మిక్కిలి సున్నితమైనవి, సునిశితమైనవి రెండవ లూనిక్‌లో నుంచేరు చంద్రుని అయస్కాంతక్షేత్రాన్ని కొలవడానికై సునిశితమైన పరికరాలు నెల

కొల్పేరు. చంద్రుని తాకినప్పుడు రాకెట్ వేగం అట్టేలేదు కాని, చంద్రునికి వాతావరణం లేక పోవడంచేత గాలిగుమ్మటాల (Parachutes) సహాయంతో మెల్లిగా దానిని దింపేఅవకాశంలేక పోయింది. దానివేగం తగ్గించాలంటే రెట్రొ రాకెట్లను ఉపయోగించాలి దానికి ప్రత్యేకంగా ఇంధనాన్ని వినియోగిస్తే రాకెట్ బరువు ఎక్కువౌతుంది అందుచేత, చంద్రాకర్షణ బలాన్ని ప్రతిఘటిస్తూ మెల్లగా చంద్రతలంపై దిగడానికి రెండవ లూనిక్‌తో ఏర్పాటు చేయ లేదు అది చంద్రతలాన్ని ఢీకొని తునియలై పోతుందని ముందే శాస్త్రజ్ఞులకు తెలుసును

చంద్రుని ఢీకొని భిన్నమయే లోపుగా రాకెట్లోనున్న స్వయంచోదిత యంత్రాలూ, పరి కరాలూ రికార్డుచేసిన సాంకేతిక విషయాలను రష్యన్ శాస్త్రజ్ఞులు ప్రకటించేరు. వాటిలో ముఖ్యమైనదేమంటే చంద్రుని చుట్టు అయ స్కాంతక్షేత్రమున్నట్లు రుజువు కాకపోవడం చంద్రతలాన్ని తాకినప్పుడు రాకెట్ యొక్క వేగం సెకెనుకి 2 05 మైళ్ళు,చంద్రతలాన్ని 60 డిగ్రీల కోణంలోఢీకొంది ఢీకొన్నస్థానం మనకి కనిపిస్తూన్న చంద్రమండల కేంద్రానికి497మైళ్ల దూరం. రాకెట్ గమిస్తూండగా, దానిమార్గం లో కాస్మిక్ కిరణాలతీక్ష్ణతలో మార్పూ, కాస్మిక్ కిరణపాతంలో భాగాలైన హీలియం, కార్బన్, నత్రజని, ఆమ్లజని మొదలగు బరు వైన కేంద్రకాల పరిమాణంలో మార్పూ కూడ స్వయంచోదిత యంత్రాలు రికార్డుచేసి నట్లు ప్రకటించేరు X- కిరణాల గురించి, గామాకిరణాలగురించి, అతి శక్తిమంతమైన ఎలక్ట్రానుల గురించి, శక్తిహీనములైన ఎల క్ట్రానుల గురించి, అతిశక్తిమంతమైన యితర కణాల గురించి అవసంగా భోగట్టాలభ్యమై నట్లు ప్రకటించేరు భూమినావరించి వికిరణ మండలాలు (Radiation belts) ఉన్నాయి వాటిలో కొన్ని కొలతలు రికార్డుచేసినట్లు తెలిసింది

గ్రహాంతరాళంలో నున్న ద్రవ్యం చాలా విరళంగా నుంటుందని విజ్ఞానుల భావన రమా రమి, అది శూన్యాకాశమే కావచ్చు చంద్రునికి భూమికి మధ్యనున్న ప్రదేశంలో. కొన్నిచోట్ల అయనుకణాల సంఖ్య ప్రతిఘనపు సెంటిమీట రుకి 100 కంటె తక్కువగా నున్నట్లు లూనిక్ వల్ల తెలియవచ్చిందని ప్రకటించేరు. అంత రాళం గమిస్తూ చంద్రునికి 6000 మైళ్ల దగ్గరకు వెళ్ళేసరికి ఈ అయనుకణాల సంఖ్య పెరగ జొచ్చింది చంద్రుని ఆవరించి విద్యుదావేశ పూరితమైన వాయువులున్నాయనడానికి ఇదొక నిదర్శనం కావచ్చును ఇతర వివరాలు కాల క్రమేణ ప్రకటిస్తారు

రాకెట్ కార్యక్రమాలను అహమహమికతో అమెరికా రష్యాలు సాగిస్తున్నాయి. వాటికి కావలసిన సాంకేతిక శాస్త్రబలం, అర్థసంపత్తి గల దేశాలు ఈ రెండు మాత్రమే భూమి చుట్టూ తిరిగే ఉపగ్రహాన్ని పంపాలంటే సెకె నుకి అథమం 5 మైళ్లవేగం అవసరమనీ, భూమ్యాకర్షణాన్ని దాటిపోయి సూర్యునిచుట్టూ తిరిగే గ్రహంగా పరిణమించాలంటే సెకెనుకి 7 మైళ్ల వేగం అవసరమనీ గణితంవల్ల తెలియ వచ్చింది. వాటి సత్యాన్ని నికరంగా నిరూపించు కొన్నారు శాస్త్రజ్ఞులు.

2-1-59 ని రష్యా మొదటి లూనిక్‌ని ప్రయోగించింది. అది భూమ్యాకర్షణాన్ని దాటి పోయి చంద్రునికి దూరంగా పోవడంచే చంద్రుని తాకలేక, సూర్యునికి నిత్యప్రదక్షి ణాలు చేస్తూ కక్ష్యలో అమరుకొంది 15 నెలల కొకసారి ప్రదక్షిణంచేస్తూన్న మొదటి లూనిక్ యొక్క దూరం సూర్యునికి 91 మిలియన్ నుండి 121 1/2 మిలియన్ మైళ్లవరకు మారు తూంటుంది. అదొక మానవ కల్పితగ్రహమై సౌరమండలంలో ఒకస్థానాన్ని ఆక్రమించింది. దానికై 5 రోజులు ప్రయాణం చేసింది. దాని బరువు 3245 పౌన్లు. చంద్రుని రాసికొనిపోయే టప్పుడు చంద్రునికది 4660 మైళ్ల దూరంలో నుండబట్టి చంద్రాకర్షణ బలాన్నికూడా త్రెంపు కొంది.

అమెరికా చేసిన ప్రయోగాలలో నాలుగు విఫలమైనతరువాత ఐదవది గ్రహాంతరాళంలో

ప్రవేశించింది 17-8-58 ని ప్రయోగించిన రాకెట్ 77 సెకెనులు ప్రయాణంచేసిన తరువాత పేలిపోయింది దానికి కారణం సాంకేతికపు పొరపాటన్నారు. రెండవ రాకెట్ అయిన 'మొదటి పయనీయర్'ని 11-10-58ని ప్రయోగించేరు. అది 71300 మైళ్ల ప్రయాణంచేసి, మండిపోయి క్రిందపడిపోయింది. భూమ్యాకర్షణ బలాన్ని దాటలేకపోడానికి కారణం దాని మార్గంలో కలిగిన 3 1/2 డిగ్రీల వ్యత్యాసమన్నారు 8-11-58ని ప్రయోగించిన 'రెండవ పయనీయర్' 1000 మైళ్ళ పైకిపోయి, దాని మూడవ అంచ రాకెట్ పనిచేయక పోవుటచేత, విఫలమైంది 6-12-58ని ప్రయోగించిన 'మూడవ పయనీయర్' 66,654 మైళ్లు ప్రయాణం చేసిన తరువాత, వెనుతిరిగి, వాతావరణంలో భస్మమైపోయింది. సైనికశాఖచే 3-3-59ని ప్రయోగింపబడిన 'నాల్గవ పయనీయర్' చంద్రునిదాటి సౌరగ్రహమై సూర్యుని చుట్టు తిరుగుతూంది. దాని బరువు 13 పౌన్లు.

ఇప్పటికి రెండు కృత్రిమగ్రహాలను మానవుడు కల్పించేడు. అవి మొదటి లూనిక్, నాల్గవ పయనీయర్ అవి సూర్యప్రదక్షిణాలు చేస్తున్నాయని సహేతుకంగా విజ్ఞానలోకం భావిస్తూంది.

★

శ్రీమదాంధ్ర వేదాంత పంచదశి

[ద్వైత వివేక ప్రకరణము]

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

౪

కార్య కారణోపాధులఁ గ్రాలు జీవు
చేత నీశ్వరుచేత సృజింపఁబడిన
జగము విభజింపఁబడు విమర్శనము సేయ
ద్వైత మా జీవుచే విడువంగఁదగును.

మాయ కారణముగ నెగ్గు, మాయ యే యు
పాధి యైనట్టి వాని నీశ్వరుగఁదెలియు
మీ జగము, మాయి ఈశ్వరుఁడే సృజించె
నంచు శ్వేతాశ్వతరులు వచించుచుండ్రు.

అఖిల జగము సృష్టికిఁబూర్వ మాత్మగానె
యుండెననియు నయ్యాత్మ బ్రహ్మాండములను
సృష్టిఁజేయ సంకల్పించి సృష్టిఁ జేసె
నంచు బహ్వృచులను వారలనుచు నుండ్రు.

అట్టి ప్రత్యగ భిన్న బ్రహ్మంబునుండి
ఆకసంబును వాయువు నగ్ని జలము
భూమియును నోషధులు నన్నమును శరీర
ములును నీ యఖిలము క్రమమ్ముగను బుట్టె.

ఏను బహురూపములుగ నయ్యెదనటంచు
కార్య మయ్యెదనంచు సంకల్ప మూని
తపము చేసి యాత్మయె సమస్తము సృజించె
నంచుఁ దిత్తిరముని వచియించె మున్ను.

సకల జగము సృష్టికి ముందు సత్స్వరూప
ముగను నుండియు బహురూపములును గాగ
దలచి బ్రహ్మ మన్నమును నుదకము జీవ
జాతము సృజించెనందురు సామగులును.

వీతి హోత్రుని నుండియు విస్ఫులింగ
జాత మెటు పుట్టు నట్టులె సత్పదార్థ
మందు నుండియు నీ జగమంత పుట్టె
నంచు ముండకశ్రుతి వచియించుచుండె.

ఆదియందు జగంబు బ్రహ్మముగ నుండె
అట్టి బ్రహ్మమె నామ రూపాత్మకముగ
మార్పు నొందెను, నట్టి నామములు రూప
ములు విరాట్టునందున సృష్టము లగుచుండు.

ఆ విరాణ్మనువులు నరులావు లటుల
ఖరము లశ్వములు పిపీలికములు మేక
లాది ఖగములు పుట్టె బ్రహ్మమ్ము వలన
ననుచు వాజసనేయులు ననుచునుండ్రి.

బ్రహ్మ మే వికారమగు జీవత్వ మొంది
తనువులం జొచ్చెనని శ్రుతులును వచించు
ప్రాణమాదియౌ వాని ధారణముచేత
బ్రహ్మమునకు జీవత్వ మేర్పడుచునుండె.

లింగదేహము, మఱియు నా లింగ దేహ
మునకు నాధార చైతన్యమును దదీయ
లింగ దేహంబునఁ బ్రతిఫలించు నట్టి
యచ్చిదా భాసుఁడును జీవుఁడనఁగఁ బరగు.

ఈశ్వరున కొక శక్తిగా నెసక మెసఁగు
నిదియె మాయ, లోకంబుల నెల్ల సృష్టిఁ
జేయు, నెల్లర మోహింపఁ జేయునట్టి
శక్తియే జీవులను భ్రాంతిఁ జెందఁ జేయు.

జీవుఁ డీశు మాయవశతఁ జెంది, దేహ
మందు మగ్నుఁడై దుఃఖముఁ బొందుచుండు
ఇట్టు లీశ్వరుచే సృజియింపఁబడిన
ఈ జగము క్లుప్తముగ వచియింపఁబడియె.

అల్ల సప్తాన్న బ్రాహ్మణమందు జీవ
సృష్టి వివరంబు నంతయుఁ జెప్పఁబడియె,
జీవుఁడే జ్ఞానకర్మలచేత సప్త
విధములైన యన్నములఁ గల్పించుచుండు.

అమ్మనుజు నన్న మొకఁడు దేవాన్నములును
రెండు, పశువులయన్న మొక్కండు, తక్క-
మూఁడశనముల నాత్మార్థముగ సృజించె
నిట్లు సప్తాన్న విభజన మెసఁగుచుండు.

వడ్లు మర్త్యాన్నమగు, నమావాస్య పూర్ణి
మలును దేవాన్నములు, క్షీరములు పశువుల
యన్నమగు.ప్రాణములు నింద్రియములు మనము
ఆత్మ కన్నములగును - సప్తాన్నము లివి.

వాస్తవంబున కివియు నీశ్వరునిచేత
సృష్టి సేయంగఁ బడినను జీవుఁడు తన
జ్ఞాన కర్మముల వలన వానిఁ దనదు
భోగ సాధనాలుగ నుపయోగ పఱచు.

వనిత తండ్రివలనఁ బుట్టి భర్తచేత
ననుభవింపఁగఁ బడుచుండునట్లు గానె
అన్న సప్తక మీశుచే నావహిల్లి
జీవుచే ననుభవమును జెందుచుండు.

ఈశ్వరునియొక్క సంకల్ప మీ జగము సృ
జనము నొనరించుట కొఱకై సాధనమగు
జీవసంకల్పము జగముం జెంది దాని
ననుభవింపఁగ సాధన మగుచునుండు.

ఈశ నిర్మిత మణ్యాదులెల్ల నొక్క
విధముగా నుండ వానిని వివిధగతుల
ననుభవించు నతని బుద్ధి ననుసరించి
పలు విధంబుల ననుభవింపంగఁ బడెడు.

ఒకఁడు మణి దొరుక ముదము నొందుచుండు
ఒకఁడు మణి దొరుకమిఁ గ్రోధ మొందుచుండు
మణి యనిన విరక్తియును గల్గిన యతండు
దానిఁ గనుగొని ఖేదమోదములఁ గొనఁడు.

ఈశ్వరునిచేత మును సృజియింపఁబడిన
తన్మణి స్వరూప మొక విధముగ నున్న
ప్రీతియును భీతిలేమి నుపేక్ష యనఁగ
నందు రూపత్రయము జీవులొందఁ జేయు.

వనిత యొకతె కోడలుగాక భార్యగాగ
ఆడుబిడ్డగా తల్లిగా నత్తగాగ
పలువిధంబులుగాఁ దోపఁ బడుచునున్న
స్త్రీ స్వరూపాన భేదముం జెందదేమి

[అట్లె జీవునిబుద్ధిని ననుసరించి
పలువిధముల ద్వైతము దోపఁబడుచునున్న
నున్న దద్వితీయంబయి యొకఁడె యుండ
భ్రాంతిచేఁ బలుగతులఁ దోపఁబడుచుండు.]

వనిత పలువిధంబులఁ బిల్వఁ బడెడుఁగాక,
యా కృతిని భేదమేమి యావంత లేదు;
స్త్రీ శరీరము గూర్చియు జీవ నిర్మి
తమగు క్రొత్తరూపమ్ము దృష్టమును గాదె?

అట్లనఁగ రాదు స్త్రీ రూపమందు మాంస
మయపు రూప మొకటి, మనోమయపు రూప
మొకటి యుండు, మాంసమయము నొందకుండు
భేద, మా మనోమయమును భేదమొందు.

[ఎప్పుడును వస్తువున భేదమేహో లేక
ఆ యభిప్రాయ భేదము నావహిల్ల,
దందుచే స్త్రీ స్వరూపము నందు భేద
మెదియొ యుండు నదియె జీవ సృష్టమగును]

భ్రాంతిఁ జెందినయపుడు స్వప్నమున యందు
అమ్మనోమయమన నిజంబగును గాక
అట్లు జాగ్ర దవస్థఁ బ్రత్యక్షము లగు
వానిని మనోమయములని పల్కుటెట్లు?

ఎదుటఁ జూచు వస్తువుల యాకృతులు మనసు
నందు నేర్పడుచుండుటయు ననుభవమెగ,
అదె మనోమయ రూప మటంచు మున్ను
భాష్యవార్త్తిక కారులు పలికినారు.

మూసలోఁ గరగించియుఁ బోయఁబడిన
తామ్రము మామూస యాకృతిఁ దాల్చునట్లు
ఘటము మొదలగు వానిని గాంచినపుడు
చిత్త మా స్వరూపంబును జెందుచుండు.

వస్తువుల నన్నిటిని గనుపఱచు వెలుతు
రా పదార్థాకృతి వహించునట్లు గానె
అఖిల విషయంబుల నెఱుంగునట్టి వేళ
బుద్ధియును దదాకారముం బొందుచుండు.

జీవుఁడే ప్రమాతయగుఁ దజ్జీవుఁగూడు
నా మనో వృత్తియె ప్రమాణమనఁగఁ బరగు.
ఆ మనోవృత్తి జీవుతో నన్వితమయి
ఆ ఘటపు విషయాకార మావహించు

ఘటము మృద్వికారంబును గా, మనో మ
యంబుగా, ద్వివిధంబుగా నగును; మృద్వి
కార ఘటము మనోవృత్తిఁ గాంచుచుండు
ధీ మయ ఘటంబు సాక్షిచేఁ దెలియఁబడెడు.

అన్వయ వ్యతిరేకము లనెడు వాని
చేత ధీమయ ద్వైతము జీవునకును
కష్టములను సుఖములను గలుగఁజేయు
నమ్మనోమయ ద్వైత మున్నంత వఱకు
కలుగునవియు లేకున్నచోఁ గలుగ వవియు,

స్వప్నమున బాహ్య విషయా లసత్యము లయి
యుండినను సుఖదుఃఖములొందు నరుఁడు.
ఆ సమాధి మూర్ఛా నిద్రలందు వ్యాఘ్రము
ముండిన నరుఁడు దుఃఖాదు లొందకుండు.

దూరదేశము నందుఁ బుత్రుండు నుండ
పంచకుఁ డెవఁడొ సుతుఁడు గతించె ననఁగ
తండ్రి దుఃఖముఁ జెందుచు నుండుఁ గాదె?
తనయుఁడున్న, మనోమయుండును నశింప

తనయుఁడే మృతిఁజెందినఁ దద్విషయము
నెఱుఁగ నంతవఱకుఁ దండ్రి యేడ్వఁబోఁడు,
అందుచేతనే జీవుల కందఱకును
తన్మనో ద్వైత మిట్లు బంధకృత మగును.

మనము నందొక యాకార మొనరఁజేయ
బాహ్య వస్తు వొకండుండ వలయుఁగాదె?
అట్టి బాహ్య పదార్థము ననవసరము
ననెడు విజ్ఞాన వాదముం గొనము మేము.

సాహిత్యము - రాచకార్యములు

శ్రీ "కౌటిల్యుడు"

ఈనాడు సాహిత్యవేత్తల మనుకొనే వారిలో కొందరు రాచకార్యములను పరిశీలించినంతమాత్రముచేతనే భయభ్రాంతులై పోవుచున్నారు. ఇందుకు కారణము లేక పోలేదు. అది యిది. స్వధర్మము విడిచి పరధర్మం ప్రాపునచేరి బ్రతుకే పరమార్థముగా యెంచుటవల్ల యీ స్థితి యేర్పడినది. ఈ స్థితిని తప్పించుట ఒక్కటే స్వధర్మనిర్వాహణకు ప్రాతిపదిక అవుతుందని చెప్పవచ్చును.

స్వరాజ్యము వచ్చినది. స్వతంత్ర బాధ్యత హెచ్చినది స్వభాషాభిమానము, స్వధర్మాభిమానము, స్వతంత్రాలోచనా భావము మరుగున పడియున్నవి. కలకాలము బానిస బ్రతుకు బ్రతుకుటవల్ల యివేవీ మనకు పట్టుబడకయున్నవి మనలో యేవి కొరవడినందువలన యివి పొందలేకపోతున్నామో యిప్పటికీ దురూహ్యాంగానేఉన్నది. మనలో మనము తర్కించుకొని ఒక్కొక్కటి అర్థం చేసుకొని మన జీవితవిధానము జాతీయమై స్వధర్మాభిమానముకలిగి కలకాలము వర్థిల్లే ప్రాతిపదిక యేర్పడితేనేకాని మన సమస్యలన్నీ పరిష్కరించబడవు.

వాల్మీకి రాముని కథను భావించెను ఒక రసవత్తరమైన కావ్యముగా దానిని వ్రాసెను

వ్యాసుడు భారత, భాగవత కథలను భావించెను. ఈ రెండింటిని రమణీయముగా చిత్రించెను.

ఈ కథలలలోని నాయకులు, ప్రతినాయకులు పరస్పరము కలహించుకొని, భావోన్మత్తతతో ప్రతిద్వంద్వులై, పురాణ పురుషులుగా ప్రసిద్ధిగాంచిరి. ఇప్పటికీ మనము వాటిని చదివి ఆనందించుచునే యుంటిమి ఆయా కావ్యరీతులలోని భావముల పొందికనుగురించి, తరచి, రసాస్వాదన చేయుచునే యుంటిమి. ఆయా కావ్యకల్పనా చమత్కృతులలోని ప్రతిభా వ్యుత్పత్తులను కళాకౌశలములను పరామర్శించుచునే యుంటిమి ఇవి యన్నియు చేయుచున్న మనమే యీనాడు రాచకార్యములన్నంతనే భయభ్రాంతులమై గడగడ వణకిపోవుచున్నాము. ఇది మనలోని పరధర్మప్రభావ వికాసమేవని చెప్పకనే చెప్పుచున్నది

రాముడు ఉత్తమపురుషుడు. మరి రావణాసురుడో!

ధర్మరాజు ఉత్తమపురుషుడు.మరి ధుర్యోధనుడో!

శ్రీకృష్ణుడు ఉత్తమపురుషుడు మరి కంసుడో!

ఈ యీ విషయాలపై మనలో శంకలు కలుగని రీతిని కావ్యకల్పన చేయటంలోనే భావౌన్నత్యము ద్యోతక మగుచున్నది. ఈ యీ కావ్యములలోని వేరువేరు పురుషార్థములు వివిధ విధములుగా మన మనోవికాసమునకు, మన చిత్తసంస్కారమునకు దోహదము చేయుచున్నవని అంగీకరించుచునే యుంటిమి

మనకు వాస్తుశాస్త్రము ఉన్నది. అర్థికశాస్త్రము ఉన్నది. రాజకీయ శాస్త్రము ఉన్నది. వృక్షశాస్త్రము ఉన్నది. భూతత్వశాస్త్రము ఉన్నది. పదార్థశాస్త్రముఉన్నది. రసాయనికశాస్త్రము ఉన్నది. ఖనిజశాస్త్రము ఉన్నది యోగశాస్త్రముఉన్నది జ్యోతిషశాస్త్రము ఉన్నది. ఖగోళశాస్త్రముఉన్నది. సాముద్రికశాస్త్రము ఉన్నది కామశాస్త్రముఉన్నదె తర్కశాస్త్రము ఉన్నది. తత్వశాస్త్రము ఉన్నది వేదాంత శాస్త్రము ఉన్నది. చిత్ర, శిల్ప సాహిత్యకళాశాస్త్రములున్నవి. వైద్య, శస్త్ర, చికిత్సా శాస్త్రములున్నవి. యుద్ధతంత్ర శాస్త్రము ఉన్నది. మంత్రతంత్ర శాస్త్రములున్నవి. ఒకటేమిటి

ఒకనాడు అన్ని విద్యలు మనకు అఖండముగా విలసిల్లియే యున్నవి. అన్నీ ఉన్నవని తెలిసిన సాహిత్యవేత్తల మనుకొనేవారు స్వవిద్యాభిమానులు కాకనే కాకమ్మ కబుర్లు చెప్పుచున్నారు ఈ చెప్పుటయే మన సాహిత్య సమాలోచనలోని యీ అవ్యవస్థకు కారణమగుచున్నది ఇది యీనాటిదికాదు. ఇది యిప్పటికిప్పుడే పరిష్కరించబడదు ఎప్పటివరకు పరిష్కరించబడదో అప్పటివరకు మనకు యిది తప్పదు.

వాల్మీకి యే ప్రభువులకు వంతపలుకలేదు వ్యాసుడు యే రాజ్యాధికారమునకు లొంగలేదు. వీరిద్దరూ స్వతంత్రభావుకులే. ఈ వీరిద్దరినీ అనుకరించిన వారితోనే యీ గొడవంతా వచ్చినది

కాళిదాసుతో ప్రారంభమైన రాజ్యాధికారుల పొగడ్తలు నేటికి ప్రబలమై ప్రాభవ ప్రాబల్యాలు సమకూర్చుకొని స్థిరపడి యున్నవి

పరరాజ్య ప్రాభవములో పడిన మన కళాప్రపూర్ణులు పరప్రాభవాన్ని గురించి బహుళ ప్రచారంచేసి, స్వధర్మచింతను కించపరచిన చరిత్ర మనకు అందరకు అనుభవైకవేద్యముగా నున్నది

ముసల్‌మాన్, పోర్చుగీసు, ఫ్రెంచి, డచ్చి, ఇంగ్లీషు మొదలైన దేశములవారు మనను పాలించిరి. మనను పాలించినవారందరినీ ప్రశంసించే బ్రతుకే భాగ్యమని యెంచే సాహిత్యవేత్తల మనుకొనేవారు రాచకార్యములపై స్వతంత్రాభిప్రాయములు ప్రకటించుట దోషమని చెప్పుటలో ఆశ్చర్యపడవలసిన అవసరములేదు.

పూర్వము రాజాశ్రయంలో బట్టుమూర్తులుండేవారు. ఈనాడు ఉత్తమసాహిత్యవేత్తల మనుకొనేవారు బట్టుమూర్తులగుచున్నారు

ఈనాడు ప్రజలే ప్రభువులు. ఈ ప్రభువులను ప్రశంసించనిచో బ్రతుకే భారమగుచున్నదని భావించేవారు ఉత్తమ సాహిత్యవేత్తలమనుకొనేవారిలో కూడ ఉన్నారు. ఇది యీనాడు మనకున్న దుర్దశ మాత్రమేనని నమ్మేవారున్నారు. ఈ వీరిద్దరికి మధ్య అంతరము ఉన్నది ఈఅంతరాన్ని తొలగించాలని గోఖలే, తిలక్, గాంధీ, అరవిందో మొదలైనవారు ప్రయత్నించినారు. ఈప్రయత్నము కొంతవరకు సఫలమైనది. కొంత మన ప్రజలలో మానసిక వికాసము కల్గినది. కొంతకుకొంత స్వతంత్రబుద్ధి వికసించినది. ఈ స్వతంత్రబుద్ధి వికాసానికి ప్రతిబింబముగా రవీంద్రుడు వెలుగొందినాడు ఈయన మన సాహిత్యవేత్తలలో కడుసమర్థుడని ప్రతీతి గాంచినాడు. ఈ ప్రసిద్ధిపొందిన రవీంద్రుడు కూడ రాచకార్యములపైన స్వతంత్రాభిప్రాయములు ప్రకటించినాడు విశ్వజనీనమైన భావమే కళకు ప్రాతిపదిక కావాలని ప్రవచించినాడు. విశ్వజనీనమైన మానవత్వభావమే కళాసంస్కృతుల మేలికలయికయని వాల్మీకి, వ్యాసమహర్షులు కావ్యకల్పన చేసారు. అప్పటికీ యిప్పటికీ ఉత్తమోత్తమమైన కావ్యకల్పనా చమత్కృతిని వికసింపచేసినవారు క్రమపరిణామము గల భావప్రకటననే పరమార్థముగా యెంచి రచన చేసినారు.

ఏనాడు రచనా స్వాతంత్ర్యము, భావస్వాతంత్ర్యము, భావప్రకటనా స్వాతంత్ర్యము క్రమబద్ధమై జీవిత వికాసమునకు దోహదము చేసి, కళాఖండమై ప్రకాశించునో ఆనాడే సాహిత్యము సాహిత్య మనిపించుకొనును.

భామినీవిలాసము

ఆంధ్రీకర్తలు

* శతావధానులు. శ్రీ శ్రీనివాస సోదరులు *

౧

పల సుగుణాళికై ప్రయత్నింతు వకట!
ప్రతిభకోసము? వలదు, నా హితవు వినుము;
అందిన మనోజ్ఞభావము లన్ని మెక్కి
బలియుచున్నది కలి నేడు ప్రతిదినంబు.

పత్ర పుష్ప ఫలాదుల బరువు మోయు,
ఎండ కెండును, చలిబాధ నెల్ల సైచు,
పరులకయి యాత్మ దేహంబు బలి యొసంగు,
దాతృమణి తరువునకు వందన మొనర్తు.

పరగుహ్య గుప్తి నిపుణము,
వరగుణ, మఖిలజన కామ్యవర మగు లలితాం
బరమును నాఖువువలె ఖలు
డురుసజ్జను ఖండితునిగ నొనరించుగదా!

వేడి వెంటాడి వేధించి వేపుకతిను
వారిచే రాజుకొని దిశావలయ మంటు
ప్రఖర చింతాగ్ని దీర్ఘజిహ్వా శతంబు
వెదల సోకక యలరు నీ వృత్తసమితి.

సురల గింగిరాలు తిరిగించి గరువించి
హరుని జెనక మదను డతని తనువు
అమరబాలికాళి సుమమాలికారామ
మభవు కంటిమంట కగ్గమయ్యె.

అడవి నాడుకొనుచు జడిసి కుందేటిపిల్ల
కట్టె భర్తభుజము బట్టు సీత
పంక్తివదనుచేత బడి పాలపండ్ల ర
క్కసులనడుమ జిక్కి కటకటపడు.

గురువుల పరుషాక్షర సం
భరిత తిరస్కృతుల గనక మహిమ గలుగునే?
పొరయక శాణోత్కషణ
హ్వారణంబు కిరీటయోగ్య మగునే మణియున్?

ఉరు వినయవృత్తి తేనియ లొలుక బలికి
మంచివారల జేరి వంచించువారి
గూడ మోచెద విటు నీకుగూడను మతి
పోయెనా యేమి? మాతల్లి, భూమిదేవి!

ఏ నొక్కండనె యేమరించి కరుణాహీనుండనై ప్రాణులం
బ్రాణాపేతములం బొనర్తు నని వ్యాధా! కుందనే లాత్మలో?
జ్మానాథావసథాళి దీర్ఘవితతిన్ సాధుద్రుమోత్పాదనన్
పీనుల్ గూఢతరాశయుల్ గలుగరే నీ యన్నలుం దమ్ములున్?

వారిధియందు జన్మము, నివాసము నందనమందు, సర్వబృం
దారక చిత్తహారి వితతంబు సువాసన, దాతృనేతృ మం
దార గుణాళి ముజ్జగమునన్ వినుతిం గను సాటిలేనిదై
కోరిక ప్రాతముం దెలిసి కూర్చు వివేక మొకండు గల్గినన్.

జ్ఞానినోటినుండి రానెరా దొకమాట
మఱియు వచ్చెనేని తిరుగు లేదు:
భువిని ద్విరదమునకు పొడుచుకవచ్చునే
కాని వెనుకజనదుగాదె రదము?

అమలినవారియం దుదయమంది, లతాంగుల నెమ్మొగంబులం
దమును తృణీకరించి, సిరినాథు కరమ్ము పరామృశింపగా,
నమరుల సోల్చి వాసనల, నాచి కవి స్మర చిత్తవృత్తులన్
కమలిని! పేరుగాంచి, తగునా మధుప ప్రణయంబు గోరుటల్?

వేతండ గండతల కం
డూతి స్ఫుట పాండితీ పటుత్వామర్ద
స్ఫీత యశము హరి హరిణ
వ్రాతముముం దేమీ చూపు స్వపరాక్రమమున్?

ఓ మృగంబులార! ఏమి చాపల్యంబు?
క్షుభిత నదిని మునుగ జొఱకు, డిటనె
క్రుంగిపోయె సుడిసి కొండంత యేనుగు
గుండమందు ప్రాణగండమందు.

ఎవరి పనుల వార వేమఱియుండ నే
ముక్కుతోడ తలుపు జెక్కి పోదు
ననుచు పంజరశుక మాశాసుధల దేల
కరికరాభ జిహ్మాగంబు దూరె.

ఇంద్రదంపతుల మహిష్ఠ పుణ్యఫలంబు,
నాకశోభ, కల్పకాద్భుతంబు
నందనం; బయిన దినందిన మర్థింతు
మజుని ఖాండవారి నపనయింప

వన మది కొంత యేనుగులు భగ్నమొనర్చెను, కొంత శీతబా
ధను చలిమంటకై సమసె, తక్కినభాగము గ్రీష్మ మేర్చె, నీ
కొన నిటు దక్కి దిక్కుల నకుంఠ పరిమళపాళి నించుచుం
దనరెడు నీ లవంగలత దావశిఖావృత మయ్యె నక్కటా!

ఏయది క్రీడసల్పి చలియించు దరంగము లుద్ధురంబులై
మాయురె! మంథర భ్రమణమా! యనిపించెడి దిగ్గజాళికిన్
ఆయత తత్తిమింగిలగిలాహ్వృతి ఖేలన రాఘవమ్ము తా
దోయధి గేళికోపమున దో విడ, నింకెట నాడగల్గెడిన్?

తరు సమారోపణ వివేకపరుడె యయ్యు
మాలి వకుళము నెచటనో మూల నాటె;
అది యచటినుండియె జగత్త్రయంబు నిండ
పరిమళము పంచు నంచు నెవ్వరికి నెఱుక?

గిరిగహ్వరముల నీగతి
గురు గర్వము మెఱయ దిరుగకు గజేంద్రసుతా!
ఎఱిగిన బాల్ద్రావెడు నా
హరిశిశువు, కరేణుశేష మగు జగ మెల్లన్.

శ్రీ భరతముని ప్రణీత

నాట్యశాస్త్రమ్

ఆంధ్రభారతి

డాక్టర్, శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం. ఏ., ఎం. లిట్, పిహెచ్. డి

చతుర్థోఽధ్యాయః—తాండవలక్షణమ్

82. దండపాదము

నూపురం చరణం కృత్వా దండపాదం ప్రసారయేత్
క్షిప్రావిద్ధకరం చైవ దండపాదం తదాచ్యతే. ౧౪౧

కుడిపాదమును అంచితముగాజేసి, మడమను పిరుదకు తాకునట్లుగా తీసికొనిపోయి, కుడిప్రక్క అంచిత జంఘాభాగము క్రింద బడునట్లు వేసినచో నూపురపాదికాచారీ రాగలదు

ఈ నూపురచరణమును గావించి దండపాదాచారీని ప్రయోగించవలెను నూపురపాదికలోని కుంచితపాదమును రెండవకాలి మడమవద్దకు తీసికొనిపోయి, స్వదేహక్షేత్రమున కభిముఖమగునట్లు ముందుకు ప్రసారించగా దండపాదాచారీ రాగలదు ఊరు, జాను, జంఘలు స్తబ్ధములై, దండాకారమున నుండగలవు పాదమును దండమువలె ప్రసరించునపుడు, హస్తమును గూడ చాచవలెను. ఇట్లు ఉద్భవించు దండపాదకరణమును ఆటోపముతో గూడిన పరిక్రమాది విషయమున ప్రయోగించవలెను

83. హరిణప్లుతము

అతిక్రాంతక్రమం కృత్వా సముత్ప్లుత్య నిపాతయేత్
జంఘాంచితోపరిక్షిప్తా తద్విద్యా ద్ధరిణప్లుతమ్ ౧౪౨

అతిక్రాంతచారీలోని కుంచితపాదమును ఎత్తి ఎగిరి పాదమును వేయవలెను తర్వాత జంఘాంచితమగు ఎడమపాదమును వెనుకకు వేయగా లేడి ఎగురుచున్నట్లు కన్పించగలదు. ఇట్లు హరిణప్లుతమను చారీతోకూడిన హరిణప్లుతకరణమును విదూష కాదిగమనమున ప్రయోగించవలెను

84. ప్రేంఖోలితకము

దోలాపాదక్రమం కృత్వా సముత్ప్లుత్య నిపాతయేత్
పరివృత్తత్రికం చైవ తత్ ప్రేంఖోలిత ముచ్యతే ౧౪౩

కుంచితమైన కుడిపాదమును ఎత్తి ఒకప్రక్కనుండి మరియొక ప్రక్కకు ఊపుచు, అంచితాకృతితో మడమను ముందుకు వేసిన దోలాపాదాచారీ రాగలదు దీనిని ప్రయోగించి, ఎడమపాదముతో ఎగిరి పాదమును వేయవలెను తర్వాత భ్రమరికాచారీని ప్రయోగించి త్రికోణాకారమైన ఊరువును పరివర్తితము గావింప ప్రేంఖోలితమను కరణము వచ్చును.

85. ని త ం బ ము

భుజా వూర్ధ్వ వినిష్క్రాంతౌ హస్తౌ చా భిముఖాంగుళీ
బద్ధాచారీ తథాచైవ నితంబే కరణే భవేత్. ౧౪౪

ఊర్ధ్వాంగుళములుగా పతాకహస్తములను వ్యావర్తితకరణమున శిరోదేశమునకు తీసికొనిపోయి, పరివర్తితకరణముతో ఊర్ధ్వక్షేత్రమున బాహువులను బయటకు పంపవలెను. అప్పుడు భుజములవద్దకు పతాకహస్తములను దెచ్చి, ఒకదానికొకటి ఎదురుగా నుండునట్లు చేయవలెను తర్వాత నీ హస్తములవ్రేళ్లను దేహమున కభిముఖముగా నుండునట్లు రేచితముజేసి నితంబహస్తములను జూపవలెను స్కంధక్షేత్రమునుండి ఉత్తానాధోముఖములుగా పతాకాహస్తములను బయటకు పంపుచు నితంబమునకు తెచ్చినచో నితంబహస్తములు రాగలవు.

86. స్ఖ లి త ము

దోలాపాదక్రమం కృత్వా హస్తౌ తదనుగా పుభౌ
రేచితౌ ఘూర్ణితౌ వాపి స్ఖలితం కరణం భవేత్. ౧౪౫

దోలాపాదాచారీని ప్రయోగించుచు హంసపక్షహస్తములతో గూడిన బాహువుల గమనాగమనములను తెలుపుచు, అంగపర్యాయము గావింప స్ఖలితమను కరణము రాగలదు

87. క రి హ స్త ము

వామో వక్షఃస్థితో హస్తః ప్రోద్వేష్టిత తలోఽపరః
అంచిత శ్చరణ శ్చైవ ప్రయోజ్యః కరిహస్తకే. ౧౪౬

సమున్నతమైన లతాహస్తము నొక ప్రక్కనుండి మరొకప్రక్కకు ఊపుచు, త్రిపతాకయగు రెండవచేతిని చెవివద్ద నుంచగా కరిహస్తము వచ్చును ఈ త్రిపతాక హస్తమును ఎడమచేతి లోపలిభాగమున త్రిప్పుచు కుడిపాదము నంచితముగా ప్రయోగించి నిష్క్రమింప జేయవలెను అప్పుడు కరిహస్తమను కరణము సిద్ధించును.

88. ప్ర స ర్పి త క ము

ఏకస్తు రేచితోహస్తో లతాఖ్యస్తు తథాపరః
ప్రసర్పితతలౌ పాదౌ ప్రసర్పితక మేవతత్. ౧౪౭

హంసపక్షమగు కుడిచేతిని వేగముతో కంపింపజేయుచు, ఎడమచేతిని లతాహస్తముగా నుంచవలెను కుడిపాదముతో నెమ్మదిగా భూమిని ఘట్టించుచు అడుగులు వేయవలెను. అప్పుడు వచ్చు ప్రసర్పితకమను కరణమును ఖేచరసంచార విషయమున ప్రయోగించవలెను.

89. సి ం హ వి క్రీ డి త ము

అలాతంచ పురః కృత్వా ద్వితీయంచ ద్రుతక్రమమ్
హస్తౌ పాదానుగౌ చాపి సింహావిక్రీడితే స్మృతౌ ౧౪౮

మొదటి పాదమును వెనుకకు ప్రసారించి, తర్వాత వలనముతో లోనికితెచ్చి, రెండవ కాలి తొడకెదురుగా నుండునట్లు తీసికొని రావలెను. ఆ పాదమును ప్రక్కగా మడమతో కలిపిన వచ్చు అలాతాచారీని ప్రయోగించవలెను. ఇట్లే రెండవ పాదముతో గూడ వేగముగా అలాత

చారీని చూపుచు పాదమును ముందుకు వేయవలెను. ప్రయోగము ననుసరించి చేతినికూడ ముందుకు వేయగా సింహకరిఘాతమువలె ఆకృతివిన్యాసము రాగలదు. రౌద్రగతి విషయమున దీనిని ప్రయోగింతురు.

90. సింహాకర్షితము

పృష్ఠ ప్రసారితః పాద స్తథా హస్తౌ నికుంచితౌ
పున స్తథైవ కర్తవ్యో సింహాకర్షితకే ద్విజాః ౧౪౯

వృశ్చిక పాదమును వెనుకకుచాచి, నికుంచితములగు పద్మకోశ, ఊర్ణనాభహస్తములతో స్వస్తికను పట్టవలెను. చేతులను వేరుజేసి, రెండవపాదముతో వృశ్చికచరణము నాడి మరల ఆ హస్తములతోనే స్వస్తికను చూపవలెను. ఇట్లు చేయగా వచ్చు సింహాకర్షిత కరణమును సింహాద్యభినయ విషయమున ప్రయోగించవలెను

91. ఉద్వృత్తము

ఆక్షిప్త హస్త మాక్షిప్త దేహ మాక్షిప్త పాదకమ్
ఉద్వృత్త గాత్ర మిత్యేత దుద్వృత్తం కరణం స్మృతమ్ ౧౫౦

హస్తపాదములను చాచి వెనుకకు తీసికొని రావలెను. ఇట్లు హస్తపాదముల నాక్షిప్తములుగా జేయుచు సమస్తదేహమును గూడ ఉద్వృత్తాచారీతో ఆక్షిప్తము చేయవలెను. ఆవిద్ధచారీలోని కుంచితపాదపు మడమను రెండవకాలి తొడవద్దకు తీసికొని, అదే పాదముతో గంతు వేసి పరివర్తితము చేయవలెను. ఇట్లే రెండవపాదముతో గూడ చేయగా ఉద్వృత్తాచారీ రాగలదు ఈ చారీతో గూడినదగుటచే నీ కరణమును ఉద్వృత్తమనిరి.

92. ఉపసృతకము

ఆక్షిప్త శ్చరణ శ్చైకో హస్త స్తస్యైవచానుగః
ఆనతంచ తథా గాత్రం తథో పసృతకం భవేత్ ౧౫౧

ఆక్షిప్తాచారీని ప్రయోగించి ఎడమ ప్రక్కగా వ్యావర్తింపజేసి, కరపరివర్తనముతో శరీరమును వంచి కుడిచేతిని అరాలముగా చేయవలెను అప్పుడు వచ్చు ఉపసృతకమను కరణమును వినయముతో సమీపించు సందర్భమున ప్రయోగించవలెను.

93. తలసంఘట్టితము

దోలాపాదక్రమం కృత్వా తలసంఘట్టితౌ కరౌ
రేచయేచ్చ కరం వామం తలసంఘట్టితే సదా. ౧౫౨

దోలాపాదాచారీని ప్రయోగించుచు, పతాకాహస్తముల నొకదానితో నొకటి ఘట్టించుచు, వైష్ణవస్థానకమున నుండి కుడిచేతిని నడుమువద్ద నుంచి, ఎడమచేతిని హంసపక్షముగా చేసి వేగముతో కంపింపజేయగా తలసంఘట్టితకరణము రాగలదు. అనుకంపా ప్రధానమైన వాక్యార్థము నభినయించుటలో నీ కరణమును ప్రయోగించవలెను.

94. జని త ము

ఏకో వక్షఃస్థితో హస్తో ద్వితీయశ్చ ప్రలంబితః
తలాగ్ర సంస్థితః పాదో జనితే కరణే భవేత్. ౧౫౩

వక్షమువద్ద కుడిచేతిని ముష్టిహస్తముగా నుంచి, ఎడమచేతిని లతాహస్తముగా చూపవలెను పాదముయొక్క ముందుభాగముపై నిలచియుండ జనితమనుకరణము వచ్చును. అభినయ ప్రారంభకాలమున తత్సన్నివేశ జననయోగ్యమైన ఈ కరణమును జనితాచారీతో చూపవలెను జనితాచారీ లక్షణముకూడ నిదియే. సమస్తగీతము లీ చారీతో జన్మించుటచే దీనిని జనిత మన్నారు.

95. అ వ హి త్థ క ము

జనితం కరణం కృత్వా హస్తౌ చాభిముఖాంగులీ
శనై ర్నిపతితౌ చైవ జ్ఞేయం త దవహిత్థకమ్. ౧౫౪

...తాచారీలోని పాదమును ప్రయోగించి లలాటవక్షఃక్షేత్రములయందు అరాల, అలపల్లవ హస్తములను పట్టి నెమ్మదిగా ఉద్వేష్టితకరణమున చేతులను క్రిందకు పైకి తెచ్చుచు, ప్రక్కలయందుంచవలెను. మరల అపవేష్టితకరణమున పరివర్తితములుగా జేసి అరాల, అలపల్లవ హస్తములను ఒకదానికొకటి ఎదురుగా నుండునట్లు వక్షమువద్ద నుంచవలెను. ఈ అవహిత్థక కరణమును గోపన ప్రధానమైన వాక్యార్థమున ప్రయోగించవలెను.

అంచితములైన శుకతుండహస్తములను వక్షమువద్ద ఒకదానికొకటి ఎదురుగా నుండునట్లు పట్టి, అధోముఖములుగా చేసి నెమ్మదిగా క్రిందకు పంపగా అవహిత్థహస్తములు రాగలవు. ఈ హస్తములిచట అభిప్రేతములని కొందరి అభిప్రాయము. ఈ వ్యాఖ్యాతల ననుసరించి నచో ఈ కరణమును చింతా దౌర్బల్యవిషయమున నభినయించవలెను.

96. ని వే శ ము

కరౌ వక్షఃస్థితౌ కార్యౌ వురో నిర్భుగ్న మేవచ
మండలస్థానకం చైవ నివేశం కరణం తు తత్. ౧౫౫


వీపు లోనికివచ్చి, రొమ్ముభాగము ఎత్తుగా నుండగా, భుజములు జారకుండునట్లు, స్తబ్ధమగు ఉరమును నిర్భుగ్నమందురు చేతులను వక్షము వద్దనుంచి, ఉరఃప్రదేశమును నిర్భుగ్నముగా చూపి, మండల స్థానకమున నున్నచో నివేశకరణము రాగలదు. ఐంద్రమండల స్థానకమున పాదముల మధ్య దూరము నాల్గుతాళములు వచ్చును. ఈ కరణముతో గజవాహనాది విషయము నభినయించవలెను.

97. ఏ ల కా క్రీ డి త ము

తలసంచర పాదాభ్యా ముత్ప్లుత్య పతనంభవేత్
సంనతం వలితం గాత్ర మేలకాక్రీడితం తు తత్. ౧౫౬

పాదముల అగ్రతలములపై నిలచి, ఎగిరి పాదములను వేయుచు శరీరమునువంచి పాదమును త్రిప్పవలెను

ఈ ప్రక్రియలో ఏలకా క్రీడితచారీని ప్రయోగించవలెను. అగ్రతల సంచరపాదములతో ఎగురునపుడు మడమ పిరుదకు తాకవలెను. ఇట్లు అంగపర్యాయముతో పతనోత్ప్లుతులు


82


83


84


85


86


87


88


89


90


91


92


93


94


95


96


97


98


99

జరుగగా ఏలకాక్రీడితచారీ రాగలదు. ఈ కరణమును అధమపాత్రలగతిని నిరూపించునపు డుప యోగించవలెను.

98. ఊరూద్వృత్తము

కర మావృత్తకరణ మూరుపృష్ఠే ఽంచితం న్యసేత్
జంఘాంచితా తథోద్వృత్తా హ్యూర్యారూద్వృత్తంతు తద్భవేత్. ౧౫౭

అగ్రతల సంచరపాదముయొక్క మడమను రెండవపాదము యొక్క వెనుక అనభి ముఖముగా నుంచవలెను. జానువు వంగుటచే జంఘాభాగము కుంచితమై రెండవకాలి జంఘా భాగమున కెదురుగా నుండునట్లు తిరుగవలెను. ఊరువులకీరీతిగా వచ్చు ఊర్ధ్వవివర్తనము లజ్జే ర్ష్యాదివిషయమును చూపును. ఈ విధముగా సిద్ధించు ఊరూద్వృత్తాచారీని ప్రయోగించుచు. వ్యావర్తితకరణమున అరాలమగు కుడిచేతిని ఊరుదేశమున, ఖటకాముఖమగు ఎడమచేతిని పృష్ఠమున ఉంచవలెను ఇట్లుత్పన్నమగు ఊరూద్వృత్తకరణమును ప్రణయకోపమును, ఈర్ష్యను, ప్రార్థనాదివిషయమును అభినయించునపుడు ప్రయోగించవలెను.

99. మదస్ఖలితకము

కరౌ ప్రలంబితౌ కార్యౌ శిరశ్చ పరివాహితమ్
పాదౌచ వలితౌ విద్ధౌ మదస్ఖలితకే ద్విజాః. ౧౫౮

దోలాహస్తములను చూపుచు, శిరస్సును కుడిప్రక్కకు, తర్వాత ఎడమప్రక్కకు వంచుచు నుండవలెను. పాదములను వలితములుగాను, ఆవిద్ధములుగాను జేసి, తర్వాత కుం చించి స్వస్తికను పట్టి, వేరు జేయవలెను. ఇట్లంగపర్యాయము గావింపగా మద్యమద విషయ మును తెలుపు మదస్ఖలితకరణము రాగలదు.

పూర్వసిద్ధజ్ఞానము

బెర్ట్రండ్ రసెల్

అనువాదం జి. ఎస్. ఎన్.

౧

ఆధునిక తత్త్వచింతకులలో ఇమాన్యు
అల్ కాంట్ అగ్రగణ్యుడు ఏడు సంవత్సర
ముల మహాయుద్ధమును, ఫ్రెంచివిప్లవమును
జరిగినపుడాతడు జీవించియున్నను, తూర్పు
ప్రష్యా యందలి కోనిగ్సుబర్గ్‌లో నాతని
తత్త్వశాస్త్రాధ్యాపనమున కెట్టియంతరాయ
మును గలుగలేదు అతడు తత్త్వశాస్త్రమున
ననేక ప్రధానవిషయములను నిశితముగా
విమర్శించి విమర్శనాత్మకమగు తత్త్వ
శాస్త్రము నొకదానిని రూపొందించి యా
శాస్త్రమునకు విశేషముగ దోహదమొన
రించెను. తొలుత నాతడు జ్ఞానము అనేక
విధములన్న విషయము నాధారముగ నంగీక
రించి, యట్టి జ్ఞానమెట్లు సాధ్యమగునాయను
విచారణచేసి, దానికివచ్చు సమాధానమును
బట్టి, యీ ప్రపంచ స్వభావమును గూర్చిన
నిర్ణయములను కొన్నింటిని చేసెను ఈ
నిర్ణయములలో నేవి సమంజసములను విష
యమై శంక కలుగవచ్చును. కాని కేవలము
విభజనాత్మకముగాని పూర్వసిద్ధజ్ఞాన మొకటి
గలదని గమనించి, జ్ఞాన సిద్ధాంతమునకు గల
తాత్త్విక ప్రాముఖ్యమును నిరూపించిన
ఘనత ఒక్క కాంటుకే దక్కును

కాంటుకు పూర్వము, పూర్వసిద్ధమై
యున్న జ్ఞానమేదియైనను, విభజనాత్మకమై
యుండవలెనన్న విషయమును సామాన్య
ముగ నెల్లరంగీకరించినదే దీని యర్థమేమో
యీక్రింది యుదాహరణములను పరిశీలిం
చిన పిమ్మట తేటపడును. బట్టతల గలిగిన
మనుష్యుడు మనుష్యుడు, సమతలాకార
మొక యాకారము, కుకవిగూడ నొకకవియే
యన్న వాక్యములను దీసికొందము.
సామాన్యజీవితమున వానికిగల ప్రాముఖ్య
మల్పాల్పము జల్పమునకు కాలుదువ్వు
వక్తకొక్కనికే యవి పనికివచ్చును వానిని
విభజనాత్మక వాక్యములనుటకు గల
హేతువు - ఆ వాక్యములలోని కర్తృపద
మును విభజించుటచే విధేయపదమేర్పడు
టయే. కాంటుకు పూర్వము, పూర్వసిద్ధ
మని గట్టిగా చెప్పగలిగిన నిర్ణయములన్నియు
నిట్టితెగకు జెందినవేయనియు, చెప్పదల
చిన కర్తృపదములో భాగమైన విధేయపద
మొకటి యట్టివాక్యములలో నుండెనని
యును భావించుచుండెడివారు ఇదియే నిజ
మైనచో, పూర్వసిద్ధముగా తెలియనగు దేనిని
నిరాకరింపయత్నించినను, మనము స్వవచో
వ్యాఘాతమునకు లోనైయుండెడి
వారము. 'బట్టతలగల మనుష్యునకు బట్టతల
లేదు' అన్న వాక్యములో నొకేవ్యక్తికి బట్ట
తల యుండుటయును, లేకపోవుటయును
నేకకాలమున జెప్పినచో నందు స్వవచోవ్యా
ఘాతమను దోష మేర్పడును. కావున,
కాంటుకు పూర్వులగు తత్త్వచింతకులందరి
యభిప్రాయము ప్రకారము, ఏకవస్తువున
కును నేకకాలమున నొకే లక్షణముండు
టయు, లేకబోవుటయును పొసగదని చెప్పు
విరోధసూత్రము సర్వపూర్వ సిద్ధజ్ఞానము
యొక్క యాథార్థ్యమును నిరూపింపఁ
జాలును

కాంటుకు పూర్వుడగు హ్యూమ్, జ్ఞానము
నేది పూర్వసిద్ధముగా జేయునన్న దాని విష
యమై తత్త్వచింతకులలో సామాన్యముగ
వ్యవహారములోనున్న యభిప్రాయమును నంగీ
కరించుచునే, పూర్వము విభజనాత్మకముగ
భావింపబడిన యనేక సందర్భములలో,
ముఖ్యముగా కార్యకారణభావము విషయ
ములో వాస్తవముగ జెప్పవలయునన్నచో
నారెండింటి సంబంధము సంయోజనాత్మక
మని(Synthetic) గ్రహించెను హ్యూమ్‌కు
పూర్వము, అధమము హేతువాదులైనను

కారణమును బట్టి కార్యమును తార్కికముగ
సిద్ధింపజేయుటకు వీలుగలదని భావించిరి
కాని యాకార్యకారణములకు సంబంధించిన
జ్ఞానము చాలినంతగా మనకుండవలయు
నన్న నియమము నొక్కదాని నంగీకరించిరి
హ్యూమ్ ఇది యసంభవమని మున్ముందుగా
చాటెను ఈ విషయమున నాతనివాదము
నిర్దుష్టమని యిప్పుడెల్లరు నంగీకరించిరి. కాని
హ్యూమ్, పై విషయము నాధారముగ
జేసికొని, కార్యకారణ సంబంధమునుగూర్చి
పూర్వసిద్ధమైనదేదియును జ్ఞాతమగుటకు వీలు
లేదను నితోధిక సందేహాస్పదమగు నిర్ణయ
మును వేఱొకదానిని చేసినాడు హేతువాద
సంప్రదాయమున శిక్షితుడైన కాంటుకు
హ్యూమ్‌చేసిన ప్రతికూలవాదము తీవ్రమగు
చీకాకును గల్గించెను. అతడొక్క కార్య
కారణ సంబంధమేకాక, గణితశాస్త్రము
నను, క్షేత్రగణితమునందు కూడ సిద్ధాంత
వాక్యము లన్నియును విభజనాత్మకములు
కావనియును, మరి సంయోజనాత్మకములని
యును గ్రహించెను ఈ సిద్ధాంతవాక్యము
లన్నింటిలో కర్తృపదము విభజనము చేసి
నచో విధేయపద మేర్పడదు ఏడును అయి
దును కలిసి పండ్రెండగునన్న దానినే
సామాన్యముగ నుదాహరణముగా నాతడు
గైకొనును. పండ్రెండు అను ఫలితమువచ్చు
టకే ఏడు అను నంకెను, 'అయిదు' అను
నంకెను కూడవలసియుండెను. పై రెండంకె
లలో కాని, లేక యారెండింటిని కలుపు
నపుడుగూడ పండ్రెండును గూర్చిన
స్థూలాభిప్రాయము లేదు కావున కేవల
గణితశాస్త్రమంతయు(Pure mathematics)
పూర్వసిద్ధమైనను, సంయోజనాత్మకమే
యని యాతడు సిద్ధాంతీకరింపవలసి వచ్చెను.
ఈ నిగమనము వేఱొక క్రొత్త సమస్యను
తెచ్చిపెట్టెను దానికి పరిష్కారమును గన్గొ
నుటకుగూడ నాతడు యత్నించెను

కాంట్ తత్త్వశాస్త్ర గ్రంథమును
వ్రాయుచు వైచిన మొదటి ప్రశ్నము-
ముఖ్యముగా కేవల గణితశాస్త్రమెట్లు సాధ్య
మగునన్న ప్రశ్నము చాల ముఖ్యమైనది.
క్లిష్టమైనది దీనికి కేవలము సంశయవాదము
నకు మొగ్గుచూపని ప్రతి తాత్త్వికసంప్రదా
యమును సమాధానము నొకదానిని సమ
కూర్పవలయును. మన గణిత శాస్త్రజ్ఞానము
కొన్ని ప్రత్యేకోదాహరణములను పరిశీలిం
చిన పిమ్మట ననుభవసిద్ధముగా నేర్పడిన
దన్న యనుభవవాదుల సమాధానము రెండు
హేతువులచే సమంజముగా లేదని మనమీ
వఱకే తెలిసికొంటిమి. అందు మొదటిది
యిది. వ్యాప్తిసాధక సిద్ధాంతము (మానవు
లకు గలుగు ననుభవసాంతత్యమును బట్టి
విషయములను నిర్ణయించు సిద్ధాంతము)
యొక్క సామంజస్యమును వ్యాప్తిసాధక
విధానముచే నిరూపింప వీలుపడదు. ఇక
రెండవహేతువు ఇది రెండును రెండును
కలసి నాలుగగునన్న సామాన్య గణితశాస్త్ర
సిద్ధాంతముల నొక్క యుదాహరణమును
పరిశీలించినమీదట నిశ్చయముగా తెలిసికొన
గలము కాని వీని యాథార్థ్యము కన్పించిన
యెన్నియుదాహరణములను పరిశీలించినను,
మనమొక నిర్ణయమును చేయజాలము.
కావున మన గణిత శాస్త్రజ్ఞానమును (దానిని
బట్టియే హేతుశాస్త్రజ్ఞానముగూడ)మనుష్యు
లందఱును మర్త్యులేయన్న యనుభవసిద్ధ
మగు సిద్ధాంతీకరణము వలన గలిగినాసంభవ
జ్ఞానమును బట్టికాక తదితర హేతువులచే
నిరూపింపవలయును.

అనుభవము వైయక్తికమై యుండగా
పైనచెప్పిన జ్ఞానము సర్వసాధారణమను
విషయమును పురస్కరించుకొనియే సమస్య
బయలుదేరును మన కనుభవములో లేని
ప్రత్యేక విషయములను గూర్చిన యథార్థ
నిర్ణయములను స్థూలముగనైనను మున్ముందే
యెఱుగగల్గుట విడ్డూరముగ కన్పించును.
కాని హేతుశాస్త్రము, గణితశాస్త్రము,
అట్టి విషయములకే యన్వయించునన్న విష
యమై సందేహింపబనిలేదు ఒక నూరు

సంవత్సరముల్లైన తరువాత లండనుపురవాసు లెవ్వరో మనకు తెలియకపోవచ్చును కాని వారెవ్వరైనను, మొదటి యిఱువురును రెండవ యిఱువురలో గలసి నలువురు వ్యక్తు లగుదురన్న విషయము మనకు విదితమే మనకనుభూతము కానివానిని గురించి ముందే నిర్ణయింపగల్గిన శక్తి నిజముగా నత్యాశ్చర్య కరమై యున్నది ఈ సమస్యకు కాంటు చూపిన పరిహారము సమంజసము కాక పోయినను, నత్యంతప్రముఖమైనది నిజ ముగా కాంట్ వాదము చాల క్లిష్టమైనది అనేకతత్త్వచింతకులకది వేర్వేరురీతుల యవ గతమైనది కావున దానినిగూర్చి యొక స్థూలమగు పరిశీలనయే ప్రస్తుతముసాధ్యము. దానినిగూడ కాంట్ తాత్త్వికసంప్రదాయ వ్యాఖ్యాతలు, తప్పుద్రోవ పట్టించునదిగ, పరిగణింపవచ్చును.

కాంట్ చెప్పిన విషయమిది మన యను భవమంతటిలోను, రెండు అంశములు ప్రధా నముగ నిమిడియుండును అందులో మొద టిది వస్తువునకుసంబంధించినది. దీనికే భౌతిక వస్తువని నామకరణము చేసితిమి, రెండవది మన స్వభావమునకు సంబంధించినది. ద్రవ్య మును గూర్చియు, దానికి ననుబంధించిన యింద్రియార్థములను గూర్చియు మనము వెనుక చర్చించినపుడు, భౌతికవస్తువు దానికి ననుబంధించిన యింద్రియార్థములకు విభిన్న మైనదనియును, నీ యింద్రియార్థములు, భౌతికవస్తువునకును, మనకును గల పరస్పర సంబంధమును బట్టి యనుభూతములగు చున్నట్లు భావింపవలసి యుండుననియును మనమీవఱకే తెలిసికొనియుంటిమి ఇంత వఱకును కాంట్ చెప్పినదానితో మనకు నభి ప్రాయభేదము లేదు. కాని కాంట్‌లోప్రత్యే కత భౌతికవస్తువునకును, మనకును భాగము లను కల్పనచేయుటలో కాననగును ఇంద్రి యానుభవముచే దత్తమగు ప్రధానసామగ్రి- రంగు, గట్టితనము మొదలగునవి- (స్పర్శ రూపములు)- వస్తువువలననే యనుభూతము లగు ననియును, మనము సమకూర్చుకొను నవి- దేశకాలములలోని సంస్థానవిశేషమును, పరస్పరమును పోల్చి చూచుట వలనగాని, వానిలోనొకటి మఱియొకదానికికారణమని భావించుటవలనగాని లేక మరి యేదోవిధ ముగ గాని యేర్పడు నింద్రియార్థముల నడుమగల పరస్పర సంబంధములన్నియును నని నాతడు భావించును. ఈ విధముగా నాత డభిప్రాయపడుటకు గల కారణము, దేశకాలమును గూర్చియు, నిమిత్తమును గూర్చియు సాదృశ్యమును గూర్చియు మనకు పూర్వసిద్ధజ్ఞానము గల్గుచున్నట్లు కన్పించుట యును, ఇంద్రియానుభవము వలన గలిగిన ప్రధానమగు వస్తుగుణ సామగ్రిని గూర్చి పూర్వసిద్ధజ్ఞానము కలుగకుండుటయును నై యున్నది. మన కనుభవములోనికి దెచ్చు కొను వస్తువేదియైనను, మన పూర్వసిద్ధ జ్ఞానములో దానినిగూర్చి చెప్పిన లక్షణము లను నిర్దేశింపవలయును. ఏలన నీ లక్షణము మన స్వభావము వలన సంక్రమించినవి కావున నీ లక్షణములను సమకూర్చుకొననిదే యేదియును మనకనుభవసిద్ధము కాజాలదు

మూలభూతమగు వస్తువుగా నాతడు వ్యవరించు భౌతికవస్తువు ముఖ్యముగా నజ్ఞే యమైనదిగ నాతడు భావించును. గోచర పదార్థమని యాతడు వ్యవహరించునదనుభవ సిద్ధమగు వస్తువు మనకు విదితమగును. మన కును, అసలు వస్తువునకును నడుమగల సంబం ధమును బట్టి యేర్పడు గోచరపదార్థము, మనవలన సంక్రమించిన లక్షణములతోగూడి యుండవచ్చును కాబట్టి మనకుగల పూర్వ సిద్ధజ్ఞానము తప్పక స్థిరపడును దీనిని బట్టి యీ జ్ఞానము ఉన్నట్టియు, ఉండుటకు వీలై నట్టియు ననుభవముపట్ల యథార్థమేయైనను, అనుభవమునకు వెలిగా నన్వయించు నట్లను కొనుటకు వీలులేదు. కావున పూర్వసిద్ధజ్ఞాన మున్నప్పటికిని, అసలు వస్తువునుగూర్చి కాని, అనుభవమునకు అందని, లేక అందుటకు వీలు లేని వస్తువునుగూర్చి కాని మనకేమియు

నెఱుకపడజాలదు. ఈ విధముగా నాతడు హేతువాదులను, అనుభవవాదులను సమన్వయింపజూచును.

కాంట్ వాదమును విమర్శించుటకు ప్రతిపాదించిన చిన్నిచిన్ని హేతువులను మూలకు ద్రోసి, అతని మార్గము ననుసరించి పూర్వసిద్ధజ్ఞానమునకు సంబంధించిన సమస్యనుచర్చించునెట్టి ప్రయత్నమునకైనను విఘాతుకమగు ప్రధానమగు నభ్యంతరమొకటి గలది. ఇందు ప్రధానమగు సమస్య-జీవితానుభవ-విషయములెల్లప్పుడును హేతుశాస్త్ర గణితశాస్త్ర సిద్ధాంతముల కొదిగియుండవలెనన్న విషయమెంతవఱకు నమ్మదగినది యనునది. మన స్వభావముగూడ, వర్తమానమగు ప్రపంచమునందలి సర్వవస్తువుల వంటిదే. అది స్థిరముగా నుండునని మనముచెప్పలేము. కాంట్ చెప్పినదే నిజమైనచో, రేపు మన స్వభావము రెండును రెండును కలిపి యైదు అగునని నమ్మునట్లుగా మార్పు నొందుటగూడ సంభవమే కావచ్చును. ఈవిధముగ ప్రతివాదము చేయుటకు నవకాశము గలదన్న యాలోచన గూడకాంటుకుతట్టినట్లు కన్పించుటలేదు. కాని గణితశాస్త్ర సిద్ధాంతముల విషయమై తాను సమర్థింప నుత్సుకతజూపు నిశ్చితత్వమును, సర్వసాధారణత్వమును తుత్తునియలు జేయునదీ యీ ప్రతివాదమే. కాని యాతడొనర్చిన యీ ప్రతివాదము కాలమనునది కర్త (Subject) గోచర పదార్థములపై యారోపించిన యొకానొక రూపమనియును, మన వాస్తవమగు నాత్మకు కాలమున నునికిలేదనియును, దానికి రేపనునది లేదనియును నని చెప్పు కాంట్ అభిప్రాయమునకు పూర్తిగా విరుద్ధమనుట నిజమే. కాని ప్రకృతిలోని సంఘటనము వెనుకగల కాలక్రమము, ప్రకృతిసంఘటనలకు నధిష్ఠాన భూతముగనున్న లక్షణములచే నిర్ణీతమైయున్నది. ఇది మన వాదమునకు ప్రస్తుతము చాలినంత బలము సమకూర్చును.

మన గణితశాస్త్ర విశ్వాసములలో నేమైన నిజమున్నచో, మనము వానినిగూర్చియాలోచించినను ఆలోచింపకున్నను, నవి వస్తువుల పట్ల వర్తించితీరవలయునని కొంత జాగ్రత్తగ పరిశీలించిన పిమ్మట స్పష్టపడును. రెండు భౌతికవస్తువులును, మరిరెండు భౌతిక వస్తువులును కలసి నాలుగు భౌతికవస్తువులై తీరవలయును. దీని నుద్ఘాటించుట, రెండును రెండును కలసి నాలుగగునని మనము చెప్పునప్పుడు మనము దానికి చెప్పు నర్థవిస్తృతిలో నుండనేయున్నది. రెండు గోచరపదార్థములును, మరిరెండు గోచరపదార్థములును కలసి నాల్గు గోచరపదార్థము లగుననుటలో నెంత యాథార్థ్యమున్నదో, రెండును రెండును కలసి నాల్గగుననుటలో నంత యాథార్థ్యమున్నది. కావున కాంటుచూపిన పరిష్కారమార్గము పూర్వసిద్ధము లగు సిద్ధాంతవాక్యముల విస్తృతిని విస్తారముగ పరిమిత మొనర్చును. అంతియే కాక యవి వాని నిశ్చితత్త్వమును వ్యాఖ్యానించు యత్నమున విఫలమగును.

కాంట్ అవలంబించిన ప్రత్యేకసిద్ధాంతముల నటుంచి, పూర్వసిద్ధమైన దెల్లను-(బాహ్యప్రపంచమునకు సంబంధించిన దే విషయమునుకంటెను, మనమాలోచింపవలసిన మార్గమునకు సంబంధించినంతవఱకును)-మానసికమని బరిగణించు నలవాటు తత్త్వ చింతకులలో నెక్కువగా గలదు. వెనుకటి యధ్యాయమున నాలోచనా సూత్రములని వ్యవహరింపబడు మూడుసిద్ధాంతములని గమనించియే యుంటిమి. కాని వానినట్లు వ్యవహరించుటకు త్రోవదీసిన యభిప్రాయము సమంజసమైనది కాదనుటకు బలమైన యుపపత్తులుగలవు. విరోధసూత్రమున కుదాహరణము నొకదానిని పరిశీలింతము. సామాన్యముగా నీసూత్ర మిట్టి వాక్యరూపములో నుండును. 'ఏదియైన నొకేకాలమున నుండుటయు, లేకపోవుటయు ననునది జరుగదు.'

అనగా ఒకవస్తువున కేకకాలమున నొక ధర్మముండుటయు, లేకుండుటయు ననునది సంభవింపదు. ఉదాహరణమునకు ఒకచెట్టు భూర్జవృక్షమైనచో, అదేకాలమున నది భూర్జ వృక్షము కాకుండుట యనునది కుదురునది కాదు. నాబల్ల సమచతురస్రముగ నున్నచో, అదేకాలమున నది సమచతురస్రముగ నుండ కుండుట యనునది పొసగదు.

ఈ సిద్ధాంతము నాలోచనాసూత్రమని వ్యవహరించుటకుగల హేతువు, అందులో యథార్థమున్నదా లేదా యను విషయ మును బాహ్య వస్తుపరిశీలనమునుబట్టి కేవల మాలోచనచే మనము నమ్మకమును కుదు ర్చుకొనుట. ఒకచెట్టు భూర్జవృక్షముకాదని మనము గమనించినచో, అది భూర్జవృక్ష మౌనోకాదో నిర్ణయించుటకు తిరిగి చెట్టుకై చూడనక్కఅలేదు. ఇది యసంభవమని కేవల మాలోచించినంత మాత్రమున మనకు తెలి యును. కాని విరోధసూత్ర మాలోచనా సూత్రమన్న మాటలోసత్యమేమియునులేదు. మనము విరోధసూత్రమును విశ్వసించుచు న్నామనగా, మన మనస్సు విరోధసూత్ర మును నమ్ముట కనుకూలముగా నిర్మింపడిన దని యర్థముగాదు. విరోధసూత్రమును ముందుగనే యంగీకరించి మనస్సుతో విచారణ చేయగా నీ విశ్వాసమేర్పడినది. విరోధసూత్రమునందలి మన యీ విశ్వా సము, వస్తువులను గూర్చిన విశ్వాసము గాని యాలోచనలను గూర్చిన విశ్వాసము గాదు. ఒకానొక వృక్షము భూర్జవృక్షమని యనుకొనుచున్నామనగా, నదేకాలమున మనమది భూర్జవృక్షము కాదని యనుకొన లేమునికాదు. కాబట్టి విరోధసూత్రము వస్తు విషయకముగాని యాలోచనా విషయము గాదు. విరోధసూత్రమునందలి విశ్వాస మొక భావమన్న మాటలో సత్యమున్నను, కేవలము విరోధసూత్రముమాత్రము భావము కాజా లదు. మరిప్రపంచమునందలి వస్తువులగూర్చి న యొక సత్యము. మనము విరోధసూత్ర మును విశ్వసించునపుడు, మనము విశ్వసించు నది ప్రపంచమునందలి వస్తువులపట్ల యథా ర్థము కాకపోయినచో, మనము దానిని గూర్చి యట్లాలోచింపక తప్పుటలేదన్న విష యము, విరోధసూత్రమున యథార్థము కాకుండ రక్షింపలేదు. ఇదియే యీసూత్ర మాలోచనా సూత్రము కాదని నిరూపించును.

తదితరమగు మరి యే యితర పూర్వసిద్ధ నిర్ణయమునకును యిట్టియుపపత్తియే యన్వ యించును. రెండును రెండును నాలుగగు నని మనము నిర్ణయించునపుడు, మనము మన యాలోచనలను గురించిన నిర్ణయమును చేయుటలేదు. కాని ఉన్నటువంటియు, ఉండ దగినటువంటియు జంటలనుగూర్చిన నిర్ణయ మును మనము చేయుచున్నాము. రెండును రెండును కలిసి నాలుగగునని విశ్వసించు నట్లుగా మన మనస్సులు నిర్మితములైయున్న వను విషయమును(నిజమైనను) రెండును-రెం డునుకలిసినాల్గగుననిమనముద్ఘాటించునపుడు మన ముద్ఘాటించెడి విషయమును ఎన్నటికిని ఒక్కటికాదు. మనమనోనిర్మాణమునకుసంబం ధించిన యేవిషయమును రెండును రెండును కలిసి నాలుగగునన్న విషయమును యథార్థ మొనరింపనేరవు. కావున మన పూర్వసిద్ధజ్ఞాన ము- భ్రమాత్మకముకానిచో- కేవలము మన మనోనిర్మాణమును గూర్చిన జ్ఞానము కాదు. కాని యట్టిపూర్వసిద్ధజ్ఞానముప్రపంచములోని యేవస్తువునకైనను-మానసికమైనను-అమాన సమైనను అన్వయించితీరును.

కాన మన పూర్వసిద్ధజ్ఞానమంతయు, సమంజసముగా చెప్పవలెనన్న- భౌతిక ప్రపం చమున గాని మానస ప్రపంచమునగాని ఉనికి గలిగియుండని యంశములకు సంబం ధించి యున్నదను విషయము యథార్థమై నట్లు కన్పించును. వీనిని విశేష్యములు కాని భాషాభాగములచే నిర్దేశింపవచ్చును. వానిని గుణములు, సంబంధములు అని వ్యవహరింప వచ్చును.

నేను నా గదిలో నున్నానని యను కొందము. నేనున్నాను. నాగడియు ఉన్నది. కాని 'లోపల' అనునదిగూడ ఉన్నదా? కాని స్పష్టముగా నా శబ్దమున కొక యర్థము గలదు. నాకును, నాగదికిని ఒక విధమగు సంబంధముగలదు. లోపల యను శబ్దమట్టి సంబంధమునే సూచించును. కాని నేనును, నాగదియును అనువాని యునికికిని, ఈరెండింటికిని గల సంబంధపు టునికికిని భేదము చాల గలదు. 'లోపల' యను సంబంధము మన మాలోచించి యవగతము చేసికొనుటకు వీలైనది. ఏలన మనకది యవగతము కానిచో, నేను నా గదిలో నున్నానను వాక్యము నిజముగా మన కర్థమగుటకు వీలులేదు. కాని కాంటు తరువాతవచ్చిన యనేక తత్త్వచింతకులు సంబంధములనగా నొక మనోవ్యాపార విశేషమనియును. స్వతస్సిద్ధముగా వస్తువులకు సంబంధము లేవియును లేవనియును, మనస్సు ఒక్క యాలోచనా క్రియలో వానిని సమీకరించి, అది వానికున్నట్లు నిర్ణయించు సంబంధములను కలుగ చేయుననియును వాదించిరి.

ఈ యభిప్రాయము, మన మింతకు పూర్వము కాంటు విషయమున నుద్ఘాటించినట్లుగనే - యనేక విప్రతిపత్తులకు లోనగుచున్నట్లు కన్పట్టును. నేను నాగదిలో నున్నానను సిద్ధాంతవాక్యములోని యథార్థ్యమునకు కారణభూతమైనది యాలోచన కాదనుట స్పష్టము. ఒకచెవి పుర్వునాగదిలో నున్నదను విషయము, నేనుగాని చెవిపుర్వుగాని మరియెవ్వరుగాని యెరుగకపోయినను, నిజము కావచ్చును. ఏలన నీసత్యము కేవలము చెవిపురువుకును, గదికిని సంబంధించి యున్నది. మరి దేనిమీదను నాధారపడి యుండలేదు. కావున సంబంధములు, కేవలము మానసికముగాని, భౌతికముగాని ప్రపంచములోనుండి తీరవలెను. ఈ విషయమై మున్ముందు పూర్తిగా నవగతమగును. తత్త్వశాస్త్రము దృష్టిలో నీ ప్రపంచము చాల ప్రాముఖ్యము వహించియున్నది. ముఖ్యముగా పూర్వసిద్ధజ్ఞానమునకు సంబంధించిన సమస్యలదృష్ట్యా యీ ప్రపంచమునకు గల ప్రాముఖ్య మత్యధికము. తరువాతి యధ్యాయమున, దాని స్వభావమును గూర్చియు మనము ప్రతిపాదించు సమస్యలపై దాని ప్రాబల్యమును గూర్చియు చర్చింతము.

గోవిందరామాయణము

విశ్వామిత్ర శరణాగతి

శ్రీ అత్త్రహూరి గోవిందాచార్యులు

అరుదుగదా! స్వదేశజనులార్తిని బొందెడి కాలమన్యులో
తరుగదుగా! గుణప్రతిభ ధర్మవిధంబు, నభంగమే కదా
నరుల జయింపగా దశరథావని పాలయటంచు నేరో యా
తురమున రాని రోజుకలదో యతఁడేలుచునుండ రాజ్యమున్.

అత్తఱి యొక్కనాఁడు వసుధాపతి మౌనులగూడి కొల్వునన్
చిత్తము పల్లవింపఁగ వసిష్ఠుడు దెల్పెడి ధర్మసూక్తులన్
బత్తిని నాలకించుతఱి వచ్చెను కౌశికుఁడంత, రాజుచే
యెత్తి నమస్కరించి మునికిట్టులు పల్కె, సపర్య పిమ్మటన్.

మీరాకే సుకృతంబు దాననమృతంబే యబ్బినట్లుండె స
న్నారీ రత్నము భార్యయై సుతుఁడు జన్మంబంద నెట్లుండునో
నీరంబుల్ గనలేనిచో నపుడు వర్షింపంగ నెట్లుండునో
యేరీతిన్ నిధి చిక్కనుండునటుగా నేనైతి మీ రాకచే.

బ్రహ్మతేజ! స్వాగతము మద్భాగ్యమేమొ?
ఆత్మజుల వివాహమ్ములే నాత్మఁదలఁప
మీరలరు దెంచినారిట్లు, మేదినీశు
డీయఁ గలదేమి? సత్పాత్రు డిపుడు దొరకె.

నీదురాక కతన నినుఁ గనుఁగొంటను
బుణ్య తీర్థమిపుడె పొందినాఁడఁ
బరమ ధర్మమెల్లఁ బ్రాప్తించెఁగా నేఁడు
లభ్యమాయె సుమ్మ యభ్యుదయము.

కార్యమేదియైన కౌశికా నెఱవేర్తు
సంశయింపవలదు శక్తిఁ గూర్చి
దైవమీవు నాకు ధర్మపరాయణా
ధర్మ కర్మ సేయఁ దలఁచువాఁడ.

రోమంబులు పులకింపఁగ
భూమీశుని మాటవించు మోదముతో వి

శ్వా మిత్రుండను "రాజా
సామాన్యుండవె నినుఁ గన సర్వంబబ్బున్."

పురమున్ గోశము గ్రామముఁ స్వజనులుఁ భూనాథ క్షేమంబె యె
ల్లరు సామంతనృపుల్ వశంవదులె లీలఁ మిత్రులఁ జూతువే
యరివర్గంబు జయించితే యిహపర వ్యాప్తంబులౌ కర్మముల్
నెరవేర్పఁ వెనుదీయకుందువె? జనానీక ప్రమోదంబుగన్.

విందుగ నీ సపర్యరఘువీర! సుమంత్రియుతా! మునిప్రియా!
పొందితి వాంఛితార్థమిడఁ బూనిక దెల్పినవాఁడవౌట సా
నందుఁడనైతి మీ కులగుణంబె సుమా వరమిట్లు కోరకే
ముందుగ నిచ్చుచుంట వృథపుచ్ఛకయుంట నదెట్టిదేనియున్.

ఉత్తముఁడు వసిష్ఠుఁడుప దేశకుండు
క్రొత్తయే? నుడిదీర్పఁ గోస లేశులకు.

అనుచు వసిష్ఠుని దక్కిన
మునులనుగని, క్షేమమరసి భూపతిమంత్రుల్
వినఁగాఁ గౌశికుఁ డిట్లను
జననాథా! రాకకతము సర్వము వినుమా.

మునులును యోగులుఁ విపినభూమి పయఃఫలమూల భక్షణఁ
మనరొకో? నీ వెఱుంగవొకో? మాధవుఁగొల్చెడివారు రాజ్యముఁ
గొనరు, తపమ్మొసిద్ధిగనఁ గోరెదరెప్పుడు, నే నొకండ సి
ద్ధిని బడయంగనెంచి మఖదీక్షను బూనితిఁగాని, భూవరా

ఘోరతపమ్ము సేయుచు నకుంఠిత తేజమునొంది యెట్లహం
కారము వీడకుండ మమకారమునంబడు నాఁడు సిద్ధినిన్
జేరఁడొ యట్లె నావ్రతముఁ జేద్వడె నిర్వురు కామరూపులౌ
వీరులు శిక్షితుల్ సవన విఘ్నమొనర్చుటఁ బాఱివచ్చితిన్.

అధిప! మారీచుడు సుబాహుడసురు లౌట
మాంసయుత రక్తధారల మలినపఱిచి
రమల మఖవేది నే సిద్ధినందు పట్ల
వారి గురిదాఁటగా నిటఁ జేరినాఁడ.

శాప మొసంగునంతట నిశాచరు లిర్వురు నేలఁగూల రే?
రూపఱిపోయె సిద్ధికి, నిరోధమొనర్పఁగ నూరకుండునే?
శాపఁడటంచుఁ బల్కెదవు పార్థివ కోపవశుండనౌచు నే
శాప మొసంగియున్న ననుఁ జయ్యనఁ గ్రోధముఁగూడఁ బొందదే?

వచ్చితి నందుచేత రఘువంశసుధాకరు నాశ్రయింపఁగా
సచ్చరితా స్వపుత్రకుని సత్యపరాక్రము రాము శూరునిన్
గుచ్చుగఁ బిళ్ళజుట్టు గల కోమలు మీ సుకుమారుజ్యేష్ఠు నా
కిచ్చిన రాక్షసుల్ మడియరే త్రుటి రాముని నా కొసంగుమా.

ఏమని యెంతువో రఘుపతీ భవదీయ సుకుమారుఁగూర్చి మీ
రాముఁడు దివ్యతేజమున రక్కసులందఱ విఘ్నకారులన్
భూమినిగూల్ప శక్తుఁడు, నమోఘబలుండును, నాదు రక్షణన్
క్షేమము గల్గు నిశ్చయము శ్రేయమెగూర్తు ననేకరీతులన్.

ముల్లోకంబుల ఖ్యాతిఁ బొందఁగలుగున్ ముమ్మాటికిన్నమ్ము మీ
విల్లున్ రాముఁడుపూనుచో నిరువురున్ వేపాఱరే నిల్తురే
తెల్లంబియ్యది వారి ప్రాణహరుఁడౌ ధీరుండు రాముండె, సం
ధిల్లెన్ మృత్యువు వీర్య గర్వితులకెంతే పాపులౌ వారికిన్.

ప్రతిన యొనర్చుచుంటినిదె రామునొసంగి రాక్షసద్వయిన్
హత మొనరించినట్లె, భవదాత్మఁ దలంపకు పుత్రమైత్రి, నే
నతఁడెవడో యెఱుంగుదు మహాత్ముఁడు రాముఁడు సత్యవిక్రముం
డతనిని మీ గురుండెఱుగు నా మునికోటి యెఱుంగు నాతనిన్.

అరమఱలేక నీదు సచివాగ్రణులందఱు నా వసిష్ఠుఁడున్
వరగుణ రామచంద్రు రఘువర్యునిఁ బంప ననుగ్రహించినన్
ధరణిపయిన్ భవదీయ కృతధర్మము కీర్తియు శాశ్వతంబుగా
వరల నభీప్సితంబయిన పార్థివ రాముని నా కొసంగుమా.

తడవొనరింతువో క్రతువిధంబున వేళ యతిక్రమించు నీ
యెడఁద విచారమొందఁదగునే దశరాత్రముతైనఁ జాలునా
కిడనలినాకు భద్రమగు నెంతయు నీకు, సునిశ్చయంబ యీ
కడపటి కోర్కెఁ దీర్పఁదగు క్ష్మాధవ! రాముని నా కొసంగుమా.

మునివరుమాట లన్విని ప్రమోదముఁ జూపక భూభుజుండు నె
మ్మనమునఁ గించనొంది క్షణమాత్రము సంజ్ఞనుగూడ వీడి యే
మనవలెనో యెఱుంగక భయంబునఁ గంపితగాత్రుఁడౌచుఁ బ
ల్కెను వినయంబుతోడ ఋషికిన్ మదిమెల్లనఁ గూడఁదీయుచున్.

ఆలము సేయఁగాఁ గలుగునా? పదునాఱవయేడు పోని నా
బాలుఁడు నా ప్రియుండు పలువత్సరముల్ తపముండి గాంచియే
వేళను వీడనట్టి యరవింద దళాక్షుఁడు జ్యేష్ఠపుత్రునే
యేల వరించినావు తగునే యిది రామునిబాయ కౌశికా

రక్కసిమూక యెల్లరు పరంపరగాభువిఁ ద్రెళ్లరొక్కొ నే
నొక్కఁడవత్తు, నేనె ధను వూనుదు నాదు మహాబలంబు నీ
ప్రక్కన నిల్చు యాగము సురక్షితమయ్యెడి నడ్డురాఁగలాఁ
డుక్కటి నల్లె సంశయమునొందకు రాముఁడు రాఁడు కౌశికా.

పదియును నాఱయేండ్లు గలవాఁడు, కృతాస్త్రబలుండు గాఁడు, కో
విదుఁడును గాఁడు యుద్ధమున, వెంటగొనన్ బని తీఱునే? విశా
రదుఁడును గాఁడు మాయ రణరంగములం దసురాళిరీతి, నే
బ్రదుక ముహూర్తమేన్ విడిచి రాముని, రాముఁడు రాఁడు కౌశికా.

అయినన్ కాదని యందువేని రఘురామాసక్తతన్ నేనునున్
బయనంబయ్యెద నా బలంబుఁగొని విశ్వామిత్ర పోకార్పనీ
పయినుంకించెడి యజ్ఞవిఘ్నకరులన్ వారెవ్వరో సర్వమున్
దయతోఁ దెల్పిన నట్టి వ్యూహముల సంధానమ్ము గావించెదన్.

అనగ నృపుండు మౌని యిటులాడగ సాగె నృపాలసర్వమున్
వినుము, "పులస్త్య వంశజుఁడు వీరుఁడు రాక్షసరాజు రావణుం
డనునొక దైత్యుడుండు, నజుడాతనికిచ్చె వరంబు, దాననే
చును భువనత్రయం బెపుడు, స్రుక్కెడు లోకము వానిచేష్టలన్.

విశ్రవసుమౌని పుత్రుకు చేరుతమ్ము
దైత్యనాథుని నెఱుఁగవే తరలివచ్చు
నతఁడె మఖవిఘ్న మొనరింప నతఁడు రాని
పట్ల మారీచుని సుబాహుఁ బంపుచుండు.

విశ్వనాథ మధ్యాక్కఱలు

నందమూరు శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

శ్రీ పరిణామరేఖా మనోహరస్మేర కపోల
గోపీసిత కపోల కలితనఖర సంకుమదజంబాల
కాపట్యరహిత ధీకృత సుధాగీతికాలోల! నవగ
పీపాల! నందమూర్నిలయ! సంతాన వేణుగోపాల.

సౌందర్యమనునట్టి నాకు తెలిసినసరకు నీనుండి
యైందవ మృదుకలాహసన! సరఫరాయైనది స్వామి
ముందటిజన్మలో నేను నీ వేణు ముగ్ధనాదమ్ము
బిందువై నందమూర్నిలయ సంతాన వేణుగోపాల.

ఆలోచనము చేయ నునుపుతేరిన దవు ముడిసరకు
గా లోన నను నేన తెలిసికొంటిని కాళియదమన
లోలముల్ పదములఁ ద్రొక్కు నాల్కవెళ్లుకొనివచ్చు
వేళగా నందమూర్నిలయ! సంతాన వేణుగోపాల.

నిజమేమి జన్మయెత్తించినావొ కానీ! ముకుంద! గజి
బిజియైన జన్మ నాచేత నుక్కిరి బిక్కిరయ్యె దన
యజనాథ! యిన్నాళ్లు సరియ వృద్ధుఁడనైతినే యేమి
వృజినంబు నందమూర్నిలయ! సంతాన వేణుగోపాల.

వడిగ నిజంబుగా నేను నీవ్వనఁ బాలింపుమనుచు
నడుగుట న్యాయమో కాదొ తెలియ నయస్మాదృశు లిటు
లడుగుటయున్నది నీకు నాకు నీయా యెల్లబాధ
విడుదలయైనది నందమూర్నిలయ! సంతాన వేణుగోపాల.

ఇక్షువై పట్టరానంతగా విసువెత్తించు నట్టి
లక్షణమున్నది దీనిలోఁ బండ్లలాగుట నమలు
టక్షులు బెదర గీరుకొనిపోవుట యఖిలంబు పెద్ద
విక్షతి నందమూర్నిలయ! సంతాన వేణుగోపాల.

ఇంత పీటవెట్టికొని కూర్చున్న యీగడ్డు కాము
సంతాన మల్ప ప్రయత్నవశమున సమసిపోయెడు నొ
క్రంతలై ప్రీలిపోవలయు నీ వేణుగాన ధారలకు
వింతలై నందమూర్నిలయ! సంతాన వేణుగోపాల

మనసులోఁ గట్టిన మూర్తిగా నీవు మన్నింతువెపుడు
కనులకుఁ గట్టిన మూర్తిగానీవు కన్పింపవెపుడు
మనసునుండి కనులవరకు వ్యాపించి మన్నింపవయ్యా
వినవయ్యా నందమూర్నిలయ! సంతాన వేణుగోపాల

మున్నంగిలో నున్న వేణుగోపాలమూర్తి సన్నుతులు
నిన్ను మనస్సులోఁ బెట్టికొని యవి నిర్గమించినవి
మున్ను స్వప్నమునందుఁ జేయు వాగ్దానమును జేసిపెట్టు
విన్నది నందమూర్నిలయ! సంతాన వేణుగోపాల

ఈతనూ నిర్మితి తలఁచినకొలంది నేవమ్ముకలుగు
చేతమ్మునందుఁ దాత్కాలికము వాంఛచేత నిద్దానఁ
బ్రీతిఘటిల్లెడు మరియు నంతలో భీతిఘటిల్లు
వీతార్తి నందమూర్నిలయ! సంతాన వేణుగోపాల.

*

ఆంధ్రతర్కసంగ్రహము

శ్రీ కుప్పా వైరాగిశాస్త్రి

౪

ఉపమాన పరిచ్ఛేదము

మూ॥ ఉపమితి కరణముపమానం। సంజ్ఞాసంజ్ఞి సంబంధజ్ఞాన ముపమితిః। తత్కరణం సాదృశ్యజ్ఞానం।అతిదేశవాక్యార్థస్మరణంవ్యాపారః.

అనుమాన నిరూపణ అయినతరువాత ఉపమానమును నిరూపణ చేయుచున్నారు. ఉపమితికి కరణమైనది ఉపమానము లోగడ చెప్పినట్లుగా కరణమనగా వ్యాపారవత్ అసాధారణకారణముగాన ఉపమితియందలి ఉపమితిత్వావచ్ఛిన్నమైన ఏకార్యతగలదో ఆకార్యత చేసి రూపితమైన కారణతకలిగియుండి వ్యాపారము కలిగియుండుట ఉపమానమునకు లక్షణము. గవయమృగము గవయపదముచేత చెప్పదగ్గది అను జ్ఞానము ఉపమితిజ్ఞానము దీనికి కరణమైన గోవుకు సదృశమైనది (ఆవుమాదిరిగా ఉండునది) గవయపదముచేత చెప్పదగినది అను జ్ఞానము ఉపమానము. గోసదృశమైనది. గవయపదముచే చెప్పదగినది అను స్మృతి (దీనిని అతిదేశనివాక్యార్థము యొక్క స్మృతియని అందురు.)

వ్యాపారము-లక్షణసమన్వయము-ఉపమితి, ఇది (గవయమృగము) గవయపదముచే చెప్పదగినది అను ఆకారముగల జ్ఞానము. దానియందలి ఉపమితిత్వా వచ్ఛిన్నమైన కార్యతచే నిరూపితమైన కారణత గోదృశమైనది గవయపదముచే చెప్పబడును అనుజ్ఞానమందుగలదు. దానికి ఆశ్రయము ఉపమానజ్ఞానము. అటులనే గోదృశమైనది గవయపదముచే చెప్పబడును అనుస్మృతి, గోదృశమైనది గవయపదముచే చెప్పబడును అనుజ్ఞానమువలన కలుగును ఇది వ్యాపారము. దీనికి కారణము ఉపమానమైనందున వ్యాపారము కలదై ఉపమితికి కారణమగుటవలన గోదృశమైనది (ఆవువలె ఉండునది) గవయపదముచే చెప్పబడును అను ఉపమానమందు లక్షణసమన్వయమైనది.

ఉపమానలక్షణములో ఘటకమైన ఉపమితి నిగూర్చి చెప్పుచున్నాడు. సంజ్ఞాసంజ్ఞి సంబంధ అః సంజ్ఞా అనగా పదము సంజ్ఞిఅర్థము వాట్ల యొక్క సంబంధము విషయముగా గలజ్ఞానము సంజ్ఞాసంజ్ఞి సంబంధజ్ఞానము (అయంగవయ పదవాచ్యః) ఈ మృగము గవయపదముచే చెప్పబడును అనునది ఉపమితిజ్ఞానము. దానికి కరణమైనది గోవువలె ఉండునది గవయమృగము అను జ్ఞానము. దీనిని అతిదేశవాక్య జ్ఞానమని చెప్పుదురు అది దేశవాక్యస్మృతి వ్యాపారము-

మూ॥ తథాహి, కశ్చిత్ గవయపదార్థమ జానన్ కుతశ్చిదారణ్యక పురుషాత్ గోసదృశోగవయః ఇతిశ్రుత్వావనంగతః వాక్యార్థం స్మరన్ గోసదృశపిండం పశ్యతి, తదనంతరం అయం గవయ పదవాచ్యః ఇత్యుపమితిరుత్పద్యతే-

ఇత్యుపమితి పరిచ్ఛేదస్సమాప్తః

ఆ ఉపమితి స్వరూపమును ఉపపాదన చేయుచున్నాడు. ఒకానొకడు గవయ అను పదముయొక్క అర్థమును తెలిసికొనినవాడు అడవులలో తిరుగు మనుష్యునివలన గవయ మృగము గోవు (ఆవు) మాదిరి ఉండును అని తెలిసికొని అరణ్యమునకు పోయి ఆవు మాదిరి ఉండునది గ వ య మృ గ ము అను మాటను స్మరించుకొనుచు ఆవుమాదిరిగా ఉండు ఒక మృగమును చూచును. తరువాత ఇది గవయపదముచేత చెప్పబడునది అను ఉపమితి కలవాడగును

ఉపమానపరిచ్ఛేదము సమాప్తము

శబ్దపరిచ్ఛేదము

మూ॥ ఆప్తవాక్యంశబ్దః । ఆప్తస్తు యథార్థవక్తా. వాక్యంతుపదసమూహః । శక్తంపదం-అస్మాత్పదాదయమర్థో బోద్ధవ్య ఇతీశ్వరసంకేతశ్శక్తిః

క్రమప్రాప్తమైన శబ్దరూప ప్రమాణమును నిరూపణ చేయుచున్నాడు.

ఆప్తునిచేత పలకబడునది యువ్వాక్యమైన దియు శబ్దము ఆప్తునిచేత చెప్పబడి వాక్యమగుట ప్రమాణశబ్దమునకు లక్షణము. ఆవుని తీసుకొనిరా అను ప్రమాణశబ్దములో ఆప్తునిచేత పలకబడుటయు శబ్దమగుటయు రెండు విశేషణములుకలవు గాన లక్షణ సమన్వయమైనది ఇచ్చట ఆప్తునిచేత పలకబడుట మాత్రమే లక్షణముగా చెప్పిన జ, బ, గ, డ, ద,శఅను ఆప్తునిచే పలకబడిన శబ్దమందు అతివ్యాప్తివచ్చును. జ, బ, గ, డ, ద, శఅను వాట్ల వలన శబ్దబోధ కలుగదుగాన అవి లక్ష్యము గాదు. వాక్యమగుటవాట్లలో లేదుగాన అతివ్యాప్తి వారించును. వాక్యమగుట మాత్రమే లక్షణముగా చెప్పిన ఆప్తుడుగాని వాడు పలికిన శబ్దములయందు అతివ్యాప్తి వచ్చును. గాన ఉభయము అవసరమే-ఆప్తుడు అనగా యధార్థ జ్ఞానమునకు కారణమైన శబ్దమును ప్రయోగించువాడు గాన ఒకడు పర్వతము నిప్పుగలది అని యధార్థజ్ఞానమునకు కారణమైన వాక్యమును ప్రయోగించుటచేత ఆప్తుడు అయి తరువాత నీరు నిప్పుగలది అని ప్రయోగించిన యడల ఆ వాక్యముగూడా ఆప్తునిచేతనే పలకబడుటచే నీరు నిప్పుగలది అను వాక్యమందు అతివ్యాప్తి వచ్చును అనగా ప్రమాణశబ్దము కావలసివచ్చును అందుకొరకు వాక్యత్వమనునది ఈ విధముగా పరిష్కరించవలెను ప్రస్తుతము ప్రయోగించిన వాక్యమునకు కారణమైన యధార్థజ్ఞానమువల్ల పుట్టినదై ఆప్తునిచే పలుకబడుట దానిఅర్థము అని చెప్పిన ప్రకృతదోషము వారించవచ్చును.

ఆప్తుడు అనగా యధార్థమును పలుకువాడు

వాక్యమనగా పదముల సమూహము అనగా గుంపు.

శక్తి కలిగినది (శక్తం) పదము.

శక్తి యనగా యీ పదము వలన యీ అర్థము బోధించబడవలయును (యీ పదము వలన కలిగినబోధలో యీఅర్థము విషయమగుగాక) అను ఈశ్వరునియొక్క సంకేతము. సంకేతమనగా కోరిక.

ఈ పదమువలన కలిగిన బోధవిషయము ఈ అర్థము అగుగాక అను ఇచ్ఛయందు ఈ అర్థము విశేష్యము బోధవిషయత్వము విశేషణము అనగా ప్రకారము ప్రకారమందు ప్రకారతయను ధర్మము కలదు విశేష్యమందు విశేష్యతయను ధర్మముగూడా గలదు విశేష్యత, ప్రకారతా నిరూపితముగాన ఈ పదజన్య (ఈ పదమువలన కలిగిన) బోధ విషయత్వమందలి ప్రకారతచే నిరూపితమైన, యే, ఈ అర్థమందలి విశేష్యత కలదో ఆ విశేష్యతా నిరూపకమైన ఈశ్వరునియొక్క ఇచ్ఛశక్తి. శక్తికలిగి యుండుట శక్తత్వము. శక్తము పదము. పదమందు శక్తిస్వనిరూపిత ముఖ్య విశేష్యతానిరూపిత ప్రకారతానిరూపిత ప్రకారతానిరూపిత ప్రకారతానిరూపిత ప్రకారతాశ్రయత్వ సంబంధముచే యుండును. శక్తిపదమునందు ఉండుట చెప్పబడుచుండుటచే స్వపదముచే శక్తిని తీసుకొనిన యడల స్వన్నిరూపితమైన ముఖ్య విశేష్యత అర్థమందుగలదు. తన్నిరూపితమైన ప్రకారత బోధవిషయత్వమందు గలదు. తన్నిరూపితమైన ప్రకారత బోధయందుగలదు. తన్నిరూపిత ప్రకారత పదజన్యత్వమందు గలదు. తన్నిరూపిత ప్రకారతపదమందు గలదు గాన తదాశ్రయత్వము పదమందు ఉండుటచే స్వనిరూపిత ముఖ్యవిశేష్యతా నిరూపితప్రకారతా నిరూపితప్రకారతా నిరూపితప్రకారతా నిరూపితప్రకారతాశ్రయత్వ సంబంధముచే శక్తి పదమందుగలదు. ఇదియే శక్తికలిగి యుండుట. శక్తికలిగి యుండుటయే శక్తత్వమని చెప్పబడును గాన పదముశక్తము. శక్తిపదమునకు అర్థమునకు ఉండు సంబం

ధము. సంబంధము ఎప్పుడు రెండు వస్తువుల యందు ఉండును గాని పదమునందు పైన చెప్పినరీతిగా శక్తియున్నది. శక్తిచే నిరూపితమైన ముఖ్యవిశేష్యతఅర్థమందున్నది. గాన స్వనిరూపిత ముఖ్యవిశేష్యత్వ సంబంధముచే శక్తికలిగియుండుట శక్యత్వమని చెప్పబడును అర్థము శక్యముగాన స్వనిరూపిత ముఖ్యవిశేష్యత్వము అర్థమందుగలదు ఈ పదజన్యబోధ విషయము యీ అర్థము అగుగాక అను ఈశ్వరుని ఇచ్ఛలో అర్థము ముఖ్యవిశేష్యము - గాన అర్థమందు సమన్వయమైనది ఈ నైయ్యాయిక మతములో పదము, శక్తము లాక్షణికమని రెండు విధములు శక్తిచే బోధించబడు అర్థము శక్యమని, లక్షణచే బోధించబడు అర్థము లక్ష్యమని రెండువిధములు. లక్షణయనగా శక్యసంబంధము గంగానది యందు గొల్లపల్లి అనుచోటు గంగానదికి నీటిప్రవాహము అర్థమగుటచే ప్రవాహమందు పల్లియుండదు గాన గంగానది యందు గొల్లపల్లి అనుచోట బోధ కలుగదు అందుచేత అచ్చట లాక్షణికబోధ చెప్పవలయును లక్షణయనగా శక్యసంబంధముగా చెప్పితిమి గాన గంగా పదమునకు గంగాప్రవాహము అర్థమైన దాని సంబంధము తీరమందుగలదు. గాన లక్షణచే శక్యసంబంధమై తీర (ఒడ్డు) బోధకలిగి గంగ ఒడ్డున గొల్లపల్లి అను బోధకలుగును

మూ॥ ఆకాంక్షాయోగ్యతా సన్నిధిశ్చ, వాక్యార్థ జ్ఞానహేతుః। పదస్యపదాన్తర వ్యతిరేకప్రయుక్త అన్వయాననుభావకత్వం ఆకాంక్షా-

శాబ్దబోధకు సామగ్రిని చెప్పుచున్నాడు ఆకాంక్ష అనువాట్లచేత సన్నిధిశ్చ, అనుచోట చకారమువలన మూలములో చెప్పని పదము వలనకలిగిన పదార్థ ఉపస్థితి, తాత్పర్యము మొదలగునవి గ్రహించవలయును ఆకాంక్షను నిరూపించుచున్నాడు పదస్యయని. యే పదము వలన బోధ కలుగకపోవుట యేపదాంతరము లేకపోవుటవలన జరుగుచున్నదో, మిక్కిలి ముందు ఉండుట మిక్కిలి వెనక యుండుట అను ఈ రెండు సంబంధములలో ఏదోఒక సంబంధముచే ఆ పదమందు ఆ పదాంతరము ఉండుట ఆకాంక్షయని అర్థము

ఘటమ్ (ఘటం) ఘటమును అనుచోట ఘటపదము తరువాత అమ్ అనుపదముగలదు దానికి తెలుగులో, ను, అని ద్వితీయావిభక్తి అర్థము ఘటపదము తరువాత అమ్ పదము (అనగా ఘటం అని పలికిన) ఉన్నచో ఘటమందలి కర్మత్వము (అమ్ అను ద్వితీయా విభక్తికి కర్మత్వము అర్థము) అను బోధ కలుగును. అటుల లేక అమ్, ఘట అని ఉచ్చరించినచో ఘటమందలి కర్మత్వము అని బోధ కలుగదు అటులనే గోవును తీసుకురా అనుచోట గోవును అనగా గోవుయందలి కర్మత్వబోధ కలుగును గాన గోపదము తరువాత,ను,అను పదము ఉన్ననే అట్టి బోధ కలుగును గోవు యందలి కర్మత్వము అను బోధ కలుగకపోవుట, ను, అను పదము గోవు అను పదము తరువాత లేకపోవుట వలన జరుగుచుండుట చేత గోవు అను పదమునందు, ను, అను పదము మిక్కిలి తరువాత ఉండుట అను సంబంధముచే ఉండే ఆకాంక్ష

మూ॥ అర్థాఽబాధో యోగ్యత

అర్థమునకు బాధ లేకపోవుట యోగ్యత యని చెప్పబడును

మూ॥ పదానామవిలంబేన ఉచ్చారణం సన్నిధిః

పదములకు విలంబము లేకుండగా ఉచ్చరించుట సన్నిధియని- చెప్పబడును

మూ॥ ఆకాంక్షారహితం వాక్యం నప్రమాణం యథాగౌరశ్వ పురుషోహస్తేతి।

గోవుగుఱ్ఱముపురుషుడుఏనుగఅను వాక్యము ప్రమాణముగాదు ఆకాంక్ష లేకపోవుట చేత

మూ। అగ్నినాసిం చ తీతివాక్యం నప్రమాణం యోగ్యతా విరహాత్-

నిప్పుచేత తడుపుచున్నాడు అను వాక్యము ప్రమాణముగాదు, అనగా బోధను కలుగజేయ లేదు యోగ్యతలేదు గనుక యోగ్యతయనగా అర్థమునకు బాధ లేకపోవుటయే గాన ప్రకృతము నిప్పుచేతడుపబడుట సంభవించనందున

అర్థమునకు బాధ గలదు. బాధ లేకపోవుట లేదు గాన యోగ్యతలేదు.

మూ॥ ప్రహరే ప్రహరే అసమోచ్చరితానిగామాన యేత్యాది వాక్యాని న ప్రమాణం.

ప్రతి ఝాముకు ఒక్కొక్క పదము విడి విడిగా పలికిన ఆ పదముగూడా పదముల సాన్నిధ్యము లేనందున ప్రమాణము గాదు

మూ॥ వాక్యం ద్వివిధం వైదికం లౌకికంచేతి। వైదికమీశ్వరోక్తత్వాత్ సర్వం ప్రమాణం। లౌకికంతు ఆప్తవాక్యం ప్రమాణం అన్యద ప్రమాణం । వాక్యార్థజ్ఞానం శాబ్దజ్ఞానం- తత్కరణం శబ్దః । ఏవం యథార్థానుభవో నిరూపితః.

వాక్యము వైదికమని లౌకికమని రెండు విధములు వైదికవాక్యమనగా వేదము. ఆ వేదము ఈశ్వరోక్తము గనుక సర్వము ప్రమాణము. లౌకికము ఆప్తునియొక్క వాక్యమే ప్రమాణము, ఇతర వాక్యము అప్రమాణము ఇంతటితో యధార్థానుభవ నిరూపణ పూర్తి అయినది

శబ్దపరచ్ఛేదము సమాప్తము

అయధార్థానుభవ నిరూపణము

మూ॥ అయధార్థానుభవ స్త్రివిధః । సంశయ విపర్యయ తర్కభేదాత్ । ఏకస్మిన్ధర్మిణి విరుద్ధ నానాధర్మప్రకారకజ్ఞానం సంశయః । యథా స్థాణుర్వాపురుషోవా-

అయధార్థానుభవమును నిరూపణ చేయుచున్నారు సంశయమని, విపర్యయమని, తర్కమని మూడురకములు.

ఒక ధర్మివిశేష్యమై విరుద్ధమైన రెండు ధర్మములు విశేషణములైన జ్ఞానము సంశయము ఎక్కువ వెలుగులేని ప్రదేశమందు ఒక చెట్టు మొదలును చూచి వీడు పురుషుడా కాదా అను సంశయములో వీడు అను ఒక ధర్మి విశేష్యము. పురుషత్వము పురుషత్వ అభావము (గాదా) అను రెండు విరుద్ధ ధర్మములు విశేషణములు. గాన ఒక ధర్మివిశేష్యమై విరుద్ధ నానాధర్మములు విశేషణములై జ్ఞానమగుట వీడు పురుషుడు అగునా కాదా అను సంశయములో కలదుగాన సమన్వయమైనది.

మూ॥ మిథ్యాజ్ఞానం విపర్యయః । యదాశుక్తౌ ఇదంరజతమితి ।

మిథ్యాజ్ఞానమే విపర్యయము, ముత్యపు చిప్పనుచూచి వెండియని భ్రమించుట విపర్యయము, భ్రమ, పర్యాయపదములు. దీని లక్షణము ప్రత్యక్ష పరిచ్ఛేదములో చెప్పబడినది.

మూ॥ వ్యాప్యారోపేణ వ్యాపకారోపస్తర్కః । యథా యదివహ్నిః నస్యాత్ తర్హిధూమోపి నస్యాత్ ।

వ్యాప్యారోపము వలన కలిగిన వ్యాపకారోపము తర్కము ఆరోపము అనగా భ్రమ. వ్యాప్యభ్రమ జన్యవ్యాపకభ్రమ తర్కము అని తాత్పర్యము. నిప్పు లేనిచో పొగ గూడా ఉండదు పర్వతము నిప్పుగలది. ధూమము వలన అచుచోట నిప్పు వ్యాపకము ధూమము వ్యాప్యము అటులనే నిప్పు అభావము, వ్యాప్యము ధూమాభావము వ్యాపకము వ్యాప్యమనగా కొద్దిచోట ఉండునది (న్యూనదేశవృత్తి) వ్యాపకము అనగా ఎక్కువచోట ఉండునది (అధికదేశవృత్తి) వ్యాప్యభ్రమ యనగా (యది వహ్నిఃనస్యాత్) నిప్పులేనిచో అనగా నిప్పుయొక్క అభావమే ఉన్నచో అనునది దీనివలన పొగగూడా లేకపోవుట (తర్హిధూమోపినస్యాత్) అను వ్యాపకభ్రమ కల్గును వ్యాప్యభ్రమ వలన వ్యాపకభ్రమ కలుగును గాన సమన్వయమైనది.

మూ॥ స్మృతి రపిద్వివిధా- యధార్థో అయధార్థశ్చేతి ప్రమాజన్యాయథార్థా । అప్రమాజన్యా అయధార్థా.

అనుభవనిరూపణ ఇంతవరకుచేసి స్మృతిని నిరూపించుచున్నారు ప్రమవలన కలిగిన స్మృతి యధార్థస్మృతి. భ్రమవలన కలిగిన స్మృతి అయధార్థస్మృతి- లోకములో ఒక వస్తువును చూచినతరువాత అనుభవము కలుగును ఆ అనుభవము నిజముకావచ్చు అబద్ధము కావచ్చును. నిజమైన అనుభవము యధార్థానుభవము. అబద్ధమైన అనుభవము అయధార్థాను

భవము వీట్లవలన కలిగిన స్మృతులుగూడా రెండు విధములు

మూ॥ సర్వేషామనుకూలతయా వేదనీయం. సుఖం.

అందరి యందలి ఇది నాకు అనుకూలమైనది అను జ్ఞానములో విశేష్యమైనది సుఖము. అందరు సుఖము నాకు అనుకూలమైనది అను జ్ఞానము కలవారు ఆ జ్ఞానము అందరియందు సమవాయ సంబంధముచేత ఉండును అందరియందు సమవాయ సంబంధముచే ఉన్న జ్ఞానము 'సుఖము నాకు అనుకూలమైనది అను జ్ఞానము' అందులో సుఖము విశేష్యము గాన సర్వులయందు సమవేతమైన జ్ఞానములో విశేష్యత్వము సుఖమందు కలదు గాన సమన్వయమైనది.

మూ॥ సర్వేషాం ప్రతికూలతయావేదనీయం దుఃఖమ్.

సర్వసమవేతమైన ప్రతికూలము ప్రకారముగాగల జ్ఞానములో విశేష్యమైనది దుఃఖము. అందరియందు సమవేతమైన ప్రతికూలత్వ ప్రకారకమైన జ్ఞానము ఏదియన దుఃఖము నాకు ప్రతికూలమైనది అను జ్ఞానము దానిలో దుఃఖము విశేష్యముగాన సమన్వయమైనది.

మూ॥ఇచ్ఛాకామః క్రోధోద్వేషః కృతిః ప్రయత్నః

ఇచ్ఛ యనగా కోరిక క్రోధమనగా ద్వేషము కృతియనగా ప్రయత్నము

మూ॥ విహితకర్మ జన్యోధర్మః

శాస్త్రవిహితమైన కర్మలవలన పుట్టునది ధర్మము

మూ॥ నిషిద్ధకర్మజన్యో అధర్మః.

నిషిద్ధకర్మ వలన కలిగినది అధర్మము.

కలంజ భక్షణాదులు (ఉల్లిపాయ వగైరా తినుట) నిషిద్ధకర్మలు వాట్లవలన అధర్మము పుట్టును. గాన నిషిద్ధకర్మ వలన పుట్టినదై గుణమగుట అధర్మలక్షణము విహితకర్మ వలన పుట్టినదై గుణమగుట ధర్మలక్షణము

మూ॥ బుద్ధ్యాదయోఽష్టా వాత్మమాత్రవృత్తి గుణాః బుద్ధీచ్ఛాప్రయత్నాః నిత్యాః అనిత్యాశ్చానిత్యాః ఈశ్వరస్య అనిత్యాః జీవస్య

బుద్ధి, సుఖదుఃఖ ఇచ్ఛా, ద్వేష, ప్రయత్న ధర్మ అధర్మములు ఎనిమిది ఆత్మయందుఉండు గుణములు బుద్ధి ఇచ్ఛా ప్రయత్నములు నిత్యములనియు అనిత్యములనియు రెండు విధములు ఈశ్వరుని బుద్ధి ఇచ్ఛాప్రయత్నములు నిత్యములు జీవుని బుద్ధి ఇచ్ఛాప్రయత్నములు అనిత్యములు

మూ॥ సంస్కారః త్రివిధః వేగోభావనా స్థితస్థాపకశ్చేతి, వేగఃపృధివ్యాది చతుష్టయమనోవృత్తిః.

సంస్కారము. వేగమని, భావనయని, స్థితస్థాపకమని మూడు విధములు వేగము పృధివి జలము తేజస్సు వాయువు మనస్సుల యందు ఉండును

మూ॥ అనుభవజన్యాస్మృతిహేతుః భావనా। ఆత్మ మాత్రవృత్తిః

భావనా అను సంస్కారమును నిరూపించుచున్నారు అనుభవము వలన పుట్టినదై స్మృతికి హేతువైనది భావన. భావనకు లక్షణమేమనగా అనుభవమువలన పుట్టినదై స్మృతికి హేతువగుట.

ప్రధమముగా అనుభవము కలుగును. తరువాత భావనా అను సంస్కారము కలుగును తరువాత స్మృతి కలుగును. అందుచేత సంస్కారము అనుభవమువలన పుట్టి స్మృతికి హేతువగుచున్నది. గాన సమన్వయమైనది.

మూ॥ అన్యధాకృతస్య పునస్తాదవస్థాపాదకః స్థితస్థాపకః। కటాదిపృధివీ మాత్రవృత్తి।

చాపను చుట్టి మరల విడదీసిన తరువాత మన ప్రయత్నములేకనే మరల చుట్టుకొనిపోవును. అ చుట్టుకొనిపోవుటయే స్థితస్థాపకము. చాప మొదలగు పృధివి యందు మాత్రమే యుండును

మూ॥ చలనాత్మకంకర్మ। ఊర్ధ్వదేశసంయోగ హేతురుత్క్షేపణం। అధోదేశసంయోగ హేతురపక్షేపణం। శరీర సన్నికృష్టహేతురాకుంచనం। శరీరవిప్రకృష్టహేతుః ప్రసారణం। అన్యత్సర్వంగమనం.

చలనమును కర్మగా చెప్పుదురు. ఉత్క్షేపణము పైకి ఎగురుట, అపక్షేపణము క్రిందకి పడుట, సమీపమునకు వచ్చుట ఆకుంచనము దూరమునకు పోవుట ప్రసారణము మిగిలిన కర్మలు గమనముగా చెప్పబడును

మూ॥ నిత్యమేకమనేకానుగతం సామాన్యం-ద్రవ్యగుణకర్మ వృత్తి. పరంసత్తా, అపరం ద్రవ్యత్వాది

క్రమప్రాప్తమైన సామాన్యమును నిరూపించుచున్నారు నిత్యమై, ఏకమై, అనేకములయందు సమవేతమగుట సామాన్యమునకు లక్షణము సామాన్యమనగా జాతి, జలమందు జలత్వము జాతి. ఈజలత్వము నిత్యము,అన్ని జలములయందు ఉన్న జలత్వము ఒక్కటియే గాన ఏకము జలములలో జలత్వము సమవేతమైనది. అనగా సమవాయ సంబంధముచేతయున్నది. అనేక సమవేతమైనదిగాన సమన్వయమైనది పరం అను సామాన్యము సత్తారూపమైనది అపరమను సామాన్యము ద్రవ్యత్వము, పృధివీత్వము, ఘటత్వము, మొదలుగాగలది. సత్తా అను జాతి ద్రవ్యగుణక్రియలయందు ఉండును గాన పరమని చెప్పబడుచున్నది

మూ॥ నిత్యద్రవ్య వృత్తయో వ్యావర్తకా విశేషాః

విశేషములను నిరూపించుచున్నారు నిత్యద్రవ్యమని నిత్యద్రవ్యములయందు ఉన్నవై వ్యావర్తకములయినవి విశేషములు. వీట్లను గురించి పై గ్రంధములో హెచ్చుగా చెప్పబడును

మూ॥ నిత్యసంబంధ స్సమవాయః। అయుత సిద్ధ వృత్తిః యయోర్మధ్యే ఏకమవినశ్య దవస్థమపరాశ్రితమేవావతిష్ఠతే దావయుతసిద్ధౌ । యథా అవయవావయవినౌ। గుణ గుణినౌ। క్రియాక్రియావన్తౌ । జాతివ్యక్తౌ విశేషనిత్యద్రవ్యేచేతి ।

నిత్యమై సంబంధమగుట సమవాయమునకు లక్షణము అయుతసిద్ధులయందు ఈ సమవాయ సంబంధము ఉండును. అయుతసిద్ధమనగా చెప్పుచున్నారు- యయోర్మధ్యేయని. యయోర్మధ్యే కుండకపాలము యీ రెంటిలో ఏకం కుండ,అవినశ్యదవస్థం నశించనిసమయమందు, అపరాశ్రితమేవ అవతిష్ఠతేకపాలమును ఆశ్రయించియున్నదో ఆకుండకపాలములు అయుతసిద్ధములు - అటులనే గుణముగుణి, అవయవము అవయవి, జాతివ్యక్తి, విశేషము నిత్యద్రవ్యములు అయుతసిద్ధములు

మూ॥ అనాదిః సాంతః ప్రాగభావః ఉత్పత్తేః పూర్వం కార్యస్య

ఆదిలేనిదై అంతముగల అభావము ప్రాగభావము కుండ పుట్టకపూర్వమునుంచి ఉండి కుండ పుట్టినవెంటనే కుండ ప్రాగభావము నశించును గాన కుండ ప్రాగభావమందు సమన్వయమైనది

మూ॥ సాధిరనంతః ప్రధ్వంసాభావః। ఉత్పత్తే రనంతరం కార్యస్య

పుట్టుకకలదై అంతములేనిది ప్రధ్వంసాభావమని తాత్పర్యము కుండను పగులగొట్టిన తరువాత కుండధ్వంస కలిగినది దానికి అంతములేదు గాన పుట్టినదై అంతములేకపోవుట కుండయొక్క నాశమందును కలదు గాన సమన్వయమైనది.

మూ॥ త్రైకాలిక సంసర్గాభావోఽత్యంతాభావః । యథాభూతలె ఘటోనాస్తి

మూడు కాలములయందు సంబంధము లేనిది అత్యంతాభావమని తాత్పర్యము భూమియందు ఘటములేదు అనునది కుండయొక్క అత్యంతాభావము,

మూ॥ తాదాత్మ్య సంబంధావచ్ఛిన్న ప్రతియోగితా కాభావో అన్యోన్యాభావః । యథాఘటః పటోనభవతీ.

కుండ వస్త్రముగాదు అను ప్రతీతి సిద్ధమైన అభావము అన్యోన్యాభావము కుండ, వస్త్రముగ్గాదు అనగా వస్త్రముయొక్క అన్యోన్యాభావము కుండ యందుగలదు అన్యోన్యాభావమునకు ప్రతియోగి వస్త్రము, వస్త్రమందు ప్రతియోగిత కలదు ఆ ప్రతియోగిత తాదాత్మ్యసంబంధావచ్ఛినమైనది గాన తాదాత్మ్య సంబంధావచ్ఛిన్నమైన ప్రతియోగితచే నిరూప

(మిగితా 84 వ పేజీలో)

ఆకుకూరలు

శ్రీ గూడూరి నమశ్శివాయ

ఆధునిక శాస్త్రయుగంలో ఆకుకూరల యందు ప్రజలకు మోజు ఎక్కువైంది. ఆకుకూరలలో విటమిన్సు అధికంగా ఉన్నవని, ప్రొటీన్సు, స్టార్చికూడా అధికమని ఏవో మాటలు చెపుతూ ఆధునిక శాస్త్రవేత్తలు ఆకుకూరలను ఆకాశానికి ఎత్తివేశారు. ఆబాలగోపాలం ఆకుకూరలను తినాలని, ఆకుకూరలను తినకపోతే మానవుని జీవితం అధోగతి పాలవుతుందని, నశించిపోతుందని, రోగాలకు కూపం అవుతుందని, అందరూ తప్పక ఆకుకూరలు తినాలని సలహా యిస్తున్నారు.

ఈసలహా ననుసరించి ఒక పాత్రికేయుడు ప్రత్యేకంగా ఆకుకూరల సంచిక ఒకటి వెలువరించాడు. ఆకుకూరల మహిమ అందు అనేక రీతుల వర్ణించబడినది. కూనేగారి ప్రకృతివైద్యం ప్రచారంలోకి వచ్చింతర్వాత ఆకుకూరలమీద, ఏకరసభుక్తంమీద మోజు ప్రబలింది. ఇంతటి ప్రభావంగల ఆకుకూరల విషయంలో ఆయుర్వేదం ఏమి చెప్పింది సింహావలోకనం చేయటమే యీ రచనలోని ముఖ్యోద్దేశం.

ఏకరస భోక్తృత్వాన్ని గూర్చి చెపుతూ అగ్నివేశ మహర్షి ఇలా వివరించారు.

"సర్వరసాభ్యాసో బలకరాణాం
ఏకరసాభ్యాసో దౌర్బల్యకరాణాం" అని.

తెనుగువారికి షడ్రసోపేతమైన భోజనం గౌరవప్రదమైంది. అతిముఖ్యమైంది. మనకు పడమటి నాగరకతా వ్యామోహం ప్రబలింతర్వాత ఏకరసాభ్యాసానికి అలవాటుపడ్డాం. కొంతమంది నాగరకులు అనుకునేవారు ఏకరసభోక్తృత్వాన్నే సమర్థిస్తున్నారు. ఆ ఏకరసాభ్యాసాన్ని అగ్నివేశ మహర్షులు శరీర దౌర్బల్యానికి కారణం అగునని నిషేధించారు. దీనినే సుశ్రుతాచార్యులు సూత్రస్థానంలో ఇలా వివరించారు.

"నచైకరససేవాయాం ప్రసజేత కదాచన,
శాకావరాన్న భూయిష్ఠ మమ్లంచన సమాచరేత్."

భోజనంలో ఎల్లప్పుడు ఒకే రసము నుపయోగించుటయందు ఆసక్తి కలిగి యుండరాదు. అన్ని రసములను భుజించవలయును. (అనగా మధురామ్లలవణ కటుతిక్త కషాయ రసములను ఆరు షడ్రసములు. ఈ ఆరు రసములుగల ఆహారము సమముగ సేవించవలయును.) అటులనే ఆకుకూరలను వెదురుబియ్యపు అన్నము మొదలగు అవరాన్నములను ఎక్కువగా తినరాదు. అవరాన్నములన అన్నముకన్న కూరను హెచ్చుగాతినుట అను అర్థముకూడా స్ఫురించును. అదికూడా నిషేధమే. అది ఒక ప్రమేహరోగులుదక్క అన్యులెవరూ తినరాదు. పుల్లని పదార్థములను కూడా అధికముగా తినరాదు. నారింజ నిమ్మ వగైరా పుల్లని రసములను భోజనాత్పూర్వము లేక ప్రాతఃకాలమున సేవించుటకూడా నిషేధించారు.

ఆకుకూరల విషయంలో ఆయుర్వేదం ఇలా చెప్పింది. ఆహారద్రవ్యములలోకెల్ల అతిహీనమైన గుణము కలిగినది ఆకుకూర అని. ఆకుకూరలతో ప్రత్యేకంగా భోజనం చేస్తే శరీరమునకు మూలస్తంభములైన ధాతువులు నశించిపోతాయి. ధాతువులు నశించిపోయిన శరీరం క్షయరోగానికి గురియౌతుంది. యోగరత్నాకర గ్రంథకర్త ఆకుకూరలను పరిచయంచేస్తూ ఇలా వివరించాడు.

"శాకేషుసర్వేషు వసన్తిరోగాః సహేతవోదేహ వినాశనాయ
తస్మాద్బుధశ్శాకవివర్జనం హికుర్యాత్తథామ్లేషుస ఏవదోషః."

సమస్తమైన ఆకుకూరలయందును రోగకారణములు కలిగియున్నవి. అవి దేహనాశనమునకు కారణములగుచున్నవి. అందువలన బుద్ధిమంతులు ఆకుకూరలను విడిచిపెట్టవల

యును పుల్లని వస్తువులయందుకూడా యీ దోషములే కలవు అని నిర్మొహమాటముగా చెప్పారు.

ఆకుకూరలలో క్షారగుణమున్నది. నిరంతరము అభ్యాసముగ ఆకుకూరలుపయోగించిన అకాలమున తలవెంట్రుకలు తెల్లబడును లేక ఊడిపోయి బట్టగట్టును. హృదయమున కత్తెరతో కత్తిరించిన విధమున బాధ జనించును పుంస్త్వమునకు హానికలిగి నపుంసకుడు కావచ్చును అనికూడా శాస్త్రజ్ఞులు వచించిరి ఆకుకూరలు ఎక్కువగా తిన్నా నిత్యమూ అలవాటుగాతిన్నా, అన్నముకన్న హెచ్చుగా తిన్నా శరీరమున కల సప్తధాతువులు కృశించి నశించిపోతాయి భావమిశ్రాచార్యుడు ఇలా చెప్పాడు

"ప్రాయశ్శాకాని సర్వాణి విష్టంభీని గురూణిచ రూక్షాణి బహువర్చాంసి సృష్టవిణ్మారుతానిచ."

ప్రాయికముగా ఆకుకూరలన్నియు విష్టంభము జేయును. విష్టంభమనగా వాతమును బంధించి పొట్ట ఉబ్బరించుట, గురుకరము శరీరమును ఆర్చును. మలమును హెచ్చు జేయును మలమును అనులోమనము జేయును.

శాకంభి నత్తివపుకస్థిని హంతినేత్రం
వర్ణం వినాశ యతిరక్త మథాపిశుక్రం
ప్రజ్ఞాక్షయంచ కురుతే పలితంచనూనం
హంతిస్మృతిం గతిమితి ప్రవదంతి తత్‌జ్ఞాః"

ఆకుకూరలు శరీరమును, ఎముకలను ఛేదించును (పగులగొట్టును,) దృష్టినినశింపజేయును. శరీరకాంతిని నశింపజేయును రక్తమును, శుక్రమును, ప్రజ్ఞను క్షీణింపజేయును అకాలముగ వెంట్రుకలు నరయునట్లు చేయును మందమతిని జేయును. గమనశక్తిని పోగొట్టును అని శాకకోవిదులు నుడివిరి

శరీరంమిథ్య జగత్తుమిథ్య అనే బైరాగులు, బ్రహ్మచారులు, సన్యాసులు, వృద్ధులు, శరీరంలో అతిగా 2,3 వందల పౌనులకొవ్వు పెంచుకొన్న అతి శరీరులు ఆకుకూరలు తింటే తినవచ్చును గాని గృహస్థు, సంతానకాములు, యౌవనవంతులు, బలాన్ని అపేక్షించువారు, ఆకుకూరలను తినరాదు ఆకుకూరలలో వంశాభివృద్ధికి మూలకారణమైన శుక్రధాతువు నశింపజేయు గుణము కలదు శుక్రమే నశించిన సత్సంతానము కలుగదుగదా? రోగములకు కారణమై దేహమే నశించిపోగలదు. ఈవిషయాన్నే భావమిశ్రితుడు ఖండితంగా వివరించి చెప్పాడు

ఆహారములలో హితమైనవి, అహితమైనవి అని రెండు విధములు. శరీరమున కల త్రిధాతువులను చెడనీయక క్షీణించనీయక సమస్థితిలో నుంచునవి హితమైనవి పథ్యకరములు వీటిని ఎల్లప్పుడు అందరూ తినవచ్చును. మరియొకటి దోషములను సమస్థితికి తీసుకవచ్చి శరీరము నశించకుండా కాపాడునవి ఈ రెండు రకములైన ఆహారములను మనము సేవించవచ్చును కాని ఆకుకూరలు మాత్రము యీ రెండు పద్ధతులకు సంబంధించక మూడవమార్గమును అనుసరించాయి సమస్థితిలోనున్న ధాతువులను వ్యత్యస్తము చేయునవి వ్యత్యస్తముగా నున్నవానిని మరింత ప్రకోపింపజేసి దేహమును నాశనము చేయునవి ఈజాతికిచెందిన ఆహారము ఆకుకూరలు అందువలననే ఆయుర్వేదమతమున ఆకుకూరల నిషేధము జరిగింది

ఆకుకూరలను సేవించుటవల్ల ఆడవాళ్లకు కూడా చాలా అపకారము చేయునని బసవరాజు వృషరాజీయంలో అసృగ్దరప్రకరణంలో చెప్పాడు ఆకుకూరలు అతిగాతింటే ఆడవాళ్లకు బట్టవిడుపువ్యాధి (రక్తప్రదరం) అనే వ్యాధి వస్తోందని వివరించారు

శాకములలో సూప్యశాకములని కొన్ని కలవనిచరకమున శింబీధాన్యవర్గములో చెప్పబడింది వీనిని పప్పుపులుసు కూరలుగా నేడు మనం వ్యవహరిస్తూన్నాము.

అవియేవన బ్రాహ్మసుష్టిక, చిల్లి శాకం. గిమ్మిఆకు, ప్రొద్దుతిరుగుడు, ఆనపాకు పొన్నగంటి పుత్రజీవికూర, లొట్టాక (తోట కూరలో భేదము) పాలంక్యశాకము, పెరుగు తోటకూర, కడిమికూర, ఆవకూర, కుసుంబా కూర, నేలదిరిసెన, లక్షణశాకం, తగిరిసె, నల్లతులసి. బావంచీఆకు సీమపొన్నగంటి, హంసపాది, కొయ్యతోటకూర మొదలైనవి. ఈ ఆకుకూరలన్నియు గురుగుణముకలవి. రూక్షమైన గుణముకలవి ఇవి కడుపులో గడబిడచేసి జీర్ణమగును ఇవి విరేచనబద్ధము శీతముకూడా చేయును.

"శాకం గురుంచరూక్షంచ ప్రాయోవిష్టభ్య జీర్యతి."

అన్నారు అగ్నివేశులు

భావమిశ్రాచార్యులు పై ఆకుకూరల గూర్చి నిందావాక్యములను చెప్పిన తరువాత ఆకుకూరల విశిష్టతను ఇలా పేర్కొన్నారు "ఏతానిశాక నిందకాని వచనాని సామాన్యాని అధశాకేషు విశిష్టానివచనాని "వాటిని కొన్ని వివరిస్తాను

పిత్తాతిసారమునందు మర్రి రావి అత్తి జువ్వి తామర మొదలగువాని చిగుళ్లు కూర వండి పెట్టవచ్చును ఇవి మలమును స్తంభింప జేయును. కుసుమకూర పిత్తమును వృద్ధి చేయును ఆవకూర త్రిదోషములను వృద్ధి చేయును మలమూత్రములను బంధించును గురుగుణముకలది నేత్రములకు చెరుపు చేయును తాపమును రుచిని కలిగించును.

చక్రవర్తికూర (గునుగుకూర) దీపనపాచనములను చేయును. తీయగానుండును. క్షారముకలది రక్తదోషమును హరించి శుక్రవృద్ధి చేయును ప్లీహదోషమును, మొలలవ్యాధిని, క్రిములను, పిత్తదోషమును పోగొట్టి బలము చేయును

పాలకూర. దీనిని మనుబాల అనికూడవ్యవహరింతురు. సంస్కృతమున జీవంతి అని చెప్పబడుచున్నది తెలంగాణమున ఒక రకమైన పాలకూర వాడుకలోనున్నది శాస్త్రమున చెప్పిన పాలకూరకు దానికి తేడా కన్పించుచున్నది. తెలంగాణపు కూర నీరు కల్గించుచున్నది. మనుబాల బందరు ప్రాంతమున లభించుచున్నది ఇది శరీరమునకు చాలా మేలుచేయును దీనిని బోలిన ఆకు కూర మరియొకటిలేదు. ఈ పాలకూర నేత్రములకు హితమైనది తీయగా నుండును మంచి రుచికలది త్రిదోషములను హరించును దోషముల సమస్థితికి తెచ్చును. శీతవీర్యము కలది. దీనినిగూర్చి శాస్త్రజ్ఞులు "చక్షుష్యా స్వదోషఘ్నీ జీవన్తీ మధురా హిమా శాకానాం ప్రవరాస్యా నాద్వితీయాకించిదేవతు."

ఆకుకూరలలో మనుబాలకూర (పాలకూర) ఉత్తమమైనది దీని తర్వాత 'చాదరాసి' కూర ఇది తీపి చిరుచేదు కలది వేడి చేయును మూలవ్యాధులకు మంచిది మూత్రకృచ్ఛ్రమను బో జేయును. చర్మరోగములయందు పథ్యమైనది ఎలుక విషమును హరించును నులిపురుగులను పోగొట్టును. నీరసమును తగ్గించును ప్రసూతి స్త్రీలకు మైలరక్తము అతిగా అగుచున్నపుడు ఆపును. ఋతుబద్ధము చేయును. విరేచనకారి. వాతహరము. చర్మరోగములయందు పథ్యమైనది. ప్రమేహములను హరించును

చిర్రికూర. బోదవ్యాధులున్న ప్రాంతమున తిరుగుతూ అచట నీరు తాగుతూ ఆ ప్రాంతముల వంకాయ మొదలగు కూరలు తింటూంటే బోదజ్వరం వస్తుంది. తర్వాత కాలువాచి బోదకాలు అవుతుంది. అట్టి స్థితిలో చిర్రికూర తింటే అట్టి అనుమానమును రాహిత్యము చేస్తుంది బోదక్రిములను విషక్రిములను హరించుటలో చిర్రికూర శ్రేష్ఠమైంది వాతప్రకోపమున మలబద్ధమున చిర్రికూర తినుచుండిన మంచి గుణము చేయును. కోష్ఠగతమైన వాయువును, పేగులయందు బద్ధమైన వాతమును వెలికిదెచ్చును. దూష్యమైన అపానవాతమును సమస్థితికి దెచ్చును చిర్రికూర స్థావరజంగమ విష

ములను హరించును. (విషమేదైనా తిన్నచో దానిని హరించునని భావము) చిర్రికూర శీతవీర్యము, మధురవిపాకము, రూక్షగుణ ముకలది. రక్తపిత్తము అతిసారము, దగ్గు ఆయాసము, త్రిదోషములను హరించును. జ్వరపడి లేచినవారికి పథ్యము. చిర్రికూర అగ్నిదీప్తిని కలుగ జేయును. రసఘట్లను విప్పును. నాభితిన్న విషమును హరించును. మలమూత్రముల జారీచేయును. రక్తప్రదర ముల కట్టును. ఋతుబద్ధము చేయును.

పూర్ణచంద్రుని చూడ పుయ్య నెయ్యరికాల
పల్లు చాలదోము పాలుత్రావ
పొన్నగంటి చిర్రిచాలగా భక్షింప
చేతరాసి దినిన చెడదు దృష్టి.

(ప్రసంగ రత్నాకరం.)

పొన్నగంటి తీపి, చిరుచేదు, వగరు రుచులు కలది. సమస్త నేత్రరోగములను హరించును. దగ్గు, శ్వాస, జ్వరము, మూలవ్యాధి, వాతములను పోగొట్టును. అభ్యాసముగా తినిన కండజబ్బులు పోవును.

ఎలుకచెవికూర చలవచేయును. రసదోష ముల హరించును. అతిమూత్రమును పోగొట్టును. డైబెటీసులో పథ్యమైనది. ఉదరము, వాతము, కడుపుబ్బు. శూల, ప్రమేహములు హరించును. మలబద్ధము చేయును. మలములో క్రిములున్నవారు ఎలుకచెవికూర ఒకవారము కూర వండుకొనిగాని రొట్టె చేసుకగాని తినిన మలములోని క్రిములు చచ్చిపడును. పరీక్షించిన మైక్రాస్కోపులో కూడా కన్పించవు.

చిట్టింతపొట్టు. దీనిని పేరంటాలాకు అని కూడా పిలతురు. అజీర్ణము కలవారికి చాలా మేలుచేయును. వాతహరము, అగ్నిదీపనము. నేయి బాగాచేర్చి సేవించిన అజీర్ణము అగ్ని మాంద్యము హరించును. ఆకలిని పెంచును. పొట్టను తగ్గించును. గుదబద్ధవాతమును హరించి మొలలు రాకుండా కాపాడును.

పులిచింత, (చాంగేరి) ఇది తెలంగాణము నెల్లూరు ప్రాంతమున లంభించును. ' గ్రహణీవ్యాధుల (జిగట విరేచనముల) మొలలు వ్యాధి గలవారికి చాలా మేలుచేయును. వేడిచేయును. వాతశ్లేష్మముల హరించును. ఆకలిని పుట్టించును.

తెల్లగలిజేరు. వేడిచేయును. శరీరమును ఆర్చును. వాపును, నీరును హరించును. కండ్లకు మేలుచేయును.

కసివింద ను కాసమర్ద అంటారు సంస్కృతంలో. కాసమర్ద అంటే దగ్గును పోగొట్టునదని భావం. ఇది రుచిని పుట్టించును. కంఠమును శోధించును, విశేషముగా దగ్గును పోగొట్టును. తిన్న ఆహారమును పచనము చేయును. కఫవాతహరము. దీనిని గోంగూరపచ్చడివలె పచ్చడిచేసి తినవలయును. ప్రమేహములయందుకూడా పథ్యము

బచ్చలికూర శ్లేష్మవాతముల ప్రకోపింప జేయును. జీర్ణశక్తిని పాడుచేయును. అజీర్ణముకలిగించును. కంఠమును చెరచును. అతి నిద్రను కలిగించును. శుక్రవృద్ధి, రక్తపిత్తము చలిజ్వరములయందు పథ్యము. మలేరియా జ్వరపీడితులకు పథ్యమైనది. దీనిని అంతర్విద్రధులయందు పైన కట్టుదురని వంగసేన అభిప్రాయము. అల్పాగ్నికలవారు తిన్న వెంటనే అతిసారము కలిగించును. నువ్వులకల్కముతోగాని, నువ్వుపెట్టిగాని బచ్చలి వండి తినిన విరుద్ధమై ప్రాణమునకు ముప్పు కల్గించును.

చిరుబొద్ది (బొద్దికూర) క్షచోరములఆకు నీటిచెంచలి, యీ కూరలు త్రిదోషముల హరించును. విరేచనము చేయును.

కామంచికూర త్రిదోషములను హరించును. శుక్రవృద్ధి, వయుస్తంభనము, ముసలితనము రానీకుండా జేయును. సమశీతోష్ణమైన వీర్యము కలది. కఠినమై ఉండలు కట్టిన మలమును ఛేదించును. కుష్ఠహరము. కామంచి కూరను మట్టిపాత్రలోగాని రాతి చిప్పలో గాని వండవలయును. ఇత్తడి లేక కంచు పాత్రలలో వండినది తినినను విషమించును.

ప్రాణహారము. వండి చల్లారినది గాని చద్దిది గాని తినిన ప్రాణము తీయును. కామంచి కూరను పిప్పళ్లుగాని మిరియాలుగాని కలిపి తినరాదు. శొంఠినికూడా తగులనీయరాదు. కామంచికూరలో బెల్లమువేసి వండి తిన రాదు. ఇవి కామంచికి విరుద్ధములు.

ఆకుకూరలలో మధురపదార్థములు కలిపి తినే ఆచారమున్నది. అందువల్లనే కామంచి కూరలో పాలు నెయ్యి కలిపి తినరాదని అగ్నివేశులు నిషేధించారు.

కాలశాకం. కరివేప అగ్నిదీప్తిని కలిగించును. బలకరము. తినిన ఆహారమును పచనము చేయును. రుచిని పుట్టించును. వాతకరము. కఫము వాపు విషము మూలవ్యాధులయందు పథ్యము. అతిసారమున కరివేపాకు మిరియాలు నూరి కుంకుడుగింజంత మాత్ర చేసి ఇచ్చిన అతిసారము కట్టును.

చుక్కకూర. 'పుల్లబచ్చలి' అగ్ని దీప్తి చేయును. ఆమ వాతహారం. దప్పి, వాంతి, శ్లేష్మము, వాతము, నోటియందు నీరూరుటను హరించును.

మెంతికూర. వేడిచేయును. శరీరమును ఆర్చును. హృద్యముగా నుండుటయేగాక రక్తపిత్తము, జ్వరము,అరోచకము,వాంతి, వాతరక్తము, దగ్గు, వాయువు, మొలలు, కృములు, క్షయను పోగొట్టును. నిత్యము ఒక మండలము ఆహారముగా తినిన స్త్రీలకు బుతురక్తమునుజారీచేయును. శాస్త్రకారుడు మెంతికూరను గూర్చి 'శుక్రంచనాశయ త్యేషా' అన్నాడు. అంటే శుక్రమును నాశనము చేయునని భావము.

కొతిమీరు. సువాసనగ నుండును. శీతవీర్యము. కటువిపాకముగలది. త్రిదోషములను శమింపజేయును. విశేషించి పిత్తశమనకారి. మూత్రమును జారీచేయును. రుచికరమైనది. జఠరదీప్తి చేయును. ఈఆకు రసము పుక్కిలించినను ముఖపాకము (నోటిపూత) తగ్గును. ఈరసము ఒక ఔన్సు త్రాగించిన రక్తపిత్తము రక్తపుపోటు, రక్తస్రావమును తగ్గించును. రక్తము కక్కుకొనిన రోగులకు కొతిమీరఆకు నూరి మాడుకు పట్టువేసిన రక్తమును వెంటనే ఆపును.

గోంగూర. పిత్తమును ప్రకోపింపజేయును. జ్వరపడి లేచినవారికి పథ్యమైనది. యకృత్తును ఉద్రిక్తపరచును. వేడిచేయును. పులుసుకూర నిత్యము అర్ధమండలము సేవించిన రేచీకటిపోవును. పచ్చడి వాతమును హరించును. గోంగూర నీరువ్యాధి కలవారికి మంచిది.

ఆకుకూరలగూర్చి చాలా వ్రాశాను. ఈ కూరలన్నియు ఆయా దోషములననుసరించి అప్పుడప్పుడు తినవలసినవి. అభ్యాసముగా తినరాదు. ఆకుకూరలో అభ్యాసముగా తిన తగ్గవి గునుగుకూర, మనుబాల మాత్రమే. మొత్తముమీద ఆకుకూరల నిషేధము అంటే ప్రకృతివైద్యులు మాత్రం సహించలేరనుకుంటాను. 'శాకావరాన్న భూయిష్టం అత్యుష్ణం లవణంత్యజేత్' అని పరహిత సంహిత కర్త శ్రీనాథ పండితుడుకూడా చెప్పాడు.

వర్జింపవలసిన శాకములు

పురుగుపట్టిన ఆకుకూరలను తినరాదు. గాలిచేత ఎండచేత చెడిపోయినవి, ద్రవము లేక ఆరిపోయినవి, తినరాదు. దీనినిబట్టి ఆకుకూరలను నిల్వచేయు పద్ధతికూడ తప్పని తెలియుచున్నది. అకాలమున పుట్టినకూరలు కూడ తినరాదు. కొయ్యతోటకూర వేసంగిలో తినవలయును. తదితర కాలములలో అది తినరాదు. ఉడకబెట్టి నీరు వడియకట్టక పక్వము చేయబడిన దానిని తినరాదు. ఇప్పటి ప్రకృతి వైద్యులు నానబెట్టి మొలకవచ్చిన శింబీ ధాన్యములను, వాశనమీద ఉడికించిన ఆకుకూరలను తినుట ఆచారమైయున్నది. చరకుడు వాటినికూడా నిషేధించాడు. చమురులేక పక్వము చేయబడినదానిని తినరాదు. తిరుగబోత వేయక ఊరక ఉడికించి తినే ప్రకృతివైద్యుల ఆహారాన్ని ఆయుర్వేదం నిషేధిస్తోంది.

గ్రంథపరిచయం·

పండితరాయల భామినీవిలాసము

శ్రీ 'వాసిరెడ్డి' అనువాదం

రచన · శ్రీ వాసిరెడ్డి వెంకట సుబ్బయ్య
ప్రతి వెల రు 3-0-0, ప్రతులకు
శ్రీ వాసిరెడ్డి వేంకటేశ్వరరావు,
వాసిరెడ్డి గ్రంథమాల, *గుంటూరు-2*

అలంకార శాస్త్రాకాశంలో జగన్నాథ పండితరాయ లోక దివ్యతార పాండితీప్రతిభల కతడు నిధి. 'ఎంతవాడైనను సుకవితామూర్ఖుయిన యెడల నేను తలవంచి మొక్కబోనన్న ప్రతిజ్ఞ పలికిన కవిరాజు', భారతదేశమంతట పర్యటించి బహుభాషల నభ్యసించి పలుసంప్రదాయముల నవలోకించి లోకవృత్తము నెఱిగిన అనుభవజ్ఞుడు. జీవితమాధుర్యాన్ని, సంఘ దౌష్ట్యాన్ని సమంగా చవిచూచినవాడు. భారతీయాలంకార శాస్త్రగ్రంథాలలో అతని 'రసగంగాధరం' విమర్శనాత్మకమైన స్వతంత్రగ్రంథం అతని అతిలోక సాహితీశాస్త్ర వ్యాయామానికది నిదర్శనం. 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దమే కావ్య'మన్న అతని సూత్రానికి భామినీవిలాసం లక్ష్యం, దీని రచనోద్దేశంకూడ అదే కావ్యకాంతాలలామకు ధర్మార్థ కామమోక్ష సదృశములైన శబ్దార్థ రసధ్వని చతుష్టయ లాభాన్ని చవిచూపిన గ్రంథమిది

అతని జీవితం ఉదాత్తమైనది. అతని ప్రవృత్తిలో హుందాతనం మెండు కాబట్టె కవిరాజు 'నాకోరిక లీడేర్చుటకు ఢిల్లీశ్వరుడో లేక పరమేశ్వరుడో కావలయునే కాని ఇతర రాజు లిచ్చునది కూరాకుకి ఉప్పుగల్లుకి చాలునా!' అన్నాడు ఇహ లోకసౌఖ్యం అనుభవింపవలిస్తే ఢిల్లీశ్వరుడు దయదలచాలిగాని చిల్లరమల్లర దాతల వితరణ ఏమూలకు? ఇది కాదని ముక్తిమార్గం అభిలషిస్తే జగదీశ్వరుని కరుణాకటాక్షం కావాలి కాని తక్కువారి నాశ్రయిస్తే ఏపాటిఫలితం వస్తుంది? అతని ఉదాత్త ప్రవృత్తి కిదొక ఉదాహరణ ఈ గ్రంథంలోని ప్రాస్తావిక విలాసంలో జగన్నాథుని ఈ ప్రవృత్తి స్పష్టంగా గోచరిస్తుంటుంది కవి ప్రవృత్తి, వ్యక్తిత్వం, జీవితానుభవాలు అతని కావ్యంలో తొంగి చూడకమానవు, కావ్య నిర్మాణంలో కవికి ఉపకరించేవికూడ ఇవే. ఈ గ్రంథంలోని శాంతకరుణ శృంగారవిలాసాలకుకూడ అతని జీవితానుభవమే పునాదివేసి ఉండవచ్చు సంకుచిత విశ్వాసాలను వీడి విశ్వమానవ సోదరభావంతో సంచరించిన పండితరాయల జీవితసాగరంలో ఎన్నో అలలు లేచినవి. ఈ అలలు అతని జీవితసాగరం ఒడ్డున కనిపించేవేకాని స్థిరహృదయుడైన అతని గంభీరహృదయాన్ని ఏమిచేయలేవుగదా! అతని ప్రకృతి పరిశీలనకు రమణీయభావనకు ప్రాస్తావికవిలాసం నిధి తన శక్తిపైఉక్తిపై పండితరాయలకుగల ఆత్మవిశ్వాసంఉన్నతమైనది.

"తన వీణాగుణ నిక్వణధ్వని యెడం
దాత్పర్యమున్ సేయ కె
వ్వని వాక్యామృత వాహినీ రసము నాస్వాదించు
వాగ్దేవి త
త్పణితుల్ పండితరాజ కర్ణసుభగస్వాదిష్టముల్
వించునే
జనుఁ డూపండు శిరమ్మువాఁడు పశువో సాక్షా
త్పశుస్వామియో!"

అని ఎలుగెత్తి చాటుకొన్నాడు కవి జగన్నాథుని అర్థగాంభీర్యానిక శబ్దసౌందర్యానికి కూడ ఉదాహరణగా గ్రహింపదగిన దీపద్యం, ఆంధ్రీకర్త కృషికిది మచ్చుతునక వ్యర్థపదం లేదు, నడకలో కుంటులేదు, రచయితకు శబ్దంపైగల అధికారాన్ని,సమాసరచనా సౌలభ్యాన్ని విదితం చేస్తున్నది. 'వీణాగుణనిక్వణధ్వని'ని పలికిస్తున్న రచన ఇది

'ఉన్నత కవితాపదవీమతి,' 'రమణీయ వాక్కలావిత్తముఁడు,' 'సారస్వతైక పరతంత్ర కలాధనుఁడు, 'బహు భాషాభాగుఁడు అయిన కవి దీనికి ఆంధ్రీకర్తగా లభించటం ఆంధ్ర

సారస్వతం అదృష్టం. మూలరచయిత ప్రవృత్తికి ఆంధ్రీకర్త ప్రకృతికి సామ్యం ఉండటం చేతనేఈఅనువాదం ఇంతగా రాణింపుకి వచ్చినదేమో! జగన్నాథ పండితునికివలెనే అనువాదకునికి కూడ ఆత్మవిశ్వాసం మెండు, జీవితానుభవం, లోకవృత్త పరిజ్ఞానం అధికం. కవిత్వతత్వంపైకూడ ఇరువురి అభిప్రాయాలు ఇంచుమించు ఒకటె. జగన్నాథుడు 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దమే కావ్యం' అంటే శ్రీ వేంకటసుబ్బయ్యగారు-

"మనమాడు మాటలే మన
మనుకొను భావములే క్రొత్తలగునటు కూర్పం
బని తనమున విశ్వజగ
జ్జనులను వలపించు హృదయశాణికులు కవుల్"

"భావములు ప్రజలసొత్తు, భాషయువారిదే. ఒక్క గ్రథనకౌశలముమాత్రము సుకవుల సొమ్ము."

అన్నారు. అంటె ఇరువురుకూడ ఉక్తివైచిత్రిని ప్రధానంగా భావించారన్నమాట ఇన్ని పోలికలు ఈ ఇరువురిలో ఉండటంచేతనే అనువాదకులు ఈ కావ్యంపై సంవత్సరాల తరబడి కృషిచేసి ఈ మేలిరత్నాన్ని వెలికి తీయగలిగారు, 'జగన్నాథుని చరిత్రాత్మక జీవితమును, నాతని కావ్యకవితారీతులును నన్నీ భామినీవిలాసాంధ్రీకరణమునకు ఉత్సాహపఱచినవి' అని అనువాదకులుచెప్పుకోవటానికికూడ ఈప్రవృత్తిసామ్యమే హేతువుకావచ్చు. అనువాదకుడు మూలగ్రంథానికి న్యాయం చేకూర్చాలంటె మూలరచయితపై, గ్రంథంపై ఇలాంటిశ్రద్ధాసక్తులు, విశ్వాసం ఉండటం అవసరం.

అనువాదంలోని గుణాగుణాల పరామర్శకు ముందు అనువాదకులైన శ్రీ వాసిరెడ్డి వేంకటసుబ్బయ్యగారిని గురించి రెండుమాటలు చెప్పవలసిఉన్నది. ఈయన బాజాభజంత్రీలను కుదుర్చుకొని,ఏవోవో బిరుదులనుతగిలించుకొని పదిమందిలో ప్రచారంపొందిన కవికాదు.'ప్రచారమునే కాని పాండిత్యమును గుర్తింపలేని దుష్కాలమిది.' అని గుర్తించికూడ తన మార్గానతాను కావ్యసృష్టి చేస్తున్న 'పనితస్వతంత్రభూజీవనులు' సంస్కృతాంధ్రాలలో చక్కని పండితులు, ఉరుదు, ఆంగ్లం, హిందీభాషలలో ప్రవేశమున్నవారు. అన్నింటిని మించి కవికి ప్రధానంగా కావలసిన రసహృదయంవీరిసొత్తు.

భామినీవిలాసాన్ని చాలమంది అనువదించారు, ఇంకెందరో అనువదిస్తున్నారు కాని ఇప్పటికి వచ్చిన అనువాదాలలో ఇది ఉత్తమోత్తమం అనటంలొ సందేహించనవసరం లేదు శ్రీయుతులు ఆకుండి వ్యాసమూర్తిశాస్త్రి, మండపాక కామకవి, ఒడయారు వీరనాగయకవి, వడ్డాది సుబ్బరాయకవి, దంటు సుబ్బావధాని, కాకరపర్తి కృష్ణశాస్త్రి, వేదం వెంకటకృష్ణశర్మ మొదలైనవారు భామినీవిలాసాన్ని తెనిగించారు. వీరిలో జగన్నాథుని భావగాంభీర్యాన్ని పోషించినవారు కొందరు, భాషాసౌందర్యాన్ని ప్రదర్శించ యత్నించినవారు కొందరు ఉన్నారు ఈ రెంటిలో దేనిని సాధించలేక పోయిన అనువాదాలుకూడ మరికొన్ని వచ్చినవి ప్రస్తుతానువాదం శబ్దార్థసద్వసులను పుణికి పుచ్చుకొన్నది. సహృదహృదయమే దీనికి ప్రమాణం ఆ యీ అనువాదకుల పద్యాలను మూలసహితంగా ఉదాహరించి ఈ విషయం ఋజువుచేయవచ్చు, కాని అది ఇక్కడ వీలయ్యే పనికాదు.

జగన్నాథుని కావ్యాన్ని - ఆమాటకు వస్తే ఏ ఉత్తమకావ్యాన్నయినా- అనువదించటంలోని కష్టం సాహితీపరులకు తెలియనిదికాదు మూలభావాన్ని అనువాదంలోకి తీసికొనిరావటం ప్రధానమే, కాని అది ఒక్కటే చాలదు శయ్యాసౌభాగ్యాన్ని,శబ్దసౌందర్యాన్నికూడ అనువాదంలో ప్రదర్శించగలగాలి పైగా మూల గ్రంథభాషకు అనువాదభాషకు నానుడులలో, వాక్యవిన్యాసంలో, అర్థవిశదీకరణ శక్తిలో ఎన్నో వ్యత్యాసాలు ఉండటం సహజం. అంధ్రంలోకి అనువదిస్తున్నప్పుడు అనువాదకుడు తెలుగుతనంకూడ ప్రదర్శింపగలిగి ఉండాలి. అప్పుడే ఆ అనువాదం తెలుగుపాఠకుల హృదయానికి హత్తుకొని తెలుగువారిసొత్తు కాగలదు ప్రస్తుతానువాదకులు శ్రీ వేంకట

సుబ్బయ్యగారు ఈ విషయంలో ప్రశంసార్హమైన కృషిచేశారు. వీరువాడిన తెలుగుపలుకుబడులు, జాతీయాలు సందర్భోచితాలు, కృతకంగా అతికినట్లు అక్కడ కనిపించదు. ఇంచుమించు ప్రతిపద్యంనుంచి దీనికి ఉదాహరణలు చూపవచ్చు. దిఙ్మాత్రంగ కొన్నిచూపుతాను.

'కనుమోడ్చి లీలగా యే
మని కునికెదు నిద్ర యిప్పుడా కరివర తీ
రని పగగలిగెను హరితో
మునుముందిక ముదిరి చావె మూఁడునునీకున్'

దీనిలో 'కునికెదు', 'మునుముందిక ముదిరి చావుమూఁడును' అన్న ప్రయోగాలు తెలుగుతనం వెలార్చేవేకాక సందర్భసహజాలు.

'ఈమహాటవి నేకాకి వీవు పికమ
యిట్టులే బ్రతుకుము కంఠమెత్తఁబోక
పాపమతులయ్యుఁ దమజాతి పక్షియనుచు
గాసివెట్టకయుండు నీ కాకమూఁక.

ఈ పద్యమంత ఒకయెత్తు, చివరి 'కాకమూఁక' ప్రయోగం ఒక ఎత్తు దీనికి కేవలం కాకుల సమూహం అనేది ఒకటేనా అర్థం? ఇలాంటిదె మరొకటి -

'చందనము పన్నగులకున్
విందుడు, దీపమ్ముమసిని నెత్తినిడుకొనుం
జందురుఁడు '

ఈ'నెత్తి నిడుకొనున్' అనటంలో కేవలం శబ్దార్థం మాత్రమేకాక అంతకుమించిన ఔచిత్యం, పలుకుబడి లేవా?

'మధుకర నీ, మొకమటిన కేమైన సిగ్గు బొగ్గును లేదే' దీనిలోని తెలుగుతనాన్ని మరొకరు వివరించాలా?

హరి మందిరమరిగిన మద
కరి కుంభస్థములు మౌక్తికంబులు దొరకున్
దొరకు నిఁక దూడతోఁకలు
ఖురచర్మంబులును నక్క కొంపకుఁజేరన్

మందిరమన్నా, కొంప అన్నా శబ్దార్థం ఒక్కటే, కాని కవి రెండుచోట్ల రెండుప్రయోగాలు చేశాడు. దానిలోని ఔచిత్యం రసజ్ఞులు గమనించగలరు. కవిత్వంలో పదాలకు కేవలం అర్థాలేకాక అర్థాలకు మించిన శక్తికూడ ఒకటున్నది, పరిణతుడైన కవి శబ్దార్థాన్నే కాక, శబ్దశక్తినికూడ గమనించి వాటిని వాడుకొంటాడు అయా సందర్భాలను బట్టి శబ్దాలకు ఈ శక్తి ఉంటుంది

'హరిణముఁ, గన్నెత్తియుఁ గనునెకడుపు
కక్కుటితికై'

'నీదు పొంగుపదలఁగలయు'
'నీ వివేక మే యూరికిఁబోయె'
'కాకి ప్రేలుకొను మిఁకఁగాఁఋల్'
'కుందుమొగము వాచి పొట్ట కూటికికూడన్'

'అబ్ద యేమి పోఁగాలమయ్యె నీ విప్పుడతనిమీఁదనే యుఱిమెద వెంత మిడిసిపాటు' ఇలాంటి తెలుగు పలుకుబడు లీ గ్రంథంలో కోకొల్లలు.

'వీచికా గర్జనల వెఱపింతువేల
కడలి పడియుండు మిఁక నోరు గట్టిపెట్టి'.

ఇక వీరి సమాసాలను చూద్దాం. ఏదో ఒక ప్రయోజనాన్ని ఉద్దేశించకుండ ఈకవి సమాసం వాడరు చెప్పదలచుకొన్న భావగాంభీర్యాన్ని పాఠకునికి తోపింపచేయటంకోసమో లేక పద్యం నడకలో హుందాతనం తేవటంకోసమో లేక శబ్దసౌందర్యంతో 'వీణాగుణనిక్వణధ్వనితో పాఠకులను మైమరపించటంకోసమో మాత్రమే ఈకవి సమాసాలు వాడుతుంటారు ఈ సమాసాలుకూడ సరళమైనవి, గంగాఝరివలె ఉరకలు వేస్తుంటవి

'వరుసన్ నీడలుఁ బుష్పముల్ మధురముల్ పండ్లిచ్చి మార్గ శ్రమాతురులం దృప్తి యొనర్చు నీ తరుకులేంద్రుం డంచటన్ జేరె నే
మెఱుఁగున్‌వాఁడు తదీయ కోటరపుటీహేరాళ హాలాహల
స్ఫురదుత్తాల ఫణాకరోర నటనాఘోరున్ ఫణి గ్రామణిన్'

మొదటి రెండుపాదాలు పొడిపొడిగా నడిపిన కవి రెండవపాదంనుంచి ఉగ్రస్వరూపంతో ఒక సమాసం ప్రారంభించాడు దీని సొగసు, సందర్భోచితీ కవితామర్మజ్ఞులు గ్రహించలేకపోతారా!

'పటు బాహాయుగ మండలీకృత ధనుష్పాతం పతన్మార్గణ

చ్ఛటు విచ్ఛిన్న విపక్షమండలు నినున్ సంగ్రామ
భూమింగనన్
నటు దుత్తాల మహోగ్రగాండివ చలన్నానా
శరజ్వాలికా
పటలీతాండవ దగ్ధఖాండవు నెదన్ భావింతు
నప్పాండవున్'

అన్న పద్యం చూశాంగదా. మరి ఈక్రింది పద్యంకూడ చూడండి

'హాలహల వహ్నిఁగ్రోలిన మహాత్ముఁడు
కూలియు నీలకంఠుఁడే
జ్వలిత మహాహులంజిదిమి సొపడు నెమ్మియు
నీలకంఠుఁడే
నలదళసంగి కీటకగణమ్ము మెసంగెడి
యూరపిచ్చుకా
యిలపయి నీలకంఠుఁడను నేననుచుం దల
పోయుచుంటివా.'

ఈ రెండుపద్యాల సమాసాలు ఒకే తీరున ఉన్నవా? ఎలా ఉండగలవు! మార్గణచ్ఛటచ్ఛటలతో గూడిన పాండవుడెక్కడ పురుగులను తినే ఊరపిచ్చుక ఎక్కడ? సందర్భోచిత రచన కిదొక ఉదాహరణమాత్రమే.

'కనకాద్రీంద్రము దొట్టి గంధగిరిదాఁకన్
వార్నిధుల్ సుట్టిరాఁ
జనుభూమింగల కావ్యకల్పన చణుల్ శంకింపకే
తెల్పుఁడీ
ఘనుఁడెవ్వండు మదన్యుఁడిక్షురసశిక్షాదక్ష
దీక్షాపచః
ప్రణుతాచార్య మహాపదమ్మనుభవింపం జాలు
వాఁడుండెడిన్.'

పండితరాయల ఆత్మవిశ్వాసం అహంకారం పరవళ్ళు త్రొక్కుతున్నట్లున్న భావానికి తగినట్లుగా సవాల్ చేస్తున్నదీ పద్యం

ఈ గ్రంథంలో కనిపించె మరొక విశేషం కారకం, అన్వయం. అన్వయంకోసం పాఠకుడు దీనిలో వెదకుకొనవలసిన పనిలేదు. పద్యం ఎంత సాఫీగా సరళంగా నడుస్తుంటుందో భావం అంత సుబోధకంగా సువ్యక్తంగా ఉంటుంది. అయితే ఇది అన్యాపదేశ కృతి, ఆ లోతుపాతులను స్పృశించగల శక్తి అందరకు ఉండకపోవచ్చు. చిన్న చిన్న పదాలతో, కమ్మని కూర్పుతో హృద్యంగమమైన భావాన్ని సూటిగా సుందరంగా వెల్లార్చటంలో అనువాదకులు సిద్ధహస్తులు.

'కాచినఁ గోసిన తాతన్
రాచినఁ జింతిలదు కాంచనము తన్నుఁదులన్
వైచుచు గురిగింజలతో
దూఁచుట గనిమాత్ర మాత్మ దుఃఖించుఁగడున్'

అర్థంకోసఁ ఏ నిఘంటువులు గాలించవలసిన మారుమూల పదాలు, అన్వయంకోసం క్రిందు మీదు చూడవలసిన అగత్యం లేకుండానే ఎంత చక్కని భావాన్ని వెలార్చగలిగారో చూడండి. ఇలాంటిదే మరొకటి -

'అనలకణాల నన్నిడి శతాధికవారము లెంత
కాల్చినన్
దినదిన వర్ధమాన గుణ తేజమునాకు లభించు
నీ ముఖం
బునకిక దుమ్ముధూళియును బొట్టును
ధూమ్రమెకా లభించుటల్
కనఁ బరదుఃఖసంఘటన గండరగండఁడ స్వర్ణ
కారుఁడా'

'నీ ముఖంబునకు' అనివాడటంలో కవి చూపిన నేర్పుని గమనించక తప్పదు!

ఇలాంటి పద్యాలు, ప్రయోగాలు ఎత్తి చూపాలంటె గ్రంథంలో మూడు వంతులైనా ఉద్ధృతం చేయవలసి ఉంటుంది అందుచేత ఇక ఒక విషయంతో ఈ సమీక్ష ముగిస్తాను. బ్రహ్మశ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారు మద్రాసులో మరణశయ్యపై నుండగా వారి క్షేమమడుగుటకి కవి మద్రాసుపోయి వారిని దర్శించారట. వీరిని "చూచుటతోడనే ప్రాణములు లేచివచ్చినట్లు లేచి కూర్చొని 'నేను బ్రతికయుండఁగా నీకావ్యము అచ్చువేయించవుగదా!' అని బొటబొటఁ గన్నీరు కార్చుచు మరల శయ్యపై నొఱఁగిరి ఈ దృశ్యము తలఁపునకు వచ్చిన నేఁటికిని హృదయము జలదరించుచుండును ఓహో! కవితా సరస్వతీ ఏమి! నీ ప్రభావము! ఇంతలింతలుగ హృన్మర్మములను భేదించి పైచు మరణవేదనయందుఁ గూడ సుకవీంద్రుల వదనాంగణమున నీవిలాసలాస్యము భాసించుచుండును గదా!" యిది ఆ కోవకు చెందిన ఉత్తమకావ్యం, ఆంధ్రభాషకు అమూల్యాభరణం, కావ్యకన్యకు రసజ్ఞుల ప్రశంసలకు మించిన ప్రయోజనముండునా?

—శాస్త్రి జగన్నాథం.

మాసఫలములు

అక్టోబరు 20 — నవంబరు 20

శ్రీ 'బుధ'

మేషము

(అశ్వి, భర, కృత్తి 1 పా.)

ఈ రాశివారికి రవి అంగారక సమసప్తకం షష్ఠాష్టమములలో శుక్రబుధులు మంచివారు కారు కృషి వ్యాపారాదులకు అనేక ఆటంకములు ఏ కార్యము నిర్మాణాత్మకంగా జయప్రదం కానేరదు శక్తికి మించిన ఆలోచనలు అవ్యక్తమార్గములలో కార్యాచరణ అస్థిర చిత్తమువలన శారీరక, మానసిక సుఖములు తక్కువ సాంఘిక వైరము- భాగస్థులతోపేచి నవంబరు మొదటివారం వరకు ఏ నూతనకార్యములు పై వేసుకొని భారము వహింపతగదు నవంబరు **4** నుండి, బుధుడును, **10** నుండి, శుక్రుడును, కొంతవరకు కార్యసాధకులగుదురు. తదాది మీ ఉద్యోగ వ్యాపారములు ఫలప్రదమై స్వల్పఆదాయాన్ని సమకూర్చును గృహస్థ జీవితము సుఖము నివ్వదు. కళత్ర అనారోగ్యము లేక అంతఃకలహములచే కొంతకాలము ఎడబాటును సంభవమగును

వృషభము

(కృత్తి 2,3 4 రోహి, మృగ 1, 2 పా)

గ్రహస్థితి అనుకూలం ఆరవయింట రవి అంగారకస్థితి మంచిది. ఉత్సాహశక్తిని, ధైర్యస్థైర్యముల సమకూర్చును సాహసోపేతమగు నూతన కార్యములలో ప్రవేశింతురు. సాంఘిక రాజకీయ వ్యవహారములలో జయం. ఉద్యోగులు పై అధికారుల మన్ననలకు పాత్రులగుదురు నూతన పరిశ్రమలలో, పరస్పర వ్యాపారసంబంధనలు ఎగ్రిమెంట్సు అనుకూలించును. వ్యాపారాది కృషులలో అధికలాభము పెట్టుబడులకై ఋణముచేయుట, వ్యాపారమునుగూర్చి ఇతర పట్టణవాసము మీ విజ్ఞానాత్మకమైన కృషి సత్ఫలితము నిచ్చును శాస్త్రపరిశోధకులకు మంచి కాలం. అక్టోబరు **30-31** తేదీలలో కళత్ర అనారోగ్యం - గర్భస్రావం మొదలగు ప్రమాదములకు గురియగు అవకాశం కలదు హక్కు భుక్తముల గూర్చి భాగస్థులు, లేక సోదరులతో వైరము ప్రయాణములలో జాగ్రత అవసరం

మిథునము

(మృగ 3, 4, ఆరు, పున 1, 2, 3 పా)

గ్రహస్థితి మంచిచెడుల మిశ్రమ ఫలితాన్ని సూచించుచున్నది యత్నకార్యములలో తలవని తలంపుగా అనేక క్లిష్టసమస్యలు ఏర్పడును. తొలుత భయాందోళనకరంగా యున్నా, తుది క్షణంలో శుభాంతంగా పరిష్కృతమగుచుండును మీ విజ్ఞానాత్మకమైన కృషి సత్ఫలితము నిచ్చును. విద్యార్థులకు విజయం సాహితీమార్గములలో పరిశ్రమ చేయువారికిని లౌకిక వ్యాపారములలో తిరుగువారికి మంచికాలం. ఉద్యోగాదికారములు హోదా, గౌరవము పెరుగును వ్యాపారాదులు లాభదాయకంగా కొనసాగుచున్ననూ, ఆర్థిక అవసరములకు చాలక, లేక, అభివృద్ధి నిమిత్తం కొంత ఋణము చేయుటయు జరుగును సాహసోపేతంగా చేయబడిన వ్యాపారము అనుకూలించి, అధికలాభము సమకూర్చును నవంబరు **2** నుండి, శుక్రుడు శుభుడగుటచే నూతన వస్తువాహనసిద్ధి బంధుమిత్రాదులతో వినోదమార్గములతో గృహస్థజీవితము సుఖప్రదంగా వుండును. సంతతికిమాత్రం స్వల్ప అనారోగ్యం

కర్కాటకము

(పున 4, పుష్య, ఆశ్లే)

గురు, శను లిద్దరు శతృభావములో నుండి మీ దీర్ఘకాల ప్రణాళికల ననుసరించి రాబోవు వ్యవహారిక, ఆర్థిక చిక్కులను సూచించుచూ మానసిక ఆందోళన కలిగించుచుండును కాని తదితర గ్రహస్థితి అనుకూలంగా యున్నందున మీ ఆత్మబలమునకు దైవబలముకూడా సమకూరి శ్రమలేకుండగనే యత్నకార్యములు సఫలములవుచుండును బుద్ధికుశలత, వ్యవహారదక్షత వలన, వ్యవహారిక విజయం కుటుంబవ్యవహారములలో ఎక్కువశ్రద్ధ వహింతురు స్థితిగతుల భద్రపరచుకొనుట, అభివృద్ధి వీటినిగూర్చిన ఆలోచనలే ప్రాముఖ్యం వహించును రాజకీయవాదులు సాంఘికబలము సమకూర్చుకొనుటలో నిమగ్నులవుదురు వుద్యోగ వ్యాపారాదికృషులు యథాతథంగా సాగిపోవుచుండును బుధ, బృహ

స్పతులిద్దరు బుద్ధిస్థానములో నుండుటచే విజ్ఞాన, సాహిత్యమార్గములలో కృషి ప్రజలు నాకర్షించి గౌరవమును చేకూర్చును, గృహస్థజీవితము అనారోగ్యములతో, అధికధన వ్యయములతో అశాంతిని కలిగించుచుండును శత్రువులు వ్యవహారికంగా అవమానింపజూతురు జాగ్రత అవసరం

సి ం హ ము

(మఖ, పుూఫ, ఉఫ 1 పా)

గ్రహస్థితి కొలది అనుకూలం. తృతీయ రవి కుజస్థితివలన, జీవితపురోగమునకు తగిన అవకాశములు కలుగును నూతన ఉత్సహము ధైర్య సాహసములతో, నూతన వ్యాపారాదికృషులలో పాల్గొందురు సాంఘిక గౌరవము, అధికారుల ప్రాపకం, వ్యవహారిక విజయం సమకూరును స్థితిగతులలో అభివృద్ధి - ఉద్యోగ వ్యాపారాది కృషులు అనుకూలించి ఆర్థిక లాభమును సమకూర్చును చతుర్థమందు బుధ - బృహస్పతుల శుభస్థితిచే, విజ్ఞాన సాహిత్య మార్గములలో కృషి సత్ఫలితము నిచ్చును. బంధు మిత్రాదులతో మృష్టాన్నభోజనములతో గృహస్థజీవితము సుఖప్రదంగా గడవిపోవుచుండును అధికలాభాపేక్షతో, సాహసముతో చేసిన వ్యాపారములు విజయముగాంచును,

క న్య

(ఉఫ 2, 3, 4 హ స్త, చి త్త 1, 2 పా)

అక్టోబరు **21** నుండి అంగారకుడు **24** నుండి రవియు శుభగతి కలిగియుందురు గత కొద్ది మాసములనుండి ఎదుర్కొనుచున్న క్లిష్ట పరిస్థితులను, ఆర్థిక ఇబ్బందులను ఋణబాధలను క్రమక్రమంగా పరిష్కరించుకొన గలుగుదురు ఇట్టి పరిష్కారమార్గములలో కొలది స్థిర చరాస్తుల నష్టము సహితము జరుగవచ్చును వ్యాపారదృష్టితో మీ విజ్ఞానాత్మకమగు కృషి నిర్మాణాత్మకంగా కొనసాగించి ప్రతిఫల మనుభవించుటకు సర్వవిధములా ప్రయత్నింతురు. శక్తిసామర్థ్యములనెల్ల వినియోగించి వ్యాపార పద్ధతులను నూతనమార్గములలో నడుపించుదురు మిత్రులు, భాగస్థుల సహకారము ప్రయాణములు, కార్యసాధనకు దోహదమిచ్చును. ఉద్యోగ వ్యాపారాదికృషులు అనుకూలించి ఆర్థిక లాభమును సమకూర్చును, సాంఘిక, రాచకీయములలో ప్రాముఖ్యత. పలుకుబడి హెచ్చుగును. సాహితీమార్గములలో కృషి చేయువారికి నవంబరు మొదటివారంనుండి అనుకూలించును బంధు మిత్రాదులతో గృహస్థజీవితము సుఖప్రదంగా జరిగిపోవుచుండును కనిష్టసోదరులతో వైరము. తరచు ప్రయాణములు

తు ల

(చి త్త 3, 4 స్వాతి, విశాఖ 1, 2, 3 పా)

గ్రహస్థితి కొలది అనుకూలం. మీవిజ్ఞానాత్మకమగు కృషి కళారూపములో స్ఫుటబడి ప్రజా గౌరవమును చేకూర్చును విద్యావ్యాసంగముల సల్పువారికి మంచికాలము విద్యార్థులకు విజయం నవంబరు **1** నుండి వృత్తి వుద్యమములం దనుకూలత ధనలాభము స్థితిగతులలో అస్థిరత తొలగును ఆర్థిక ఇబ్బందులును తీరగలవు అధిక లాభాపేక్షతో సాహసముతో చేయు వ్యాపారముకన్న, తక్కువ పెట్టుబడులతో, స్వల్పలాభముల నాసించి చేయు వ్యాపారములందే ఎక్కువ లాభములను గణింపగలుగుదురు స్పెక్యులేషన్ వ్యాపారం అనుకూలించును మధ్యవర్తిత్వ పరిష్కారములలో లౌకిక వ్యాపారములలో ధనలాభము. అధికధనవ్యయములతో అంతఃకలహములతో గృహస్థజీవితమందు స్వల్ప అశాంతి

వృ శ్చి క ము

(విశాఖ 4, అనూ, జ్యేష్ట)

శుక్రుడొకడే శుభుడు మిగిలిన గ్రహములన్నియు ప్రతికూలంగా నడచుచున్నవి ముఖ్యంగా ద్వాదశములందు షష్ఠాష్టక పట్టినది ఇందువలన అశుభఫలితములు క్లిష్టరూపము దాల్చును మనస్సుకు శాంతి, విశ్రాంతులుండవు. నిగ్రహశక్తి కోలుపోవుదురు ఆరోగ్యం చెడుతుంది అవ్యక్తమార్గములలో కార్యాచరణ,ఉద్యోగరీత్యా బదిలీ స్థానచలనము అధికారుల ఆగ్రహావేశములకు గురియగుట మొదలగు దుష్ఫలితములు సంప్రాప్తమగుచుండును అక్రమవ్యాపారములు నడుపువారు అప్రమత్తతగాయున్న అధికారుల చేజిక్కె అవకాశంగలదు. నవంబరు **2** నుండి శుక్రునకు కోణస్థితి అప్పటి నుండి మీ ఉద్యోగవ్యాపారములు సవ్యమార్గములలో నడుచును యత్నకార్యములు ఫలించి స్వస్థత చేకూరును ఆర్థికఇబ్బందులు తీరును. నష్టద్రవ్యలాభము. లాభదాయకమగు ప్రయాణము.

ధనుస్సు

(మూల, పూషా, ఉషా 1 పా)

గ్రహస్థితి అనుకూలం బుద్ధికుశలతతో గావించిన కృషి ఫలప్రదమగును సాంఘిక, రాజకీయ వ్యవహారములలో విజయం పరపతి, హోదా పెరుగును ఊహాప్రపంచములో వేయబడిన మీ పన్నుగడలు ఫలప్రదమై, నిర్మాణాత్మకంగా కార్యరూపం దాల్చి ఆదాయమునిచ్చును వ్యవహారిక జయం శత్రువులు మిత్రులగుదురు వ్యాపారస్తులకు అనుకూలం అధికలాభముల గడించే అవకాశం సోదరులవలన మేలు ఈ రాశిలో జన్మించిన కొందరికి కృషివ్యాపారాదుల ననుసరించి లేదా విద్యావిజ్ఞానాభివృద్ధికై దూర దేశ ప్రయాణము. ఋణద్రవ్యలాభం నూతన వస్తువాహనసిద్ధి శుభకార్య నిర్వహణకై చేయు ప్రయత్నములు నవంబరునుండిఅనుకూలించును

మకరము

(ఉషా 2, 3, 4 శ్రవణ, ధని, 1, 2 పా.)

శని, ద్వాదశ అశుభస్థితి, బృహస్పతి ఏకాదశ శుభస్థితివలన మంచిచెడులు సమంగా అనుభవించుచుందురు అనగా ప్రాణాపాయము లేకున్ననూ డాక్టరుల బిల్లులు మాత్రము తప్పవు ఉద్యోగ వ్యాపారాదికృషులు లాభసాటిగా జరుగుచున్ననూ అధికవ్యయములవలన మిగులునది శూన్యం. ఇది సాముదాయకంగా జరుగుచున్న ఫలం ఐనప్పటికి, ఈ నెలలో రవి దశమస్థానమందును, నవంబరు 2నుండి శుక్రుడు భాగ్యమందును సంచరించుటచే శుభఫలిత పర్యవసానమే అధికంగా కనిపించుచుండును యత్నకార్య విజయం స్థితిగతుల అభివృద్ధి వ్యాపారలాభం వ్యవహారము రాజీమార్గములలో లాభసాటిగా పరిష్కారమగును

కుంభము

(ధని 3, 4 శత, పూభా 1, 2, 3 పా)

నవమకోణములో నున్న రవి అంగారకపాపస్థితివలన మీ వ్యాపారాది కృషులలో కొన్ని ఆటంకములు కలుగును యత్నకార్యములలో విలంబన, శ్రమ అధికమగును కాని నష్టమురాదు అసలు పరమార్థచింతతో పరుల కార్యనిర్వాహణమందే ఎక్కువకాలము వినియోగింతురు ఆధ్యాత్మికచింతన సత్కార్మాపేక్ష కావ్యపురాణాది గ్రంథపఠన యాత్రాఫలసిద్ధి. అక్టోబరు కన్న నవంబరునుండి ఆటంకములు తొలగి, ఉద్యోగ వ్యాపారములు లాభసాటిగా నడచును ఆర్థిక లాభం నిర్వాహజీవితంమాత్రం సుఖప్రదంగా యుండదు మాతాపితురులకు గండకాలము. కళత్ర అనారోగ్యము సూచించుచున్నది

మీనము

(పూభా 4 ఉభా, రేవతి)

గ్రహస్థితి మిగుల ప్రతికూలం అక్టోబరు ఆఖరువారములో అష్టమభావములో రవి, కుజులకు వరుణునితో యుతి సంభవించినది యిది అశుభసూచన ధన వ్యయమగుటయేతప్ప యత్నకార్యములేవియు సమకూరవు పైగా అనుకోనని అవాంతరముల నెదుర్కొనవలసివచ్చును. శత్రు, రోగ, ఋణబాధలు అధికమగును శత్రువులు వ్యవహారికంగా అవమానింపజూతురు కళత్ర అనారోగ్యం ఆకస్మిక ప్రమాదములకు గురియగుట మొదలగు అశుభఫలితముల నెదుర్కొనవలసియున్నది నవమకోణములో బుధ బృహస్పతులిద్దరు శుభస్థితిని కలిగియున్నందున, బుద్ధిబలము నుపయోగించియు, మిత్రసహకారములవలన పై ఆపదలకు గురిగాక తప్పుకోగలుగుదురు

(72 వ పేజీ తరువాయి)

కమైన అభావము కుండవస్త్రముగాదు, అను అభావము గాన సమన్వయమైనది.

మో॥ సర్వేషామేవ పదార్థానాముత్తేష్వేవ అంత
ర్భావాత్ సప్తైవపదార్థా ఇతిసిద్ధం

ఈ ప్రకారముగా సర్వపదార్థములు చెప్పబడిన వాట్లలోనే ఇమిడియుండుటచేత ఏడు పదార్థములనియే సిద్ధమైనది

మూ॥ కణాదన్యాయమతయో బాలవ్యుత్పత్తి
సిద్ధయె। అన్నంభట్టైన విదుషా రచితస్తర్క
సంగ్రహః

కణాదమహర్షి రచితమైనది కాణాదము.

గౌతమమహర్షి ప్రణీతము న్యాయమతము

ఈరెండు మతములలో బాలురకు జ్ఞానము కలుగు నిమిత్తమై పండితుడైన అన్నంభట్టుచే రచించబడిన తర్కసంగ్రహము తెలుగుభాషాంతరీకరణము సమాప్తము

Edited, Printed & Published by Sri J Radhakrishna Reddy, Vijayawada-2
Printed at Nava Bharathi Press, Vijayawada-2.